ఆంధ్రప్రదేశ్  శాసన పరిషత్ కార్యకలాపాలు

ANDHRA PRADESH

LEGISLATIVE COUNCIL DEBATES

అధికార నివేదిక

# OFFICIAL REPORT

బుధవారం,  మార్చి 25, 2015,

ఇరవై మూడవ సమావేశం,   సంపుటం–3, నంబరు–13,

**WEDNESDAY, THE 25TH DAY OF MARCH, 2015,**

**TWENTY THIRD SESSION, VOLUME - 3, NO.13,**

*** *

శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**

**PUBLIC GARDENS,**

**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | : | డా. ఎ. చక్రపాణి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | : | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | : | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

**బుధవారం, మార్చి 25, 2015.**

## అధికార నివేదిక

---

విషయ సూచిక

---

(1) ప్రశ్నోత్తరాలు

(2) ప్రకటన

(3) అర్జీ సమర్పణ

(4) కరువు పరిస్థితులపై లఘు చర్చ కొనసాగింపు.

---

**ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL**

**WEDNESDAY, THE 25TH DAY OF MARCH, 2015.**

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)

(HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

(1) **ప్రశ్నోత్తరాలు ః**

MR. CHAIRMAN: Now, Question Hour. Sri Angara Rama Mohan Garu, Please, put your question.

**గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు**

ప్రశ్న నెం. 8042 (1)

సర్వశ్రీ అంగర రామ మోహన్, శ్రీ బొడ్డు భాస్కర రామారావు, ఎం.ఎల్.సిలు.,

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో అక్రమ లేఅవుట్లు అధిక సంఖ్యలో ఉన్నాయన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, జిల్లా వారీగా ఆ వివరాలేమిటి?

ఇ) అట్టి అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి ఏదైనా ప్రతిపాదన ఉన్నదా?

గౌరవనీయులైన పంచాయతీరాజ్ శాఖ మంత్రి (శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు )ః

అ) అవునండీ, 13 జిల్లాలలో 6049 అనధీకృత లే అవుట్లు ఉన్నాయని గుర్తించడమయింది.

ఆ) జిల్లా వారీ అనధీకృత లేఅవుట్ల వివరాలను అనుబంధంలో జతపరచడమయింది.

ఇ) ఒక ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

ప్రశ్న నెంబరు 8042కు అనుబంధం

ఆంధ్రప్రదేశ్ లో జిల్లా వారీగా అనధికార లేఅవుట్ల సంఖ్యను తెలిపే పట్టిక

| వరుస సంఖ్య | జిల్లా పేరు | గుర్తించిన అనధికార లేఅవుట్ల సంఖ్య |
|---|---|---|
| 1 | అనంతపురము | 276 |
| 2 | తూర్పు గోదావరి | 904 |
| 3 | గుంటూరు | 315 |
| 4 | కర్నూలు | 386 |
| 5 | నెల్లూరు | 454 |
| 6 | శ్రీకాకుళం | 205 |
| 7 | విశాఖపట్టణం | 333 |
| 8 | పశ్చిమ గోదావరి | 1292 |
| 9 | వై ఎస్ ఆర్ జిల్లా | 262 |
| 10 | చిత్తూరు | 169 |
| 11 | విజయనగరం | 189 |
| 12 | కృష్ణా | 786 |
| 13 | ప్రకాశం | 478 |
| | మొత్తం | **6049** |

సిహెచ్. అయ్యన్నపాత్రుడు,
పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఎన్ఆర్ఇజిఎస్ శాఖా మంత్రి

శ్రీ అంగర రామ మోహన్ : (స్థానిక సంస్థల నియోజకవర్గం, పశ్చిమ గోదావరి) అధ్యక్షా, టౌన్ ప్రక్కన ఉన్న గ్రామాలలో వేలాది ఎకరాలలో అనధీకృత లే అవుట్లు వచ్చాయి. వాళ్లు అక్కడ రోడ్లు వంటి సౌకర్యాలు ఇచ్చారు కాని పంచాయతీలకు ఇవ్వవలసిన 10 శాతం స్థలం ఇవ్వని కారణంగా అవన్నీ నాన్–లే అవుట్ల క్రింద ఉండిపోవడంతో కొనుగోలుదార్లంతా ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్తు కనెక్షన్ల కోసం, ఇళ్లు కట్టుకోవడానికి అనుమతులు రాక కొనుగోలు దార్లు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల ఇటువంటి అనధికార లే అవుట్ల మీద పెనాల్టీ వేసి క్రమబద్ధీకరిస్తే కోట్లాది రూపాయల ఆదాయం లోకల్ బాడీస్‌కు వస్తుంది. దీని ద్వారా స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి కృషి చేసినట్లవుతుంది కాబట్టి ప్రభుత్వం ఆ దిశగా పరిశీలన చేసినట్లయితే అక్కడ నిర్మాణాలు కూడా జరుగుతాయి. త్వరితగతిన అనధీకృత లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఈ లే అవుట్లు పంచాయతీలకు, పంచాయతీరాజ్‌కు పెనుభారమై పోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే

అవుట్లు చేసి ప్లాట్లను అమ్ముకొని ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా వెళ్లిపోతున్నారు. ఎవరైతే లే ఆవుట్ వేస్తున్నారో వాళ్లే తారు రోడ్లు కాని, సిమెంట్ రోడ్లు కాని, విద్యుత్తు, డ్రైనేజీ, త్రాగునీటికి కావలసిన బోరు, మోటార్లు ఫిక్స్ చేయడం, ఓవర్ హెడ్ ట్యాంక్ను కట్టి అమ్మే విధంగా చర్యలు తీసుకుంటే ప్రభుత్వంపై ఖర్చు తగ్గుతుంది. ఆ మేరకు కొనుగోలుదార్లపైననే భారం పడుతుంది. వాళ్లు ఇతర సౌకర్యాలు ఏమీ కల్పించడం లేదు కాబట్టి అటువంటి సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు కట్టుదిట్టం చేస్తే గ్రామ పంచాయతీలకు భారం తగ్గుతుంది.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు (నామినేటెడ్)ః అధ్యక్షా, అర్బన్ డెవలప్మెంట్ అథార్టీ లే అవుట్లను ఆమోదించిన తరువాత మరల పంచాయతీలకు పంపిస్తున్నారు. పంచాయతీలకు పంపించిన తరువాత వాళ్లు దోపిడీ చేస్తున్నారు. లెక్క ప్రకారం తీసుకోవడం లేదు కాబట్టి అర్బన్ డెవలప్మెంట్ అథార్టీ ఆమోదించిన లే అవుట్లకు సంబంధించి పంచాయతీ పరిధిలో నుండి తీసివేయాలి. ఒకసారి ఉడా ఆమోదించిన లే అవుట్లకు పంచాయతీల నుండి విముక్తి కలుగచేయాలని కోరుతున్నాను. అనుమతులకు సంబంధించిన ఛార్జెస్ కావాలంటే చెల్లించవచ్చు కాని, మరల పంచాయతీ అప్రూవల్ అవసరం లేదని నేను భావిస్తున్నాను.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు ః అధ్యక్షా, ఇది ప్రస్తుతం చాలా మంచి ప్రశ్నగానే నేను భావిస్తున్నాను. కారణం ఏమిటంటే.. లే అవుట్ల సంస్కృతి గతంలో పంచాయతీలలో లేదు. గత 8 సంవత్సరాల నుండి లే అవుట్ల తాలూకు పరిస్థితి పంచాయతీ స్థాయిలో చాలా ఎక్కువగా రావడం జరుగుతోంది. పూర్వం కార్పోరేషన్ ఏరియాలోనో, మున్సిపాలిటీ ఏరియాలోనో లే అవుట్లు వేసేవారు. ఇప్పుడు రాజమండ్రి, నెల్లూరు వంటి ముఖ్య పట్టణాల చుట్టు ప్రక్కల ఉన్న పంచాయతీలలో ఈ లే అవుట్ల సంస్కృతి బాగా వచ్చింది. ఈ లే అవుట్లను వేయడానికి కూడా గతంలోనే కొన్ని మార్గదర్శకాలున్నాయి. 1994లోని సెక్షన్ 121 ప్రకారం... గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా భూమిని భవన నిర్మాణానికి ఉపయోగించడానికి కాని, భవన నిర్మాణం చేయడానికి అనుమతిని మంజూరు చేయడానికి వీలు లేదని ప్రభుత్వం జారీ చేసిన జీ.ఓలో స్పష్టంగా ఉంది.

అలాగే, ముందుగా భూమిని అభివృద్ధి చేయదలచుకున్న వ్యక్తులు కాని, ఆ సంస్థలు కాని వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి రెవెన్యూ డివిజనల్ అధికారి గారి ద్వారా అనుమతి తీసుకోవాలని గతంలోనే ఉంది. లే అవుట్లు వేసిన భూమిలో 10 శాతం భూమిని పబ్లిక్ పర్పస్ కోసం వారి ఖర్చుతోనే పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాలని కూడా జీ.ఓలో ఉంది. అయితే, లే అవుట్లు వేసినప్పుడు extension lay outs లో 30 అడుగుల రోడ్డు ఉండాలని, రిజిస్ట్రేషన్ చేసిన ప్లాన్ ప్రకారం 40 అడుగుల రోడ్డు ఉండాలని జీ.ఓలో ఉంది. జీ.ఓలైతే ఉన్నాయి కాని వాటి అమలుచేయడంలో లోపాలున్నాయి. ఎందుచేతనంటే, పంచాయతీ స్థాయిలో ఉన్న అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, డిపిఓలు కాని, డిపిఎల్ఓల పర్యవేక్షణ లేకపోవడం వల్ల లే అవుట్ల తాలుకూ ఓనర్స్ వాళ్ల ఇష్టం వచ్చినట్లుగా అమ్ముకొని పోతున్నారు. 10 శాతం భూమిని పంచాయతీకి ఇవ్వవలసిన దానిని కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది.

అధ్యక్షా, ప్రభుత్వ సర్వే ప్రకారంగా రాష్ట్ర వ్యాప్తంగా 6049 అనుమతి లేని లే అవుట్లు ఉన్నాయి. అనుమతి ఉన్నవి రాష్ట్రంలో 3280. దీనిని బట్టి చూస్తే, అనుమతులు ఉన్నవి తక్కువ, అనుమతులు లేనివి ఎక్కువ. నేను ఏమంటున్నానంటే.. అనధికార లే అవుట్లను మనం క్రమబద్ధీకరించాల్సిన అవసరముంది. దీనిమీద చర్య తీసుకోవాల్సిన అవసరముంది. దీనిపై ఏమి

చేయాలని రెండు, మూడు నెలల క్రితమే చర్చ జరిగింది. గతంలో నేను గుంటూరు వెళ్లినప్పుడు అధికారులతో మాట్లాడిన తరువాత ఆలోచన చేసి నలుగురి సభ్యులతో ఒక కమిటీని వేశాము. ఆ కమిటీకి ఆర్. అప్పారావు గారిని కో-ఆర్డినేటర్‌గా పెట్టడం జరిగింది. వీరి పర్యవేక్షణలో కుమారి స్వామి గారిని కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు, బాలాజీ గారిని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు, గోవిందనాయుడు గారిని కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపూర్ జిల్లాలకు పర్యవేక్షకులుగా నియమించడం జరిగింది. ఈ నలుగురి పర్యవేక్షణలో ఆయా జిల్లాలలో తిరిగి ఎక్కడ ఏ "లే అవుట్లకు" అనుమతులున్నాయి, ఎక్కడ అనుమతులు లేవు అనే వాటి గురించి వచ్చే నెల లోపు అంటే ఏప్రిల్ చివరి నాటికి ఒక నివేదికను సమర్పించమని చెప్పడం జరిగింది. ఆ రిపోర్టు వచ్చిన వెంటనే దీని మీద ఏమి చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తాము. ఈ లోపు కొన్ని విజిట్లు చేసి మేము కూడా ఒక ఆలోచన చేశాము. దీనిపై రెండు, మూడు సమావేశాలు కూడా జరిగాయి. నా ఉద్దేశం ఏమిటంటే.. ఎవరితై 10 శాతం భూమిని పంచాయతీకి ఇవ్వలేదో వాళ్ల మీద చర్యలు తీసుకోవాలని, ఒకవేళ 10 శాతం భూమి ఉంటే ఆ భూమిని స్వాధీనం చేసుకోవడం, ఆ భూమిని కూడా వాళ్ల సొంత డబ్బుతోనే పంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేయడం, ఒకవేళ భూమి లేదని అనుకున్నప్పుడు పెనాల్టీ వేసి, ఎక్కడైనా ప్రత్యామ్నాయంగా వాళ్ళే భూమిని కొనుగోలు చేసి పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయడం, అది కూడా వీలు కానప్పుడు మార్కెట్ ప్రకారం 500 శాతం పెనాల్టీని వేసి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చేయాలని ఒక ఆలోచన చేస్తున్నాము. ఆ రిపోర్టు వచ్చిన తరువాత ఈ విధంగా చేయాలని ఒక ఆలోచన చేస్తున్నాము. తప్పనిసరిగా లే అవుట్లను క్రమబద్ధీకరించాలి. అదే విధంగా, పంచాయతీల పరిధిలో (గ్రౌండ్ + 2) 30 అడుగుల ఎత్తు కంటే ఎక్కువగా భవనాలకు అనుమతులు ఇవ్వకూడదు. అంతవరకే అనుమతులు ఇవ్వడానికి పంచాయతీలకు అధికారాలున్నాయి. కొన్ని పంచాయతీలలో నాలుగైదు ఫ్లోర్లు నిర్మించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ కూడా కమిటీ ద్వారా ప్రభుత్వ దృష్టికి వచ్చాయి. వాటిపై ఏమి చర్యలు తీసుకోవాలని ఆలోచిస్తున్నాము. వాటిని క్రమబద్ధీకరిస్తే కొంత ఆదాయం పంచాయతీలకు వస్తుంది. అప్పుడు పంచాయతీలు కూడా ఆర్థికంగా పరిపుష్టం కావడానికి అవకాశం ఉంటుంది కాబట్టి తగిన చర్యలు తీసుకుంటాము. కమిటీ నివేదిక వచ్చిన వెంటనే తప్పనిసరిగా దీని మీద వెంటనే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : చంగల్ రాయుడు గారు ఏమి చెబుతున్నారంటే.. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుండా యస్‌ఓసి లేకుండా ఆక్యుపై చేయకూడదని చెబుతున్నారు.

శ్రీ కంతేటి సత్యనారాయణ రాజు : అధ్యక్షా, నేను అడిగిన దానికి మంత్రి గారి నుండి ఎటువంటి సమాధానం రాలేదు. అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ ఆమోదించిన లే అవుట్లను కూడా మరల పంచాయతీలకు పంపిస్తున్నారు. అలా అవసరం లేదని నేను భావిస్తున్నాను. ఈ పద్ధతిని తెలంగాణ ప్రభుత్వం తొలగించింది. ఈ ప్రభుత్వం కూడా తొలగించాలని కోరుతున్నాను. పంచాయతీలు దోపిడి చేస్తున్నాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీకి డబ్బు చెల్లించి, వాళ్లు అన్ని స్క్రూటినీ చేసి ఆమోదించిన తరువాత మరల పంచాయతీకి పంపిస్తున్నారు. అక్కడ అన్యాయాలు జరుగుతున్నాయి కాబట్టి దయచేసి ఈ విషయాన్ని పరిశీలించవలసిందిగా కోరుతున్నాను.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు : అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ బి. చెంగల్ రాయుడు గారు మాట్లాడుతూ, బిటి రోడ్లు, వాటర్ ట్యాంకులు మొదలైన సౌకర్యాలను లే అవుట్లు వేసిన వారే కల్పించేటట్లు చేస్తే ప్రభుత్వం మీద కొంత భారం తగ్గుతుందని చెప్పారు. ఇది మంచి సూచనే. ఆ

వెంచర్‌ను వాళ్లే అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి ఇబ్బంది ఉండదు. పంచాయతీకి కూడా కొంత డబ్బు ఆదా అవుతుంది కాబట్టి తప్పకుండా పరిశీలన చేస్తాం.

సభ్యులు సత్యనారాయణ రాజు గారు మాట్లాడుతూ, పంచాయతీలకు సంబంధం లేకుండా చేస్తే బాగుంటుందని అన్నారు. డైరక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ పరిధిలో కాని, అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ పరిధిలో కాని పెడితే బాగుంటుందని అన్నారు. నేను ఏమంటున్నానంటే.. ఎవరో ఒకరిద్దరు అధికారులు తప్పు చేశారని వాళ్లకున్న అధికారాలను తొలగించడం మంచిది కాదు. ఉన్న చట్టాలను అమలు చేసి తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి కాని, పంచాయతీలకున్న హక్కులను లాక్కోవడమనేది మంచి పద్ధతి కాదని నా అభిప్రాయం.

శ్రీమతి టి. రత్నాబాయి (నామినేటెడ్)ః అధ్యక్షా, ఇంత భారీ ఎత్తున అవినీతి జరుగుతున్నప్పుడు చట్టాలను అతిక్రమించిన అధికారుల మీద చర్యలు తీసుకుంటే బాగుంటుంది. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటే ముందు, ముందు కట్టడి చేసినట్లవుతుంది కాబట్టి వాళ్ల మీద చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు ః అధ్యక్షా, ఇప్పటికే రాజమండ్రి పరిసర ప్రాంతాలలోని అనధికారిక లే అవుట్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరిగింది. అధికారికంగా ఆమోదం పొందిన వాటికంటే అనధికార లేఅవుట్లు ఎక్కువ ఉన్నాయని ముందే చెప్పాను. పొరపాట్లు జరగడానికి దీనిలో అధికారుల నిర్లక్ష్యం కూడా ఉంది. దీనిని కసరత్తు చేసి ఒక దారిలో పెట్టాల్సిన అవసరం ఉంది. లే అవుట్లను మనం సరిగా కంట్రోల్ చేయకపోతే దాని తాలూకు బ్యూటీ అంతా పోతుంది. రాబోయే రోజులలో చాలా ఇబ్బందులు వస్తాయి కాబట్టి దీని మీద కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

MR. CHAIRMAN : Question No. 7830 postponed at the request of the Member. Now Question No. 7896.

## ఆప్కో బకాయిలు

ప్రశ్న నెం. 7896 (3)

శ్రీ మహ్మద్ జాని, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన వెనుకబడిన తరగుతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఆప్కో తమ ఉద్యోగులకు రాష్ట్రంలోని అనేక చేనేత సహకార సంఘాలకు చెల్లించవలసిన బకాయిలు పెరుగుతున్నాయనే విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

ఇ) ఆప్కోను పటిష్టపరచడం కోసం ప్రభుత్వం తీసుకోదలచిన చర్యలు ఏమిటి?

గౌరవనీయులైన వెనుకబడిన తరగుతుల సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ( శ్రీ కొల్లు రవీంద్ర)ః

అ) అవునండీ. నేతకారుల సహకార సంఘాలకు చెల్లింపులు (వ్రాత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఆగస్టు వరకు అని ఇచ్చాము. తరువాత కూడా కొంత చెల్లించడం

జరిగింది.) 2014, అక్టోబరు నుండి మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్న విషయం వాస్తవమే. అయితే, ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిలు ఏమీ లేవు.

ఈ క్రింది వివరించినట్లుగా ఆంధ్రప్రదేశ్‌ఆలో నేతకారుల సహకార సంఘాలకు 2014,అక్టోబరు నుండి 2015, జనవరి వరకు చెల్లించవలసిన బకాయిలు రూ.55 కోట్లుగా ఉన్నాయి. అవి రాష్ట్ర విభజన వల్ల పెండింగ్‌లో ఉన్నాయి.

| డివిజన్ పేరు | సహకార సంఘాలకు చెల్లించవలసిన బకాయిలు (రూ.) (ఆగస్టు , 2014 వరకు) |
|---|---|
| విజయవాడ (గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలు | 5,56,11,800.00 |
| విజయనగరం (విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలు) | 88,10,065.00 |
| శ్రీకాకుళం | 1,60,52,444.00 |
| రాజమండ్రి | 2,81,46,829.00 |
| (తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు) | |
| కడప | 67,45,00,000.00 |
| కర్నూలు | 1,23,84,770.00 |
| తిరుపతి (చిత్తూరు, నెల్లూరు జిల్లాలు) | 1,39,02,898.00 |
| మొత్తం | 80,94,08,806.00 |

ఆగస్టు తరువాత రూ.25 కోట్లు చెల్లించడం జరిగింది కాబట్టి అక్టోబరు నుండి రూ.55 కోట్లు బకాయిలు ఉన్నాయి.

ఆ) ప్రస్తుతం ఆప్కోను విభజించడమవుతున్నది. విభజన ప్రక్రియ పూర్తయిన తరువాత ఆప్కోను పటిష్టపరచడానికి సవివరణమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు పరచడమవుతుంది.

శ్రీ మహ్మద్ జాని (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, నాకున్న సమాచారం ప్రకారం.. నేతకారుల సహకార సంఘాలకు ఆంధ్రా వాటాగా రూ.182కోట్లు, తెలంగాణ వాటా రూ.104 కోట్లు బకాయి ఉన్నట్లు తెలిసింది.. దీని మీద వడ్డీ రూ.20 కోట్లు ప్రభుత్వం చెల్లించాలి. ఈ వాటాను ఎప్పుడు చెల్లిస్తారని మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను. రెండవది, ఆప్కో విభజన ప్రక్రియ ఏ దశలో ఉంది?

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, ఆప్కో వాళ్లు ఇతర రాష్ట్రాల నుండి బట్టలు తెప్పించి పాఠశాల విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ బట్ట లేనట్లు పొరుగు రాష్ట్రమైన తమిళనాడు నుండి తెప్పించి పాఠశాల విద్యార్థులకు ఇస్తున్నారు. అలాంటి బట్టలు మన రాష్ట్రంలో దొరకవా? అలాంటి చర్యలు వాళ్ల కమీషన్ల కోసం చేసుకుంటున్నారు. దానికి సంబంధించి సమాచారాన్ని ఇవ్వవలసిందిగా మీ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర : అధ్యక్షా, మహ్మద్ జాని గారు అడిగిన దానికి – ఆప్కో విభజన ప్రక్రియ జరుగుతోంది. దాని మీద రిపోర్టును తయారు చేస్తున్నారు. ఒక నెల రోజుల లోపే విభజన ప్రక్రియ పూర్తి అయి తెలంగాణకు, మనకు ఉన్న వాటాలను తెగతెంపులు చేసుకొని తిరిగి ఆంధ్ర రాష్ట్రంలో ఆప్కోను నడిపించడం జరుగుతుంది. అలాగే, బి. చెంగల్ రాయుడు గారు చెప్పినట్లుగా.. ఇతర రాష్ట్రాల నుండి ఎక్కడి నుండి కూడా పాఠశాల విద్యార్థుల కిచ్చే బట్టను ప్రొక్యూర్ చేయడం లేదు. మన రాష్ట్రంలోనే ఈ ప్రొక్యూర్‌మెంట్ జరుగుతోంది.

శ్రీ మహ్మద్ జాని : అధ్యక్షా, రూ.182 కోట్లు బాకీ ఉన్న మాట నిజమా? కాదా? సంవత్సరానికి రూ.20 కోట్లు వడ్డీ చెల్లించవలసి ఉందా? లేదా?

శ్రీ కొల్లు రవీంద్ర : అధ్యక్షా, సర్వశిక్షా అభియాన్ క్రింద బట్టను ప్రొక్యూర్ చేసుకోవడం జరుగుతోంది. దానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నుండి రావలసి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి రూ.55 కోట్లు రావలసి ఉంది. త్వరలోనే వాటిని వసూలు చేసి బకాయిలన్నింటిని క్లియర్ చేయడం జరుగుతుంది.

శ్రీ మహ్మద్ జాని : అధ్యక్షా, ఎంత బాకీ ఉందని అడుగుతున్నాను. రూ.182 కోట్లు ఆంధ్రా, రూ.114 తెలంగాణ అని డివైడ్ చేశారు. ఈ మొత్తాన్ని నేతకారుల సహకార సంఘాలకు ఎప్పుడు ఎలా తీరుస్తారు?

శ్రీ కొల్లు రవీంద్ర : అధ్యక్షా, నేతకారుల సహకార సంఘాలకు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ.52 కోట్లు ఇవ్వాలి. అలాగే, తెలంగాణ ప్రభుత్వం నుండి రూ.95 కోట్లు చెల్లించాలి. మొత్తం రూ.147 కోట్లు రెండు ప్రభుత్వాలు చెల్లించవలసి ఉంది. త్వరలోనే వీటిని విడుదల చేసి సహకార సంఘాలన్నింటికి చెల్లించడం జరుగుతుందని తెలియజేస్తున్నాను.

MR. CHAIRMAN : Question No. 7960 postponed at the request of the Member. Now Question No. 7961.

## మహిళలపై అత్యాచారాలు

ప్రశ్న నెం. 7961(5)

శ్రీమతి పమిడి శమంతకమణి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (హోం మంత్రి)గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాతచార కేసులలో గణనీయమైన పెరుగుదల ఉన్నదా?

ఆ) అయితే, ఆ వివరాలు ఏమిటి, అట్టి కార్యకలాపాలను అణచివేయడానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (హోం మంత్రి, శ్రీ ఎన్. చిన రాజప్ప):

అ) లేదండీ. 2014వ సంవత్సరంలో మహిళలు, బాలికలపై నేరాల కేసులు తగ్గాయి. 2013 సంవత్సరంలో మొత్తం 14,731 కేసులు నమోదు కాగా, 2014 వ సంవత్సరంలో 13,549 కేసులు నమోదు అయ్యాయి.

ఆ) మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడిన నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతున్నది.

మహిళలపై నేరాలు, లైంగిక దాడులను నివారించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ క్రింది చర్యలు తీసుకుంటున్నది.

i) 100 నెంబర్‌కు ఫోన్ చేసే సదుపాయంతోసహా, మహిళా హెల్ప్‌లైన్ 1091ను ప్రాచుర్యంలోకి తేవడమవుతున్నది. ఏదైనా సమస్య లేదా ఏదైనా వేధింపును ఎదుర్కొంటున్న ఎవరైనా బాలిక లేదా మహిళ 1091కు ఫోన్ చేయవచ్చును. పోలీసులు వెంటనే స్పందిస్తారు.

ii) అదనపు ఎస్‌పి ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో ప్రత్యేక దళాలను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ డిజిపి యూనిట్ అధికారులందరికీ ఆదేశాలను జారీ చేశారు.

iii) మహిళలపై నేరాలు, లైంగిక దాడులను సీనియర్ పోలీస్ అధికారులు నియతకాలికంగా సమీక్షించి, సంచలన కేసులలో నిందితునిపై నేర చర్యతోపాటు సహాయం, పునరావాసానికి సంబంధించి ఆదేశాలను జారీ చేయడం జరుగుతున్నది.

శ్రీమతి పి. శమంతకమణి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మంత్రి గారు సమాధానం చెబుతూ, మొదటి ప్రశ్నకు లేదండీ అని అన్నారు. రెండవ ప్రశ్నకు మాత్రం కొంత సమాధానం చెప్పారు. ప్రతి రోజు పేపర్ తెరవగానే తప్పనిసరిగా కనపడే ఒక వార్త మహిళల మీద అత్యాచారమో లేక మహిళల మీద దాడో ఏదో ఒకటి వస్తోంది. పేపర్ వాళ్లు అసత్యాలు వ్రాస్తున్నారా లేకపోతే జరిగింది వాస్తవం కాదా అని మంత్రి గారిని మీ ద్వారా నేను అడుగుతున్నాను.

**ఉ.10.20**

రెండవ ప్రశ్నగా పోలీసులు తీసుకునే చర్యలేమిటి అని అడిగాము. పూజిత అనే అమ్మాయి విషయంలో మొన్నటి నుండి ఇప్పటివరకూ ఏ ఒక్కరిని పట్టుకోలేదు. ఇంతవరకూ ఇతడు నిందితుడు అని చెప్పలేదు. వాళ్లమీద ఏ విధమైన చర్యలు తీసుకున్నారనేది కూడా చెప్పలేదు. మొన్నీమధ్య కొత్తగా ఒక చట్టం వచ్చింది. నిందితుడుగా ఎవరినైతే పట్టుకున్నారో వాళ్ల మీద అంతకుముందు కేసులు లేకపోతే ఆ సాయంకాలమే పోలీసు స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్ బెయిల్ ఇవ్వవచ్చు అనే చట్టం వచ్చింది. దీనివల్ల ఎంతమంది నిందితులు తప్పించుకునే అవకాశం ఏర్పడుతోందో ఆలోచించవచ్చు. బూజు పట్టిన చట్టాల గురించి ఆలోచిస్తున్నారే గానీ, మహిళలమీద జరిగే దాడుల గురించి పట్టించుకోవడం లేదు. ఆరు సంవత్సరాల పిల్లల దగ్గర నుండి 60 సంవత్సరాల వృద్ధుల వరకూ బాధితులు ఉంటున్నారు. మొన్న పశ్చిమ బెంగాల్‌లో 72 సంవత్సరాల 'నన్' మీద జరిగిన దాడి మనందరికీ తెలిసినదే. సమాజం తల దించుకునేలా ఈ విధమైన సంఘటనలు జరుగుతున్నాయి. తండ్రి మూడు సంవత్సరాల పిల్లను చంపేశాడనో, 6 సంవత్సరాల

బాలికను పక్కింటాయన చేరదీసి చాక్లెట్ ఇచ్చి అఘాయిత్యం చేశాడనో ఏదో ఒక వార్త రోజూ పేపర్లలో చూస్తూనే ఉన్నాము. పోలీసులు ఏదో నంబరు ఇచ్చాము, ఫోన్ చేయండి అని అంటే అందరికీ సాధ్యం అవుతుందా? బిడ్డ అగచాట్లు పడుతుంటే, ఏ తల్లిదండ్రులు ఆ ఫోన్ నంబరు తీసుకుని చేస్తారు? ఆ టెన్షన్ అటువంటిది. కాబట్టి, చట్టాలను మార్చమని నేనడుగుతున్నాను. నిందితుడు ఎంతటివాడైనా అప్పటికప్పుడే కఠిన శిక్ష వేయండి. ఆ విధంగా ఇద్దరు ముగ్గురికి జరిగితే తప్ప మిగిలిన వాళ్లు భయపడరు. అలా జరిగితేనైనా కొంతమేరకు నేరాలు తగ్గుతాయి. సాయంకాలానికి బెయిల్ తెచ్చుకుంటుంటే ఎవరు భయపడతారు? ఈ విషయమై కఠిన నిర్ణయాలు తీసుకోవలసిందిగా నేను కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి (శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, ఎక్కడో ఢిల్లీలో నిర్భయ సంఘటన జరిగిందని మనం ఎవరం కూడా నోరు మూసుకుని కూర్చోలేదు. అన్ని రాష్ట్రాలలోనూ, ప్రపంచంలోని తెలుగువాళ్లందరూ కూడా స్పందించారు. తెలంగాణా రాష్ట్రంలో మొన్న ఐఎఎస్, ఐపిఎస్ నివాస గృహాల వద్ద ఒక సంఘటన జరిగింది. మన ప్రభుత్వం కాదు కదా అని అనవచ్చు. కానీ, ఆ అమ్మాయి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బెజవాడలోని నందిగామ నియోజకవర్గానికి చెందిన అమ్మాయి. ఆ అమ్మాయి ఒళ్లు కాల్చుకుందిట. మంటలు మండుతుంటే ఎటూ పొర్లకుండా, అంగుళం కూడా కదలకుండా శరీరం అక్కడ ఉందట. తెలంగాణా రాష్ట్రం పోలీసులు ఆ విధంగా చెబితే, మన పోలీసులు తీసుకోవలసిన చర్యలేమిటి? మా అమ్మాయిని ఏదో చేశారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ, తెలంగాణా రాష్ట్ర పోలీసులు మాత్రం ఆ అమ్మాయి మీద మానభంగం జరగలేదని చెబుతున్నారు. ఇదెంతవరకూ సత్యం? దీనిపైన మన రాష్ట్ర పోలీసులు కూడా ఎన్క్వైరీ చేయాల్సిన అవసరం ఉందా, లేదా? కృష్ణాజిల్లాలో ఆ అమ్మాయి తాలూకు వాళ్లు నాలుగు రోజులనుండి ఆక్రోశిస్తున్నారు. నిన్నొక సంఘటన జరిగిందని ఇవాళ పేపర్లో చూశాము. ఆంధ్రప్రదేశ్ అమ్మాయిలకు ఇక్కడ రక్షణ లేకుండా పోయినప్పుడు మన రాష్ట్ర పోలీసు యంత్రాంగం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందని నేను హోం మంత్రిగారిని ప్రశ్నిస్తున్నాను. అమ్మాయిలను తీసుకుపోయి ఇతర దేశాలకు అమ్మే పరిస్థితి కూడా హైదరాబాదు నుండి ఎక్కువగా జరిగింది. మొన్నటివరకూ ఉమ్మడి రాష్ట్రంగానే ఉన్నది, ఇప్పుడు విడిపోయింది. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని అనేక జిల్లాల నుండి అమ్మాయిలను తీసుకువచ్చి ఇక్కడ నుండి విదేశాలకు పంపుతున్నారు. కాబట్టి, తెలంగాణా రాష్ట్ర హోం మంత్రిగారు, ఆంధ్రరాష్ట్ర హోం మంత్రిగారు, ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగం కలిసి కూర్చుని ఈ అంశమై తగు చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే ఈ నగరంలో చిన్న పిల్లలను కిడ్నాప్ చేయడం, అమ్మాయిలను మానభంగం చేయడం, అమ్మాయిలను అమ్మేయడం, కాల్చేయడం వంటివి జరుగుతుంటే కడుపు తరుక్కుపోతోంది, గుండె రగిలిపోతోంది. ఆడవాళ్లంటే అంత అలుసా? రాష్ట్రపతిగా, ప్రధాన మంత్రిగా, చట్టసభలలో సభాపతులుగా చేశారు. అంతరిక్షానికి ఆడవాళ్లు చేరుకున్నారు. ఈ విషయమై మహిళా సభ్యులం నేను, శమంతకమణిగారే మాట్లాడాలా? ఇక్కడున్న అందరూ కూడా స్పందించాలి. ఆడవాళ్లు అమ్మగా, చెల్లిగా, భార్యగా, బిడ్డగా మగవాళ్లకు సేవ చేస్తున్నారు. సమాజంలో తండ్రి కంటే తల్లే ప్రధానం. అందుకే ముందుగా మాతృదేవోభవ అన్నారు. మన చుట్టుపక్కల ప్రకటనలతో ఉన్న బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలను తగులబెట్టండి. వాటి స్థానంలో ఆడవాళ్ల పట్ల గౌరవం కలిగేవిధంగా, చెడు ఆలోచనలు ఉన్నవాళ్లకి జ్ఞానోదయం అయ్యే విధంగా "ఇటువంటి ఘోరాలు నీ తల్లికి, చెల్లికి జరిగితే ఎలా ఉంటుందో ఆలోచించు ఒక్క క్షణం" అనే మాటలతో పెద్ద పెద్ద కటౌట్లు పెట్టాలని కోరుతున్నాను. లేదా కౌన్సెలింగ్ అయినా ఇప్పిద్దాము. ఇంతకుముందు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా

ఉన్నప్పుడు ఎయిడ్స్ గురించి మాట్లాడితే అందరూ నవ్వారు. ఆయన నోరు తెరవండి అని అందరినీ ఎడ్యుకేట్ చేసి ఎంతో ఖర్చు పెట్టి ప్రచారం చేసి ఎక్కడికక్కడ బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలలో అవగాహన తీసుకువచ్చి 9 సంవత్సరాలలో ఆ వ్యాధిని ఎంత నియంత్రించారో అందరికీ తెలుసు. టి.బి., మలేరియా వస్తే ఎలా ట్రీట్ చేస్తారో దీనిని కూడా అలాగే చూడాలి. ఇది కూడా ఒక అంటురోగమే. ఆడవాళ్లను చూస్తే వెర్రి వేషాలు వేయడం కూడా ఒక అంటురోగమే. ఈ రోగాన్ని తగ్గించాలంటే, ఆడవాళ్లకు రక్షణ కలగాలంటే ఖచ్చితంగా కౌన్సిలింగ్ అయినా ఇప్పించాలి, దీనిపైన అఖిలపక్ష సమావేశాలైనా ఏర్పాటు చేయాలి. అన్ని రాష్ట్రాల హోం మంత్రులను పిలిచి ప్రధానమంత్రిగారు కూడా దీనిపైన ఏం చేయాలనేదానిని ఆలోచించాల్సిన అవసరమున్నది. మేమేదో ఇక్కడ కూర్చుని మాట్లాడడం, బయట మహిళా సంఘాలు ధర్నాలు చేయడం, వాళ్లకు హామీ ఇవ్వడం ఇదేదో మహిళల సమస్య అని అనుకోవడం మంచి పద్ధతి కాదు. దయచేసి పూజిత విషయంలో ఇది హైదరాబాదులో జరిగింది, తెలంగాణాలో జరిగింది అని కాకుండా, వాటిపైన ఎన్క్వైరీ వేయమని హోం మంత్రిగారిని అడుగుతున్నాను. ఇటువంటివి చాలా జరుగుతున్నాయి. జాగ్రత్తలు తీసుకోండి. అమ్మాయిల అమ్మకాలు, వారిపై అఘాయిత్యాలు చాలా జరుగుతున్నాయి. పాఠశాలలో, హాస్పిటల్లో, హాస్టల్లో కనీసం ఇంట్లో కూడా ఆడపిల్లకు రక్షణ లేదు. అన్న చెల్లెలిపై అఘాయిత్యం చేశాడని ఇవాళ పేపర్లో చూశాను. ప్రముఖ పేపర్లో ఫోటోలు వచ్చాయి. ఏం మాయరోగం వచ్చింది. ఇవన్నీ మేము భరించలేము. దీనిపైన అందరూ మాట్లాడవలసిన అవసరం ఉంది. దయచేసి తమరు రూలింగ్ ఇవ్వండి.

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) ః దీనిపైన షార్ట్ డిస్కషన్ పెట్టండి సార్, అందరం మాట్లాడతాము.

మిస్టర్ ఛైర్మన్ ః సమాజంలో విలువలు తగ్గిపోయాయి. వావివరసలు లేవు. దీనికి కారణమేమిటని ఆ వైపుగా ఆలోచించాలి. సమాజంలో మంచిచెడ్డలు తెలుసుకునేలా చేయాలి. చట్టాలు ఉన్నాయి. సవరణలు ఉన్నాయి. ఇంప్లిమెంటేషన్ అవసరం ఉంది. ఒక్కోసారి మనం ఎక్కడికి వెడుతున్నామో అనిపిస్తోంది.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శమంతకమణిగారు అడిగిన ప్రశ్నకు తగ్గుతున్నాయని చెప్పాను గానీ, జరగడం లేదని కాదు. ఈ కేసులన్నీ పరిశీలించడం కోసం చంద్రబాబు నాయుడు గారు వచ్చిన తరువాత అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు చేసే వారిని 'పోస్కో చట్టం' ప్రకారం శిక్షించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. మహిళలపై నేరాలను అరికట్టేందుకు నిర్భయ చట్టం ద్వారా కేసులు పెట్టడం కూడా జరుగుతున్నది. ప్రత్యేకంగా మహిళల కోసం డియస్పిలను ఏర్పాటు చేసి ఎన్క్వైరీ చేయడమే కాకుండా కేసులను త్వరగా డిస్పోజ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇతర రాష్ట్రాలలో జరిగిన సంఘటనలను ఇతర రాష్ట్రాలవారే పరిశీలించాలి. కావాలనుకుంటే మన రాష్ట్ర పోలీసు యంత్రాంగం పర్స్యూ చేస్తుంది తప్ప ఎన్క్వైరీ చేయడానికి మనకు సంబంధం లేదు. ఏదైనా విషయం మా దృష్టికి వచ్చినప్పుడు మేము మాట్లాడడం జరుగుతుంది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ః అధ్యక్షా, పూజిత విషయం మన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవలసిన అవసరం ఉందా లేదా అని నేనడుగుతున్నాను. తెలంగాణా ప్రభుత్వం మానభంగం జరగలేదని, ఆ అమ్మాయే ఆత్మహత్య చేసుకుందని చెప్పింది. మన రాష్ట్రానికి చెందిన అమ్మాయి కాబట్టి మన బాధ్యత ఏమీ లేదా అని నేను మంత్రిగారిని అడుగుతున్నాను. ఐఏఎస్,

ఐపిఎస్ నివాస గృహాల మధ్య ఆ అమ్మాయి పడి ఉందంటే, అంగుళం కూడా కదలలేదంటే , కాలిపోయి అక్కడ పడి ఉందా లేక చనిపోయిన తరువాత కాల్చేశారా అనేది తేలాలి కదా! ఈ విషయంలో మన బాధ్యత ఏమిటనేది నేను మంత్రిగారిని అడగదల్చుకున్నాను.

ఉ. **10.30**

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, మంత్రిగారు ఈ చర్యలు తీసుకుంటామని అంటున్నారే కానీ నా ప్రశ్నకు జవాబు రాలేదు. ఎంతమంది నిందితులను గుర్తించారు? వారిపై ఎటువంటి కఠిన చర్యలు తీసుకున్నారో చెప్పవలసిందిగా నేను తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, ఒక ముఖ్యమైన విషయం. బాధితురాలు మరియు ఆమె తల్లిదండ్రుల యొక్క ఫొటోలను చూపిస్తారు కానీ ఆ మానభంగం చేసిన వారి ఫొటోలు అసలు చూపించరు. ఒక ప్రముఖ నాయకుడి కొడుకు లేదా ఒక ప్రముఖ వ్యాపారవేత్త కొడుకు లేదా ఒక ప్రముఖ అధికారి కొడుకు అని చెబుతారు. ఆ నిందితుడిని ముసుగు వేసి తీసుకెళతారు. బాధితురాలిని బట్టబయలు చేయడం ఏమిటి? ఎవరైతే నేరం చేశారో వారిని రక్షించడానికి ప్రయత్నం జరగడం ఏమిటి? అసలు ఎందుకిలా జరుగుతుంది? నేను ఈ ప్రభుత్వాన్ని మాత్రమే అనడం లేదు. ఎక్కడైనా ఈ విధంగానే జరుగుతోంది. ఆ నిందితుల ముఖాన ముసుగులు తీసివేయాలి. వారి ముఖం సమాజానికి తెలియాలి కదా? ముసుగు వేస్తే వాడికి మళ్లీ పెళ్లి కాదని చేస్తున్నారా లేదా వాడు ఫలానా వారి కొడుకు అని తెలుస్తుందని ఆ విధంగా చేస్తున్నారా? బాధితురాలి ఫొటోలన్నీ చూపించారు కదా? దయచేసి నిందితుల ముసుగును తొలగించండి. ఎంతటి వాడైనా, ఎవరైనా వారిని కఠినంగా శిక్షించాలని నేను తమరిద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప: అధ్యక్షా, ఈ ముసుగు వేయడమనేది కోర్టు డైరక్షన్ వల్ల జరుగుతోంది. కోర్టు ఆదేశాలు తప్పనిసరిగా ఫాలో అవ్వాలి కాబట్టి నిందితులకు ముసుగువేయడం జరుగుతుంది. 2013వ సంవత్సరంలో 14,737 కేసులు, 2014వ సంవత్సరంలో 13,549 కేసులు నమోదయ్యాయని చెప్పడం జరిగింది. గౌరవసభ్యురాలు ఏదైనా ఫలానా కేసు అని చెబితే దాని గురించి కూడా పరిశీలించడం జరుగుతుంది. ఇతర రాష్ట్రాల కేసుల విషయంలో మనం వేలు పెట్టడానికి లేదు గానీ ఖచ్చితంగా అటువంటి కేసులను పర్స్యూ చేయడం జరుగుతుందని నేను తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, పూజిత మన కృష్ణా జిల్లా అమ్మాయి కాబట్టి ఆ కేసులో వేలుపెట్టడానికి లేదని చెబుతున్నారు. ఇది చాలా అన్యాయం.

MR.CHAIRMAN: Smt. Raja Kumari Garu, you come with a Motion for discussion. We can't allow discussion on this subject like this.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మహిళల మీద ప్రత్యేకించి బాలికల మీద జరుగుతున్నటువంటి అత్యాచారాలకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం గానీ, మనం గానీ, సమాజం గానీ సమగ్రంగా ఆలోచించడం లేదనేది నా అభిప్రాయం. ఇది స్త్రీకి, పురుషునికి మధ్య ఉన్నటువంటి ప్రకృతి సంబంధమైనటువంటి ఒకానొక అంశాన్ని sensitize చేసి, దానిలో నుంచి చట్టాలను చేసి, ఆ చట్టాలను అమలుచేయడంతోనే మన పని అయిపోయిందనే ఒక పరిస్థితికి నేడున్న సమాజం, వ్యవస్థ రావడం దౌర్భాగ్యం. దీనికి సాంస్కృతికపరమైన కారణాలు

ఏమున్నాయి, శాస్త్రీయపరమైన విధానాలు అవలంబించకపోవడం వల్ల వచ్చినటువంటి కారణాలు ఏమున్నాయి, ప్రస్తుతమున్న వ్యవస్థలో దీనిని నిరోధించడానికి తీసుకోవలసిన చర్యలు తీసుకోవడంలో ఆయా రంగాలకు చెందిన వారు ఎట్లా విఫలమవుతున్నారు, అసలు ఇటువంటి సంఘటనలు జరగకుండా ఆపడానికి తీసుకోవలసిన చర్యలు ఏమిటనే విషయాలపై చర్చించకుండా, ఒక పర్టిక్యులర్ సంఘటనలో ఒక అమ్మాయికో లేక ఒక స్త్రీకో జరిగినటువంటి విషయాన్ని ఖండించవలసిందే, దానిపై చర్య తీసుకోవలసిందే, దానిపై అభ్యంతరం తెలుపవలసిన అవసరం లేదు. కానీ, ఈ విధంగా జరుగుతోంది. దీని వెనుక ఉన్నటువంటి మూలకారణాలు ఏమిటి? ఈ మూల కారణాలను తొలగించడానికి మనం చేస్తున్నటువంటి ప్రయత్నం ఏమిటి? ప్రభుత్వాలు తీసుకున్న చొరవ ఏమిటి? మన పౌరసమాజం యొక్క రియాక్షన్ ఏమిటి? పౌరసమాజం యొక్క దృష్టిని ఇటువంటి విషయాలపై ఎలా మళ్లించాలి?

అధ్యక్షా, 72 సంవత్సరాల వయస్సుగల స్త్రీని ఏడెనిమిది మంది కలిసి మానభంగం చేయడమంటే, ఇది సెక్సుకు సంబంధించిన విషయం కాదు. అలాగే, యుక్తవయస్సుకు రానటువంటి ఆడపిల్లను కొంతమంది అత్యాచారం చేయడమనేది కూడా సెక్సుకు సంబంధించిన విషయం కాదు. ఇదేదో ఒక వ్యాధికి సంబంధించిన విషయం. అలాగే, మన సంస్కృతి, మన సంప్రదాయాలు ఏ విధంగా ఉన్నాయి? మహిళలను, మహిళలతోనే వ్యాపార వస్తువులుగా పరిగణింపజేసేటటువంటి సంస్కృతి మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. నేను తమరిద్వారా మనవిచేసేదేమిటంటే, ఈరోజు మీరు టెలివిజన్‌లో ఏ ఛానల్‌ను పెట్టినా ఆడవాళ్లను వినియోగపు వస్తువు కంటే చవకగా, త్రాగి పారేసినటువంటి బీడీ ముక్క మాదిరిగా, చుట్టముక్క మాదిరిగా, అసలు ఆడదానిని అనుభవించడమనేది మగవాడికి పుట్టుకతో వచ్చినటువంటి హక్కుగా ప్రత్యక్షంగా చూపిస్తున్నటువంటి పరిస్థితి ఉంది. కుళాయి ఓపెన్ చేసి నీరు కారుతూ ఉంటే చూస్తూ ఊరుకుని క్రింద పడిన ఆ నీళ్లను శుభ్రం చేస్తూ పోతే లాభం ఏముంది? I am asking the Question that what action is being taken by the Government to control the tap? మన సంస్కృతి, మన వ్యవహారం, మన పౌరసమాజం, దీని వెనుక ఉన్న శాస్త్రీయత మొదలైన విషయాల్లోకి పోకుండా, పురుషాధిక్యత కలిగిన ఈ సమాజంలో పురుషాహంకారాన్ని, సాంస్కృతిక, సంప్రదాయాలను పెంచిపోషించేటటువంటి ఈ వ్యవస్థను ప్రశ్నించకుండా, ఈ వ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి మనం ప్రయత్నం చేయకుండా, పైన అధికంగా వెలుగులోకి వస్తున్నటువంటి రెండు, మూడు అంశాలపై మన సానుభూతిని, మన అక్కసును వెళ్లబుచ్చినంత మాత్రాన ఈ సమస్య ఇలాగే కొనసాగుతుంది. నిర్భయకు సంబంధించిన కేసులో ఢిల్లీ మొత్తం కదిలి వీధిల్లోకి వచ్చింది. ప్రపంచం మొత్తం కూడా అది చూసింది. నిర్భయ చట్టం జస్టిస్ వర్మగారి ఆధ్వర్యంలో చాలా stringent conditionsతో అమలులోకి రావడం జరిగింది. కానీ, ఏమైనా ఆగాయా? ఆగలేదు. పైగా, ఇదొక పెద్ద విలువైనటువంటి అంశంగా తయారైపోయింది. కేవలం చట్టాల ద్వారా, పోలీసుల ద్వారా ఇటువంటి సమస్యలు పరిష్కారం కావు. మన సాంస్కృతిక నేపథ్యాన్ని, విలువలను, పౌరసమాజం యొక్క ప్రమేయం మొదలగు విషయాలపై ప్రభుత్వం ఏ విధమైన జవాబుదారీతనాన్ని అవలంబిస్తుందనే దానిపై ఈ విషయం ఆధారపడి ఉంటుంది కాబట్టి మహిళా సంఘాలతో, మేధావులతో, పోలీసు అధికారులతో, ఉత్సాహకరమైన గ్రూపులతో ఈ విషయానికి సంబంధించినటువంటి నూతనమైన, శాస్త్రీయమైనటువంటి చొరవకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడమనేది అత్యవసరమని నేను తమరిద్వారా ప్రభుత్వానికి మనవిచేస్తున్నాను.

SRI R. REDDAPPA REDDY (Nominated): Sir, in fact, there are sufficient and stringent Laws but, there is no sincerity in implementation of those Laws. There is no fear of Law to the Offenders/accused. Here, I would like to tell one instance that even at

the highest level, in one of the Central Government Organization in our State only, one IAS Officer has been harassing his subordinate and she was an IRF Officer. She ran from Pillar to Post to get justice. Even after six month there was no action initiate against that IAS Officer. Ultimately, that article has been published in the News papers. Later, the maximum punishment has been awarded to that IAS Officer and he has been repatriated to Home Cadre. Actually, there is no fear of Law to the Offenders and there is a strong feeling to the Offenders that they can get away from the Offences. As to how best the Hon'ble Minister for Home and the Police Department will address and sensitize all the Police Officers' right from the Constable to the Highest Level Officers' should have a strong commitment to take these cognizable Offences very seriously.

శ్రీ సి.రామచంద్రయ్య (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, మహిళలపై ఇటువంటి సంఘటనలు జరిగినపుడు, ఏదో సానుభూతిని చూపించడం, తాత్కాలిక చర్యలు తీసుకోవడమనేది it is a phenomena throughout the Country, not only in Andhra Pradesh. దేశమంతా ఈ విధంగానే ఉంది. In my view, there should be a multi-pronged attack to solve these problems. అసలు వావివరసలే లేకుండా పోతున్నాయి. మన సమాజంలో హిందువులు ఎక్కువగా ఉన్నారు. వావివరసలు లేకుండా ఉండడం, వింటుంటే ఎంత జుగుప్సాకరంగా ఉందంటే, ఇంట్లో ఆడవాళ్లతో కూడా మాట్లాడలేని పరిస్థితి వచ్చింది. అంత దారుణమైన పరిస్థితి నేడు సమాజంలో నెలకొని ఉంది. ఈ మధ్యనే ఇద్దరు కుర్రవాళ్లు చేసినదానికి వాడు మేజర్ కాదు కాబట్టి జువెనైల్ హోమ్‌కు వాడిని రాచమర్యాదలతో పంపించారు. నేరం చేసేవాడికి ఎందుకు క్షమాబిక్ష? ఆ శక్తి ఉండి, ఉద్దేశపూర్వకంగా, బుద్ధిపూర్వకంగా వాడు ఆ తప్పును చేయడం జరిగింది. ఆ విధంగా చేసినపుడు వాడిని వదలిపెట్టడం, ప్రభుత్వ ఖర్చులతో జువెనైల్ హోమ్‌లో పెట్టి వాడిని సాకడం ఎందుకు? ఇటువంటి సంఘటనల విషయంలో మనంగానీ, ప్రభుత్వాలు గానీ మొత్తం రీ-ఓరియంటేషన్‌తో ఉండాలి.

ఉ. **10.40**

మనమేదో సానుభూతి కోసం మాట్లాడడంకాదు. ఈ మధ్య ఒక పాపను బస్‌లో ఏడిపించే ప్రయత్నం జరిగితే ఆ సంఘటన గురించి నేను ఏసిపితో ఐదుసార్లు మాట్లాడాల్సి వచ్చింది. Nobody has taken action. నేను దీనిని తప్పు పట్టడంలేదు. ఇదొక జాతీయ సమస్యగా అయిపోయింది. ఇటీవల నెల్లూరులో జరిగిన ఇంటర్నేషనల్ వుమెన్ ఫోరం సమావేశంలో ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ ఎవరైనా ఇట్లా చేస్తే చర్మం ఊడదీస్తానని చాలా స్ట్రిక్ట్‌గా కూడా చెప్పడం జరిగింది. ముఖ్యమంత్రిగారు వార్నింగ్ ఇచ్చినా వారికి భయమే లేదు. దీనికి కారణం గ్రౌండ్‌లెవల్‌లో డిపార్టుమెంట్ ఫెయిల్యూర్ ఉందని హానెస్ట్‌గా చెప్తున్నాను. బలిసినవాడి కొడుకు ఇట్లాంటి పనిచేస్తే అలాంటివాడిని ఎగ్జామిన్ చేయడం లేదు. వదిలేస్తున్నారు. మొన్న ఒక సంఘటన జరిగింది. కళాశాల విద్యార్థులందరితో కలిసి ఒక పాప బస్సులో పోతుంటే ఒకడు ఆ పాపతో అసభ్యంగా ప్రవర్తించినప్పుడు ఆ పాప slap చేస్తే, ఆ పాపపైనే కేసు పెట్టినారు సార్ వాళ్ళు. మేము జోక్యం చేసుకున్నా ఆ సమస్య పరిష్కారంకాలేదు. ఎందుకంటే వాడు బలిసినవాడి కొడుకు. ఈ విధంగా చట్టం కొందరికి ఒక విధంగా, మరికొందరికి వేరే విధంగా అమలు చేస్తుంటే ఎలా సార్? Strict observance of the laws. చట్టాలు అమలు చేయడం బాగుంటే ప్రజలు కూడా ఫాలో అవుతారు. Law enforcement సరిగ్గా లేకపోయినా, stringent punishments లేకపోయినా ఇలాంటివన్నీ జరుగుతుంటాయి. చంద్రశేఖర్‌గారు చెప్పినట్లుగా దీనిపై అందరూ కూర్చుని చర్చించాల్సిన అవసరముంది. CRPP మనచేతిలో లేదు కాబట్టి ఇందాక సోదరి చెప్పినట్లు కావాలంటే ఇక్కడ్నుంచి Resolution పాస్ చేసి అమెండ్‌మెంట్స్ తీసుకురమ్మని చెప్పాలి.

మిస్టర్ ఛైర్మన్: నిర్భయ చట్టంకూడా తెచ్చారు కదా.

శ్రీ సి.రామచంద్రయ్య: ఏంటి సార్ నిర్భయ చట్టం. నిర్భయ చట్టం తెచ్చినాకనే ఘోరాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి మాకు.

శ్రీమతి పమిడి శమంతకమణి: ఆ చట్టం తెచ్చాక ఎక్కువైంది.

SRI C.RAMACHANDRAIAH: Sir, I can go to the extent of making a controversy. Even if it is necessary, let us regularize prostitution in the country. Let us do it at the national level. ఇటువంటి వెర్రితలలు వేసే వెధవలు ఉన్నప్పుడు వాళ్ళని అలాగే చావనిస్తున్నారు. యూరోపియన్ దేశాలలో అలాంటి సంఘటనలు కొన్ని జరిగాయి. Let us legalize it. కనీసం అలా చేస్తే ఈ విధమైన నేరాలు తగ్గుతాయి కదా. ఎటువంటి పరిస్థితుల్లోనూ చట్టాలుచేసినా కూడా నేరాలను కంట్రోల్ చేయలేకపోతున్నాం. ఈ మధ్య 72 సంవత్సరాల మహిళకు జరిగిన అన్యాయం వింటుంటేనే గుండెలు బరువెక్కిపోతున్నాయి. ఎంత దారుణమది. సార్, ఇది ఒక్క చట్టం మార్చడమో, ఇంకోటో, ఇంకోటో కాదు. It requires a multi-pronged attack. సైకలాజికల్‌గా డీసీజ్ ఎట్లుంది ఎంటని తెలిస్తేనే దీనిని మనం పరిష్కరించగలుగుతాం. సార్, దీనిపై మనం అర్థవంతమైన చర్చను చేసి మనం కూడా ఏదో ఒకటి contribute చేయాల్సిన అవసరముంది. లేకపోతే మళ్ళా next day వస్తుంది. రెండురోజులకు normal అయిపోతుంది. ఆ తరువాత ఇటువంటి ప్రశ్నలను మీరు అడ్మిట్ కూడా చేయరు.

మిస్టర్ ఛైర్మన్: రామచంద్రయ్యగారూ, దీనిని మనం ఒక లఘురూప చర్చ క్రింద చేపట్టాలి. ఎవరూ రాకపోతే దీనిని ప్రశ్నకింద వేశారు. మోషన్ ఇచ్చి ఉంటే చర్చించడం జరిగేది. ఎందుకంటే మీరు అన్నట్లుగా ఒక స్టడీటీం కానీ ఏదో ఒకటి కావాలి. సమాజం ఎంత పాడైపోయిందంటే అందరూ నీతులు చెప్పేవాళ్ళే ఉన్నారు. కానీ ఫాలో కావడంలేదు.

శ్రీమతి పమిడి శమంతకమణి: రేపు చర్చకు పెట్టండి సార్.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, బడ్జెట్ సమావేశాలు రేపు, ఎల్లుండి మాత్రమే ఉంది కాబట్టి అంతగా అయితే ప్రశ్నలు పోస్టుపోన్ అయినా ఫరవాలేదు. రేపు పెట్టండి.

MR. CHAIRMAN: For that I have to summon the BAC. Moreover, this Session is only for next two days. ఇప్పుడు చేసిన సూచనలన్నీ మంచి సూచనలే. ఎఫెక్టివ్‌గా ఉన్నాయి. అయినా దీనికొక స్టడీటీం కావాలి.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: కృష్ణాజిల్లా నందిగామ నుంచి వచ్చి చదువుకునే పూజిత అనే పాప మరణంపై పత్రికలలో కానీ, ప్రసారమాధ్యమాలలోకానీ, సభలో గౌరవ సభ్యులు వెలిబుచ్చిన ఆవేదనంతా దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకుంటాము. ఆ పాప తల్లిదండ్రులు, గ్రామస్తులు జరిగిన సంఘటనా స్థలానికి వెళ్ళి ఆవేదన వెలిబుచ్చారు. కాబట్టి దానిమీద వాస్తవాలు ప్రజలకు, ఆ పాప కుటుంబ సభ్యులకు తెలియాల్సిన అవసరముంది కనుక సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి కుటుంబానికి, ఆ పాపకి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా చేయడమే గాక, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవడానికి మేమందరమూ కూడా ముందుకెళ్ళడం జరుగుతుంది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి: అధ్యక్షా, మొట్టమొదటిగా పేపర్లో అక్కడ ఒక విస్కీ బాటిల్ దొరికిందని చెప్పారు. రెండోరోజు ఆ బాటిల్‌లోపల విస్కీకాదు పెట్రోలు ఉందని చెప్పారు. అంత

ఇదిగా చెప్పిన తరువాత, ఆ బాటిల్‌కూడా ఆ అమ్మాయి పక్కన దొరికిన తరువాత, ఆ అమ్మాయే కాల్చుకుందనడం, కొంచెం కూడా ఆ అమ్మాయి కదలలేదని పేపర్లోనూ, టి.విల్లోనూ క్లూ ఇచ్చి చూపించినా, తల్లిదండ్రులు మొరపెట్టుకుంటున్నా కూడా హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో ఉంది కాబట్టి వాళ్ళ పోలీసులు వాళ్ళ స్టేట్‌మెంట్‌లు ఏవో వాళ్ళిచ్చారు. ఆమె ఆంధ్రాప్రాంతం అమ్మాయి అయినప్పుడు మనం తీసుకోవాల్సిన చర్యలు వెంటనే తీసుకోవాలని నేను కోరుతున్నాను. చాలా సీరియస్‌గా తీసుకోవాలి. ఒకటి కాదు, రెండు కాదు. ఇలాంటివి ఇంకా చాలా ఉన్నాయి. మేము చెప్పలేం. ఎందుకంటే విచారణలో మీకే తెలుస్తుంది. కాబట్టి అవికూడా వెంటనే బయటికి రావాలి.

మిస్టర్ ఛైర్మన్ః సాధారణంగా మహిళలపై జరిగే అత్యాచారాలకు చేపట్టే చర్యల గురించి సభ్యులు స్పెసిఫిక్‌గా అడుగుతున్నారు కాబట్టి స్పెసిఫిక్‌గా రెప్రజెంట్ చేయండి. దానికి ఎంక్వయరీ చేసి రిజల్టును తెలియచేయడానికి వీలుంటుంది.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః ఇది పాత విషయంకూడా కాదు. ఇటీవలనే జరిగింది. ఆమెది ఏ ప్రాంతమని కాదు. గతంలో తెలంగాణ ప్రాంతంలో ప్రసన్న, ప్రణీత అనే అమ్మాయిలమీద యాసిడ్‌పోస్తే వెంటనే నేను వరంగల్‌కు వెళ్ళాను. అక్కడి ఊరేగింపులో కూడా పాల్గొన్నాను. సంతాప సభ పెట్టారు. నేను, దయాకర్‌రావుగారు ఇద్దరమే పాల్గొన్నాం. ఆరోజు ఆసుపత్రికి వెళ్ళి చూసి ఆ అమ్మాయిని హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో చేర్పించాము. ఆ యాసిడ్ పోసిన కుర్రాడు తెనాలి ప్రాంతానికి చెందినవాడు. ఈ ఘటనలో పాల్గొన్న ముగ్గుర్నీ ఎన్‌కౌంటర్ చేసి కాల్చేశారు. మేమంతా సంతోషించాం. ఆ అబ్బాయిల శవాలను తల్లిదండ్రులుకూడా తీసుకెళ్ళలేదు. కాబట్టి తెలంగాణా, ఆంధ్రా, రాయలసీమ, ఢిల్లీ అనే కాదు ఎక్కడ జరిగినా మేం స్పందిస్తాం. మాలో కలిగిన ఆవేదనకి ఛైర్మన్‌గారు, సభ్యులు స్పందించారు చాలా సంతోషం. పూజిత మరణంమీద చాలా తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. బాధ్యులపై మీరు వెంటనే చర్య తీసుకోండి. ఎవరికీ భయపడాల్సిన అవసరంలేదు. ప్రభుత్వం చర్య తీసుకోవాలి.

శ్రీ నిమ్మకాయల చినరాజప్పః పూజిత అనే అమ్మాయి విషయం గురించి పెద్దలందరూ కూడా చెప్పడం జరిగింది. ఈ విషయంపై మా ప్రభుత్వ అధికారులు తెలంగాణ అధికారులతో సంప్రదించి బాధ్యులపై తప్పనిసరిగా చర్య తీసుకునే విధంగా చేస్తామని తెలియజేస్తున్నాము. అలాగే మా ప్రభుత్వం వచ్చిన తరువాత నేరాలు తగ్గించాలనే ఉద్దేశంతో చంద్రబాబునాయుడుగారు అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే గాక పోలీసు స్టేషన్‌లో కౌన్సిలింగ్‌చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. అలాగే ఇలాంటి సంఘటనలు జరగకుండా తప్పకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని సభ్యులందరికీ హామీ ఇస్తున్నాము.

శ్రీ సి.రామచంద్రయ్యః సార్, క్షమించాలి. కొన్ని వెబ్‌సైట్స్‌లో చాలా చండాలంగాను, అశ్లీలంగాను ఉన్న దృశ్యాలను చూపించి ప్రోత్సహిస్తున్నాయి.

శ్రీమతి నన్నపనేని రాజకుమారిః భయంకరంగా చూపిస్తున్నారు. పిల్లలు చెడిపోతున్నారు.

శ్రీ సి.రామచంద్రయ్యః ఆ వెబ్‌సైట్స్‌ను ఏ విధంగా నియంత్రించాలో కూడా ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలి. ఇది జాతీయస్థాయిలో చేయాల్సిన అంశం.

శ్రీమతి పమిడి శమంతకమణిః అధ్యక్షా, ఏ వ్యాపార ప్రకటన చూసినా మహిళలను భయంకరంగాను, నీచంగాను చూపిస్తున్నారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి, లాభాలు పొందడానికి అలాంటి వ్యాపార ప్రకటనలకు మహిళే దొరికిందా? చిన్న చిన్న వస్త్రాలతో ప్రకటనలు ఇస్తున్నారు. అటువంటి ప్రకటనలను ప్రసారంకాకుండా చేస్తే కొంత గౌరవంగా ఉంటుంది.

మిస్టర్ ఛైర్మన్ః ఏ సమయానికి ఆ సమయం ప్రాంతాల వారీగా గుర్తించి ఒక టాస్క్‌ఫోర్స్ పెట్టండి. అలాగే సమాజంలో కూడా మార్పు తీసుకురావాలి. సమాజమంటే మనం కూడా ఉన్నాం. మనమూ మారాలి. చెప్పేవాళ్ళు ఎక్కువగానే ఉంటారు కానీ చేసేవాళ్ళే తక్కువగా ఉన్నారు.

శ్రీ ఎస్.చినరాజప్పః అధ్యక్షా, టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

## గిరిజనులకు కేంద్ర ప్రాయోజిత పథకాలు

ప్రశ్న నెం. 7867 (6)

శ్రీ బి.చెంగల్ రాయుడు, ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన గిరిజన సంక్షేమ సాధికారత శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా?

అ) రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర ప్రతిపాదిత పథకాల వివరాలేమిటి ?

ఆ) ఈ పథకాలకు అందించిన ఆర్థిక సహాయం శాతం వివరాలేమిటి ?

గౌరవనీయులైన గిరిజన సంక్షేమం & సాధికారత శాఖ మంత్రి (శ్రీ రావెల కిశోర్‌బాబు):

అ) ఈ క్రింది కేంద్ర ప్రతిపాదిత పథకాలను ఇప్పుడు కేంద్ర సహాయ రాష్ట్ర ప్రణాళికా పథకాలు (సిఎస్‌పిఎస్)గా పేరు మార్చి, రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేయడం జరుగుతున్నది.

1. 275 (1) పరిచ్ఛేదం నిబంధన ప్రకారం గ్రాంట్లు.
2. గిరిజన ఉప-ప్రణాళికకు ప్రత్యేక కేంద్ర సహాయం.
3. సంరక్షణ-కం-అభివృద్ధి ప్రణాళిక (సి.సి.డి.పి).
4. పరిశోధన & శిక్షణ.
5. గిరిజన పరిశోధనా సంస్థ ఏర్పాటు.
6. కేంద్ర ప్రధాన పథకాలు ః
   ఎ) పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు
   
   బి) ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్పులు
7. 2014-15 సంవత్సర కాలంలో విశాఖపట్నం జిల్లా, జి. మాడుగుల మండలంలో వనబంధు కళ్యాణ్ యోజన (వికెవై)ను పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయడమవుతున్నది.

బి) పథకాలను అందించిన ఆర్థిక సహాయ పథకాల శాతం ఈ క్రింది విధంగా ఉంది.

| వరుస సంఖ్య | పథకం | పరిధి | 2014-15 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం కేటాయింపు / మంజూరు (రూ. కోట్లలో) | సిఎస్ఎస్ మొత్తానికి శాతం రూ.174.43 కోట్లు |
|---|---|---|---|---|
| 1. | 275 (1) పరిచ్ఛేదం నిబంధన క్రింద గ్రాంట్లు | ఐటిడిఎ, ఎంఎడిఎ ప్యాకెట్స్, క్లస్టర్లు | 30.10 | 17 |
| 2. | గిరిజన ఉప-ప్రణాళికకు ప్రత్యేక కేంద్ర సహాయం | రాష్ట్రం అంతా | 29.38 | 16.8 |
| 3. | సంరక్షణ-కం-అభివృద్ధి ప్రణాళిక | పి.టి.జిలు | 30.49 | 17.5 |
| 4. | పరిశోధన & శిక్షణ | రాష్ట్రం అంతా | 0.20 | 0.11 |
| 5. | గిరిజన పరిశోధనా సంస్థ స్థాపన | రాష్ట్రం అంతా | 1.00 | 0.57 |
| 6. | ప్రధాన పథకాలు : | రాష్ట్రం అంతా | | |
| | ఎ) పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్పులు | | 54.40 | 32 |
| | బి) ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్పులు | | 18.86 | 10.8 |
| 7. | వనబంధు కళ్యాణ్ యోజన (వికెవై)ను పైలెట్ ప్రాజెక్టుగా అమలుచేయడం | 2014-15లో విశాఖపట్నం జిల్లా, జి. మాడుగుల మండలం | 10.00 | 5.7 |
| | | మొత్తం | 174.43 | 100 |

**ఉ.10.50**

శ్రీ బి. చెంగల్‌రాయుడు : అధ్యక్షా, రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పథకాలలో central assisted programmes లో కేంద్రప్రభుత్వ వాటా ఎంత? రాష్ట్రప్రభుత్వ వాటా ఎంత? మనకు MGNREG స్కీమ్‌లో కేంద్రప్రభుత్వం 90శాతం, రాష్ట్రప్రభుత్వం 10శాతం భరిస్తున్నది. అదేవిధంగా అడిగిన ప్రశ్న ఇది. మంత్రిగారు మొత్తం బడ్జెట్‌లో కేటాయించిన నిధుల గురించి చెప్పారు. మేము ఒక ప్రశ్న అడిగితే మంత్రిగారు మూడు సమాధానాలు చెప్పారు. 2014-15వ సంవత్సరానికి మన రాష్ట్రానికి కేంద్రప్రభుత్వ సహాయంగా వచ్చిన నిధులు ఎన్ని? ఎంత ఖర్చుపెట్టారు, ఇంకా ఖర్చుపెట్టాల్సిన నిధులు ఉన్నాయా? ఉంటే ఎప్పటిలోగా ఖర్చుపెడతారు? కేంద్రప్రభుత్వం 100 శాతం నిధులు కేటాయించిన పథకాలు ఏమైనా ఉన్నాయా? గతంలో ఉన్న వనవాసీ పథకం పేరుని మార్చి గిరిపుత్రి కళ్యాణం అనే పథకాన్ని ప్రవేశపెట్టారా? గిరిపుత్రి కళ్యాణానికి 100 శాతం నిధులు కేంద్రప్రభుత్వం కేటాయిస్తున్నదా లేక రాష్ట్రప్రభుత్వం భరిస్తున్నదా?ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, గౌరవ శాసనమండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్రప్రభుత్వ సహాయంతో చేపట్టే పథకాలకు 100 శాతం నిధులు కేంద్రప్రభుత్వమే భరిస్తున్నది. కానీ ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు మాత్రం 75 శాతం నిధులు కేంద్రప్రభుత్వం భరిస్తున్నది, 25 శాతం రాష్ట్రప్రభుత్వం భరిస్తున్నది. వనబంధు కళ్యాణ యోజన అనే పథకాన్ని గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు ఇటీవల ప్రవేశపెట్టారు. ఇది భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్‌లో ఉన్న బాగా వెనుకబడిన పది రాష్ట్రాలలో షెడ్యూల్డ్ ప్రాంతాలలో అమలు చేస్తున్నారు. వాటిలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒకటి. కొత్త రాష్ట్రంలో 5 జిల్లాలలో షెడ్యూల్ ప్రాంతాలున్నాయి. ఇది ఇలాంటి ప్రాంతాలకు సంబంధించిన ఒక పైలెట్ ప్రాజెక్టు. దీనిలో ఒక బ్లాకు తీసుకుని, ఆ బ్లాకుకు సంబంధించినంత వరకూ ఉదాహరణకు జి. మాడుగుల మండలం, ఆ మండలంలో సమగ్రంగా అన్ని రకాలుగా సమగ్రాభివృద్ధి కోసం ఈ యొక్క స్కీమ్‌ని ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పథకంకు నిధులు 100 శాతం కేంద్రప్రభుత్వమే భరిస్తుంది.

శ్రీ బి. చెంగల్ రాయుడు : గతంలో ఉన్న పథకానికి పేరు మార్చారా?

శ్రీ రావెల కిషోర్ బాబు : ప్రధాని నరేంద్ర మోదీ గారు ప్రవేశపెట్టిన క్రొత్త పథకం. ఆగస్టు 9వ తేదీన విశాఖపట్టణంలో గౌరవ ముఖ్యమంత్రిగారు మొట్టమొదటి సారిగా యునైటెడ్ నేషన్స్ వాళ్ల చేస్తున్న కార్యక్రమం ప్రకారంగా ప్రపంచ గిరిజన దినోత్సవ వేడుకలలో గిరిపుత్రిక కళ్యాణ పథకంను ప్రారంభించారు. శిశు మరణాల రేటులో స్త్రీ శిశుమరణాల రేటు ఎక్కువగా ఉంది. ఒక పాప పుట్టినప్పుడు వాళ్లని పెంచి పెద్ద చేయడం కష్టమని చాలా మంది వారు పుట్టినప్పుడే శ్రద్ధ చూపకపోవడం వలన చనిపోతున్నారు. ఆ మరణాల రేటుని తగ్గించాలనే ఉద్దేశంతో ఇన్‌సెంటీవ్ స్కీమ్ క్రింద ఆడపిల్లలు పెరిగి పెళ్లి జరిగినప్పుడు రూ.50వేలు ఇవ్వడం అనేది ఈ పథకం ఉద్దేశం. ఈ పథకానికి నిధులను పూర్తిగా రాష్ట్రప్రభుత్వమే భరిస్తుంది.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, గత సంవత్సరం మనకు కేంద్రప్రభుత్వం నుండి ఎంత బడ్జెట్ వచ్చింది, దానిలో ఎంత ఖర్చు పెట్టాము, ఖర్చుపెట్టాల్సిన నిధులు ఇంకా ఎన్ని ఉన్నాయని అడిగాను దానికి మంత్రిగారు సమాధానం ఇవ్వలేదు.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, 2014-15వ సంవత్సరంలో మొత్తం విడుదల అయిన నిధులు రూ.174.43 కోట్లు. ఫిబ్రవరి 28,2015నాటికి ఖర్చుపెట్టింది 145.8కోట్లు. ఇంకా

బిఆర్‌వో నిధుల మంజూరు ప్రాసెస్‌లో ఉన్నాయి, తప్పకుండా మొత్తం ఖర్చుపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాము.

శ్రీమతి టి. రత్నాబాయి : అధ్యక్షా, అక్కడ చాలా అవసరాలు ఉంటే ఇంకా ఈ నిధులు ఖర్చుపెట్టలేక పోవడానికి గల కారణాలను తెలియజేయాల్సిందిగా మీద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ సి. రామచంద్రయ్య : అధ్యక్షా, నేషనల్ లెవెల్‌లో రివల్యూషన్ ఫండ్స్‌లో రాడికల్‌గా మార్పులు వచ్చాయి. నేను గతంలో కూడా ఒక సందర్భంలో చెప్పాను. 32 నుండి 42 శాతానికి రాష్ట్రానికి ఫండ్స్ vertical devolution పెంచినప్పుడు దానికి proportionate గా centrally sponsored schemes కు నిధులు తగ్గించారు. దానిలో దాదాపు 33 సెలక్ట్ చేశారు, ఈ సంవత్సరం లేదు, తరువాతి ఫేజ్‌లో తగ్గిస్తారు. దానిలో ట్రైబల్ వెల్ఫేర్‌లో ఎన్ని స్కీమ్స్ ఉన్నాయి? ఆవిధంగా నిధులు తగ్గితే ఆ భారాన్ని రాష్ట్రప్రభుత్వం భరిచడానికి సిద్ధంగా ఉందా అని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ రావెల కిషోర్ బాబు : అధ్యక్షా, కేంద్రప్రభుత్వం రాష్ట్రప్రభుత్వం కు అందించే స్కీమ్‌లు మొత్తం 7. వీటిల్లో ఈ సంవత్సరమే కొత్తగా ప్రారంభించినది 7వ స్కీమ్. అయితే 2015 – 16 వ సంవత్సరంకు సంబంధించిన రూ.561.76కోట్ల రూపాయలకు ప్రతిపాదనలు కేంద్రప్రభుత్వానికి పంపించడం జరిగింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ. 128.00 కోట్లు కేంద్రప్రభుత్వ ప్రతిపాదిత పథకాలకు కేటాయించడం జరిగింది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాత కేంద్ర గిరిజన శాఖా మాత్యులు వద్దకు వెళ్లి ఈ యొక్క ప్రతిపాదనలను pursue చేసి, అత్యధిక మొత్తంలో నిధులు కేటాయించే విధంగా కృషిచేస్తాము.

శ్రీమతి టి. రత్నాబాయి : అధ్యక్షా, గిరిజన ప్రాంతాలలో నిధులు ఖర్చు పెట్టక పోవడానికి గల కారణాలు ఏమిటని అడిగాను, మంత్రిగారు నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

శ్రీ రావెల కిషోర్ బాబు : నిధులు ఖర్చు పెట్టడంలో ఇబ్బంది ఏమీ లేదు. మనకు ఈ సంవత్సరానికి బిఆర్‌వోలు విడుదల చేసిన దానిలో, ట్రైబల్ సబ్ ప్లాన్‌లో 98 శాతం నిధులు ఖర్చు పెట్టడం జరిగింది. ఈ సంవత్సరాంతానికి మొత్తం నిధులు ఖర్చుపెట్టడానికి ప్రయత్నం చేస్తాము.

ఉ. **11.00**

## ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం

ప్రశ్న నెం. 8046 (7)

శ్రీ అంగర రామమోహన్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ మరియు పారిశుద్ధ్య శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) ఇందిరమ్మ గృహనిర్మాణ, పథకం లబ్ధిదారులు బకాయిలు చెల్లించవలసి వుందన్న విషయం వాస్తవమేనా ?

ఆ) అయితే, సదరు బకాయిలను ఎప్పటిలోగా చెల్లించడం జరుగుతుంది ?

ఇ) పథకం క్రింద కొత్త గృహాల మంజూరుకు ఏవైనా ప్రతిపాదనలు ఉన్నాయా?

గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ మరియు పారిశుద్ధ్య శాఖమంత్రి (శ్రీమతి కిమిడి మృణాళిని):

అ) అవునండీ.

ఆ) ఆధార్ అనుసంధాన చెల్లింపు విధానం ద్వారా వాస్తవ లబ్ధిదారులకు చెల్లింపులను విడుదల చేయడానికి వీలుగా అన్ని గృహాలకు ఆధార్ అనుసంధానం, భూ సంబంధిత గుర్తింపు ఉండాలని లబ్ధిదారు ఖాతాలను ఆధార్ అనుసంధానంతో రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూ సంబంధిత గుర్తింపు ఆధార్ సమాచార సేకరణ పని, బ్యాంకులకు ఆధార్ నెంబర్‌ను అనుసంధానించడం పురోగతిలో ఉన్నాయి. బ్యాంకు ఖాతాలకు భూసంబంధిత గుర్తింపు, ఆధార్ అనుసంధానం పూర్తయిన మీదట లబ్ధిదారులకు చెల్లింపుల అంశాన్ని పరిశీలించడం అవుతుంది.

ఇ) అవునండీ. ఎన్.టిఆర్ గృహ నిర్మాణ పథకం క్రింద కొత్త గృహాల మంజూరుకు ప్రతిపాదన ప్రభుత్వ స్థాయిలోజరుగుతుంది.

శ్రీ అంగర రామమోహన్ : అధ్యక్షా, బోగస్ కాని లబ్ధిదారుల విషయంలో త్వరితగతిన బిల్లులు చెల్లించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే సంవత్సరం, రెండు సంవత్సరాల నుంచి పాత బకాయిలు ఈ బోగస్ పేరుతో ఆగిపోయాయి. అర్హత ఉన్నవారికి బిల్లులు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కొత్తగా ప్రభుత్వం కేటాయించిన ఇళ్లకు ముందుగా ప్రాధాన్యాన్ని యిచ్చి, ఇళ్ల కేటాయిస్తే బాగుంటుందని ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళిని : గౌరవసభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం అత్యంత బాధాకరమైనటువంటి విషయం. నిజంగా అర్హులైన లబ్ధిదారులు ఎవరైతే ఉన్నారో, వారందరూ ఇబ్బంది పడుతున్న విషయం వాస్తవం. అయితే అర్హత అనేది గుర్తించడం కొంచెం ఇబ్బందికరంగా ఉంది. ఎందుకంటే, లక్షలాది సంఖ్యలో గృహనిర్మాణం జరగడం వల్ల వాటిల్లో చాలా అవకతవకలు జరిగాయి. నిజానికి గ్రామాలలో ఉన్న గృహాలకంటే ఎక్కువ గృహాలు మంజూరు అయ్యాయి. ఒక గ్రామంలో 150 ఇళ్లు ఉంటే సుమారు170-180 ఇళ్లకు మంజూరు అవ్వడం, పాత ఇళ్లకే కొత్త బిల్లులు పెట్టితీసుకోవడం ఇలాంటివన్నీ జరిగాయి. ఎందుకంటే, దీనికి శాస్త్రీయంగా పరిశోధన జరుగుతుంది. ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకుని, ఏవైతే incorporated houses ఉన్నాయో వీటిని పర్సనల్‌గా ఈ నెలరోజులలోనే పూర్తి చేసి, వీటికి ముందుగా ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేసి, మొదటి ప్రాధాన్యం వీటికిచ్చి బిల్లు చెల్లింపులు పూర్తి చేయాలనే దృక్పథంతో ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. తప్పకుండా నెలా లేదా రెండు నెలల్లో వీటి మీద చర్యలు తీసుకుంటాము.

డా. బచల పుల్లయ్య(ఉపాధ్యాయ నియోజకవర్గం, కడప, అనంతపురం, కర్నూలు): అధ్యక్షా, ఇందిరమ్మ గృహాలు వాస్తవానికి ఎవరైతే బీదవారు ఉన్నారో, వారికి ఇవ్వడానికి ఏర్పాటు చేసిన పథకం అది. అయితే మీ ద్వారా మంత్రిగారిని కోరేదేమంటే, వాస్తవంగా అక్రమాలకు అలవాటైనటువంటి వాళ్లే నివాసం ఏర్పరచుకుంటారా? మా ఉద్దేశంలో ఎలాటైనటువంటి వారు కాక వేరేవాళ్లు ఉంటున్నారని ఒక అభిప్రాయముండేది. కేటాయింపబడిన వారు ఆ గృహాల్లో ఎంతమంది నివసిస్తున్నారు? అదేవిధంగా, కడప జిల్లాలో ప్రొద్దుటూరు దగ్గర అమృతా నగర్ అని

ఒక కాలనీ ఉంది. అక్కడ అక్రమాలు జరుగుతున్నాయని ఒక ఎంక్వైరీ కమిటీని వేయడం జరిగింది. ఆ ఎంక్వైరీ కమిటీని వేసి దాదాపు ఐదారు సంవత్సరాలు అయ్యింది. ఆ ఎంక్వైరీ కమిటీ రిపోర్టు ఏమైందని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ మేకా శేషుబాబు (స్థానిక సంస్థల నియోజకవర్గం, పశ్చిమగోదావరి) : అధ్యక్షా, గతంలో చాలా చోట్ల సభ్యులు శ్రీ అంగర రామమోహన్ గారు చెప్పినట్లుగా లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది. అవన్నీ చూస్తే, ఈ రోజు పూడికలు గానీ, స్థలం కూడా అప్పగించే విధంగా అన్ని చోట్ల పరిస్థితి ఉంది. ఈ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినాకానీ, వారి దగ్గర సిబ్బంది లేరా? ఎందుకు బిల్లులు చెల్లించవలసిన వారికి చెల్లించే క్రమంలో గానీ, కొత్త గృహాల కోసం గాని చాలా మంది ఎదురు చూశారు? వాళ్లు ఈరోజు పంచలో ఉండవలసిన పరిస్థితి ఉంది. ఈరోజుకి కూడా ప్రభుత్వం జియోటాగింగ్ అని లేక వేరే కారణాలు చెప్పి ఇళ్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితి ఏ కారణం చేత వస్తుంది? ఈ రోజు క్షేత్రస్థాయిలో దానికి సంబంధించిన ప్రతి చోట వర్క్ ఇన్‌స్పెక్టర్ లేరని, అదేవిధంగా అసిస్టెంట్ ఇంజనీర్లు లేరనే వైఖరి గృహనిర్మాణ శాఖలో ఉంది. దాని గురించి తెలియపరచవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళిని : అధ్యక్షా, జియోటాగింగ్ విధానం కొంచెం సమయం తీసుకునే కార్యక్రమం. సుమారు వెయ్యి మంది వరకు వర్క్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. ఇద్దరిద్దరు టీమ్‌గా వెళ్లి ప్రతి ఇంటిని గుర్తించి, లబ్ధిదారుల లిస్ట్ తీసుకుని గ్రామానికి వెళ్లి, ఎవరి ఇల్లు అని వారు పేరు కనుక్కొని, ఆ లబ్ధిదారుని ఇంటి ముందు నిల్చోబెట్టి, ఆ పాయింట్ ఫిక్స్ చేసి, ఆ జియోటాగింగ్ విధానం చేయడం కొంచెం కష్టసాధ్యమైన విషయం. ఒక ఇంటిని ఫోటో తీయడానికి సుమారుగా ఇరవై నిముషాలు పడుతుంది. ఆ విధంగా వారు ప్రతిరోజు ఒక 50 ఇళ్లను మాత్రమే ఫోటో తీయగలుగుతున్నారు. అ విధంగా చేయడం వల్ల సమయం ఎక్కువ తీసుకుంటున్నది. దీనిని గత నవంబరు నెల ఐదారు తేదీలలో ప్రారంభించి, ఇప్పటికీ రాష్ట్రంలో 41 లక్షల ఇళ్లకు గాను, సుమారు 30 లక్షల ఇళ్లు పూర్తి చేయడం జరిగింది. మిగతా కార్యక్రమం కూడా ఈ పది పదిహేను రోజులలో పూర్తి చేసి, ఒక సమగ్రమైన నివేదికను ప్రభుత్వం తీసుకుని, దానిపైన ఏవిధమైన చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నాము. అదేవిధంగా, బినామీ పేర్లతో ఇళ్లలో ఉంటున్నారని కూడా చెప్పారు. తప్పకుండా వచ్చిన కంప్లైంట్‌ని ప్రాతిపదికగా తీసుకుని చర్య తీసుకోవడం జరుగుతుంది. వర్క్ ఇన్స్‌పెక్టర్‌లు లేరా అని కూడా అడిగారు. పొరుగు సేవల సిబ్బంది ఉన్నారు. వారితో పని చేయించడం జరుగుతుంది.

డా. బచల పుల్లయ్య: అధ్యక్షా, అమృతా నగర్ కాలనీ రిపోర్ట్‌కోసం కమిటీవేసి ఆరు సంవత్సరాలపైన అయ్యింది, ఆ రిపోర్టు ఏమైనా వచ్చిందా? దానిలో అక్రమాలు ఏమైనా వెలుగు చూశాయా? మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ బి. చెంగల్ రాయుడు : అధ్యక్షా, బీదల గురించి నేను మొన్న జరిగిన సమావేశంలో కూడా చెప్పాను. శ్రీ అంగర రామమోహన్ గారు బీదలకు సంబంధించి మంచి ప్రశ్న వేశారు. We have to thank him. కాకపోతే 2014-15 లో ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు, ఎన్ని పూర్తి చేశారు. లేదా 2014-15లో పాత ఇళ్లు ఏమైనా పూర్తయ్యాయా? గత సంవత్సరం రూ.300 కోట్లు, గత సంవత్సరం నుంచి దాదాపు రూ.600కోట్లకు M-books మీ దగ్గర ఉన్నాయి. రూ.600 కోట్లకు ఆరు పైసలు కూడా ఇంతవరకు ఖర్చుపెట్టలేదు. జియోటాగింగ్ అని ఏదేదో చెబుతున్నారు. నేను

కూడా మంత్రిగారు చెప్పినట్టే వాళ్లకు చెబుతున్నాను. ప్రభుత్వం ఏదో చేయాలంటుంది, అది చేసే వరకు ఆగుదాము అని మేము లబ్ధిదారులకు చెప్పాము. కాబట్టి 2014-15 సంవత్సరానికి ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయి, ఎన్ని పూర్తయ్యాయి, లేదా 2014-15 సంవత్సరానికి ఇళ్లు ఏమైనా పూర్తయ్యాయా, వాటికి మీరేమైనా చెల్లింపులు చేశారా అనే విషయాలను తెలియజేయమని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి కిమిడి మృణాళిని : అధ్యక్షా, గౌరవసభ్యులు ఉన్న సమస్య తెలిసి ఉండి కూడా మరల దాని గురించి అడుగుతున్నారు. సమస్య అందరికి తెలుసు. గ్రామాలలో అత్యధిక స్థాయిలో అంటే చాలా పెద్ద సంఖ్యలో అవినీతి, ఆరోపణలు జరిగాయన్నది వాస్తవం. గత ప్రభుత్వం గురించి ఏమి చెప్పకూడదని అనుకున్నప్పటికి కూడా, తరచుగా అదే ప్రశ్నలు వేస్తున్నారు. 43 లక్షల గృహాలను జియోటాగింగ్ చేస్తున్నాము. అది పూర్తయిన వెంటనే జియోటాగింగ్‌లో ఎన్ని ఇళ్లు బయట పడ్డాయి, ఇంకా ఎన్ని ఇళ్లు జియోటాగింగ్‌లో రాలేదు, ఏవిధంగా అక్రమాలు జరిగాయి? ఎంతమంది బినామీల పేరుతో ఇళ్లు తీసుకున్నారు, పాత ఇళ్ల మీద ఎంతమంది బిల్లులు చేసుకున్నారు, ఒకే లబ్ధిదారుడు నాలుగైదు ఇళ్లు ఏవిధంగాతీసుకున్నారు? వీటన్నింటికి సమాధానం రాబట్టవలసిన పరిస్థితి ఈ రోజు ప్రభుత్వం మీద ఉంది. ఏదో ఒక ఇల్లు, రెండు ఇళ్లు, వెయ్యి ఇళ్లు అయితే ఒక 10 రోజులు లేదా ఒక నెలలో చేయవచ్చును. ప్రస్తుతం 43లక్షల ఇళ్లు ఉన్నాయి. ఈ రాష్ట్రంలో గత10 సంవత్సరాలుగా జరిగినటువంటి అవినీతి విషయం వాస్తవము. ఈ విషయము గౌరవసభ్యులందరికి తెలుసు. జియోటాగింగ్ పద్ధతి కూడా నేను చెప్పాను. అందువలన, ప్రభుత్వం ఈ విధంగా ప్రతిసారి సమాధానం చెప్పకుంటూ రావడం బాధగా ఉన్నది. దీనిని త్వరితగతిన పూర్తి చేసి ఏ విధంగా ప్రజలకు, నిజంగా అర్హులైనటువంటి లబ్ధిదారులకు న్యాయం చేయాలనే విధానంపైన మేము దృష్టి పెట్టాము. తప్పకుండా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తాము. అదే విధంగా ప్రొద్దుటూరులో ఉన్న ఇళ్ల గురించి చెప్పారు. మాకు ఇంతవరకు నివేదిక రాలేదు. ఆ నివేదిక తెప్పించుకుని చూసిన తరువాత దాని మీద తగు చర్యలు తీసుకుంటామని గౌరవ సభ్యులకు తమరిద్వారా తెలియజేస్తున్నాను.

ఉ. **11.10**

## లస్కర్ పదవుల భర్తీ

ప్రశ్న నెం. 8048 (9)

శ్రీ అంగర రామ మోహన్ , ఎం.ఎల్.సి.

గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో లస్కర్ పదవులు అధిక సంఖ్యలో ఖాళీగా ఉన్నాయనే విషయం వాస్తవమేనా ?

ఆ) అయితే, ఆ పదవులను ఎప్పటిలోగా భర్తీ చేయడమవుతుంది?

గౌరవనీయులైన సాగునీటి శాఖ (శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు) :

అ) లేదండీ. శాశ్వత సిబ్బంది సంఖ్య లేనందున లస్కర్ ఖాళీ పదవులు ఏవీ లేవు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు, అయితే లస్కర్ల అవసరాన్ని గుర్తిస్తూ, లస్కర్ వ్యవస్థను పటిష్టపరిచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నది.

శ్రీ అంగర రామ మోహన్‌: అధ్యక్షా, మనది రైతు ప్రభుత్వం కనుక రైతు శ్రేయస్సు దృష్ట్యా లస్కర్ పదవులు చాలా ముఖ్యమైనవి. ఇప్పుడు పశ్చిమ గోదావరిలో నీటి కొరత వచ్చింది. అయినా మంత్రిగారు, ప్రభుత్వం బాగా స్పందించి పంట వచ్చే వరకు నీటిని సరఫరా చేశారు. కానీ లస్కర్లు ఉంటే ఎప్పుడు వంతుల విధానం ఉంటుందో రైతులకు ఒక అవగాహన కలిగించడానికి, వంతుల వారి విధానంలో రైతులకు చెప్పడానికి బాగుండేది. అందుచేత ఈ లస్కర్ పదవులలో తాత్కాలికంగా అయినా నియమించి రైతాంగానికి ఉపయోగపడే విధంగా ఈ పోస్టులు భర్తీ చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, ఏదైతే నేడు గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా, పెన్నా డెల్టా కానీ ప్రాజెక్టుల క్రింద లస్కర్ సిబ్బంది ఆవశ్యకత చాలా ముఖ్యం. సంబంధింత చీఫ్ ఇంజనీర్ల దగ్గర కూడా నీటిని సక్రమంగా క్రింది స్థాయి భూములకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవడానికి ఆవశ్యకతను గుర్తించి తగిన చర్యలు కూడా తీసుకుంటాము. త్వరలోనే ప్రభుత్వం దీనిని తెలియజేస్తుంది.

శ్రీమతి బలశాలి ఇందిర (నామినేటెడ్): అధ్యక్షా, దవళేశ్వర్యం బ్యారేజికి లస్కర్ పోస్టులు చాలా అవసరం. దాదాపుగా 175 మంది ఉండవలసినటువంటి చోట కనీసం 25 మంది కూడా అక్కడ లేరు. అయితే ఈ గేట్ ఆపరేషన్ సరిగా లేనందువల్ల ఆ చెరువంతా కూడా ఇసుకతో నిండిపోయినది. ఎందుకంటే ప్రతి సంవత్సరం కూడా digging తో ఇసుకను తోసివేయడం జరుగుతున్నది. అప్పుడు pond లో కొంత నీటి నిలువలు ఎక్కువగా ఉండి వ్యవసాయానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేది. ఈ రోజున 1/3 రిజర్వాయర్ అంతా కూడా ఇసుకతో నిండిపోయినది. మళ్లీ ఆ ఇసుకను ఈ రోజున మనము వాళ్లకు వీళ్లకు అప్పచెప్పడం జరుగుతుంది. మరి ఆ విధంగా కాకుండా ఈ లస్కర్లను సమర్థవంతంగా నియమించినట్లయితే చాలా మందికి ఉపాధి కల్పించవచ్చును. దానితోపాటుగా ఈ ఇసుకను దానిలో నిలువ ఉంచకుండా ఎప్పటికప్పుడు బయటకు తీసివేయడం ద్వారా మనం నీటిని కూడా బాగా నిలువ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి అది కూడా పరిశీలించి అక్కడ కూడా లస్కర్లను నియమించాలని మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, గౌరవసభ్యురాలు అడిగిన దవళేశ్వరానికి సంబంధించిన విషయం గురించి వెంటనే తప్పకుండా చర్యలు తీసుకుంటాము.

శ్రీ పి.జె. చంద్ర శేఖర రావు: సర్, నీటిపారుదల రంగానికి సంబంధించి క్షేత్ర స్థాయిలో లస్కర్ల యొక్క నియామకం వల్ల వాళ్ల పని విధానం మెరుగుదల ఉంటేనే నీళ్లు పొలాలకు అందుతాయి. మినిష్టర్ గారు ఇచ్చినటువంటి సమాధానంలో cadre strength, regular posts లేవు అని చెప్పారు. అసలు మన రాష్ట్రంలో ఉన్నటువంటి నీటిపారుదల కాలువలు, ట్యాంకులు వీటన్నింటికి సంబంధించి పరిశీలన చేసే దానికి నీళ్లు విడుదల చేయడం, క్రమబద్ధీకరించడం లస్కర్ల prime responsibility కాబట్టి ఎన్ని లస్కర్ల cadre strengthను workout చేశారు? ఎంతమంది లస్కర్లు మన రాష్ట్రానికి అవసరం అనే దాని మీద ఒక నిర్ధారణ జరిగిందా? జరిగితే ఎప్పటిలోపు దీన్ని పూర్తి చేస్తారు? దీనికి సంబంధించి పూర్తి సమాచారం ఇవ్వాలని మంత్రి గారిని మీ ద్వారా నేను కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు: అధ్యక్షా, గతంలో మొత్తం 7,400 పోస్టులు ఉండేవి. ప్రస్తుతం 1984 మంది లస్కర్ల పోస్టులలో పని చేస్తూ ఉన్నారు. ప్రాజెక్టుల వారిగా ఎంత అవసరం

అనేది ఛీఫ్ ఇంజనీర్ల స్థాయిలో ఒక నివేదికను తీసుకుంటాము. ఇవి చాలా అవశ్యకత ఉన్న పదవులు కాబట్టి ఏ విధంగా, ఎలా నిర్ణయం తీసుకోవాలనే దాని మీద త్వరలోనే నిర్ణయం తీసుకుంటాము.

MR. CHAIRMAN: Question Hour is over. Now, tea-break for 15 Minutes.

(Then, the House adjourned at 11.15 am)

---

**AFTER TEA BREAK, THE HOUSE RE-ASSEMBLED AT 12.00 P.M.**

**(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)**

* * *

(2) **ప్రకటన ః**

MR. CHAIRMAN: I am to announce to the House that a Group Photo Session will be there on 27th March, 2015, during the Tea Break. I, request that day-after-tomorrow all the Hon'ble Members should be available, in the Andhra Pradesh Legislative Council premises. I also request that all the Hon'ble Members should participate in the Group Photo Session.

(3) **అర్జీ సమర్పణ :**

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు ః అధ్యక్షా, మధ్యాహ్నభోజన పథకం విషయమై కార్మిక సంఘం వారి తరఫున నేను ఈ పిటీషన్‌ను తమకు సమర్పిస్తున్నాను. ప్రొఫెసర్ ఉమాదేవి నివేదిక ప్రకారం మధ్యాహ్నభోజన పథకంలో అవకతవకలకు పాల్పడుతున్న ఇస్కాన్ మరియు ఇతర ప్రైవేటు సంస్థలకు ఆ బాధ్యతలను అప్పగించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, ఆ విద్యార్థులకు సరైన భోజన సదుపాయములు కల్పించాలని, వీటిని పరిష్కరించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ ఈ పిటీషన్‌ను వారు ఇవ్వడం జరిగింది. దీనిని నేను మీ ద్వారా సభకు సమర్పిస్తున్నాను.

(పిటీషన్‌ను సమర్పించారు)

MR. CHAIRMAN : Now, we will start Short Discussion.

(4) **కరువు పరిస్థితులపై లఘు చర్చ :**

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభ నియోజకవర్గం) ః అధ్యక్షా, రాష్ట్రంలో ఉన్నటువంటి కరువు పరిస్థితి మీద గౌరవ ఉప ముఖ్యమంత్రిగారు వివరణ ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో కరువు పరిస్థితికి కారణాలు చెపుతూ – 2014వ సంవత్సరం నైఋతి ఋతుపవనాల కాలంలో లోటు వర్ష పాతం పడింది. దానివలన ఈ కరువు రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉంది. అలాగే, కరువు మండలాలను కూడా ప్రకటించడం జరిగింది. ఆ కరువు మండలాలలో అక్కడి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని ఆయన వివరణ ఇవ్వడం జరిగింది.

రాష్ట్రప్రభుత్వం తీసుకున్న సహాయ చర్యలలో భాగంగా గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య శాఖకు సంబంధించి సుమారు 10,196 దుర్భర జనావాసాలను గుర్తిస్తూ, రవాణా, ప్రైవేటు వనరులను అద్దెకు తీసుకోవడం, బోరుబావులు, బహిరంగ బావులను శుభ్రం చేసి, లోతు తీయడం మొదలైన తాత్కాలిక చర్యలను తక్షణమే చేపట్టడం జరిగిందని అన్నారు. వీటన్నింటి కోసం

సుమారు రూ.123.54కోట్లతో మొత్తం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలోని త్రాగునీటి సమస్యను నివారించడానికి, పట్టణ ప్రాంతాలలోని నీటి సరఫరా విషయంలో సుమారు రూ.110కోట్లతో అక్కడి ఇబ్బందులను నివారించడానికి అన్నట్లుగా మంత్రిగారు ఇచ్చిన వివరణలో ఉన్నది.

పశుసంవర్ధక శాఖలో పశువుల శిబిరాలు, పశువుల దాణా మరియు పశువులకు వైద్య రక్షణ కోసం కేంద్రప్రభుత్వం నుండి రూ.413.76కోట్ల మొత్తాన్ని కరువు మండలాలకు కోరడమైంది. అందులో భాగంగా ఎండిన పశుగ్రాసం కిలో ఒక్కింటికి రూ.3.00లుగా కొనడం జరుగుతోంది. అలాగే, 75 శాతం సబ్సిడీ చొప్పున ఎండిన పశుగ్రాసం, పశుదాణా సరఫరా చేయడానికి 123విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని ఆయన వివరణ ఇచ్చారు. అయితే, ఇక్కడ ఆలోచించతగిన విషయం ఏమిటంటే అధ్యక్షా, రైతులకు మీరు ఇస్తున్న సబ్సిడీ దాణా విష యంలో ఎంతమంది సుముఖంగా ఉండి, ముందుకు వచ్చి ఆ దాణా తీసుకోవడానికి సిద్ధంగా ఉ న్నారు? రైతులకు కూడా వారి వారి అభిప్రాయాలు వారికి ఉంటాయి. ఎందుకంటే, దాణా ఇచ్చే కంపెనీ ఏదో తెలియకుండా, 25 శాతం మార్జిన్ మనీ కడితే, 75 శాతం చొప్పున డిస్కౌంట్ మేము ఇస్తామని చెపితే, ఏ కంపెనీ దాణా ఇస్తారో, ఎటువంటిది ఇస్తారో అర్థంకాని పరిస్థితి రైతులకు అగమ్యగోచరంగా ఉంది. ప్రస్తుతం ఇస్తున్న దాణాని తీసుకోవాలా వద్దా అనే సందిగ్ధంలో కూడా వారు ఉన్నప్పుడు వారిని ఎడ్యుకేట్ చేయవలసిన పని ప్రభుత్వం మీద ఉన్నది. ఎందుకంటే, ఫలానా కంపెనీ దాణాలో పోషక విలువలు ఉన్నాయని చెపితే బావుంటుంది. అలాగే, మీరు ఇచ్చిన 25శాతం మార్జిన్‌మనీకి ఎటువంటి ఇబ్బంది ఉండదనేది చెప్పకపోతే, రైతులు పశువుల దాణా తీసుకునే విషయంలో కూడా శ్రద్ధ వహించడం లేదనేది మా ఉద్దేశం.

వ్యవసాయం మరియు ఉద్యానవనాల విషయంలో చిన్న, సన్నకారు రైతులకు సహాయాన్ని అందించే నిమిత్తం వ్యవసాయానికి సుమారు రూ.298కోట్లు, ఉద్యానవనానికి సుమారు రూ.2కోట్లు సహాయం కోసం కరువు మెమోరాండంలో ప్రతిపాదించడమైనది. త్వరలో కేంద్ర సహా యాన్ని తీసుకోవడమవుతుందని వివరణ ఇవ్వడం జరిగింది. సహాయాన్ని అందించడానికి కృషి చేస్తున్నామని అంటున్నారు కానీ, ఇవ్వవలసిన సహాయాలన్నీ ఏమీ ఇవ్వకుండా, రైతులను ఇబ్బంది పెట్టే విధానమే ఎక్కువ కనిపిస్తోంది.

అలాగే, ఇన్‌పుట్ సబ్సిడీ విషయానికి వస్తే, 2013లో ఏర్పడిన కరువు కారణంగా ఖరీఫ్ పంటలు ఎండిపోయాయి. అక్కడక్కడ మిగిలిన కొద్దిపాటి ఖరీఫ్, రబీ పైర్లను పైలాన్, లెహర్, హెలెన్ తుఫానులు, నైఋతి ఋతుపవనాలతో కురిసిన కుండపోత వర్షం వల్ల, అన్నీ తుడిచిపెట్టు కుపోయాయి. ఇక కోస్తాలోని సుమారు 423 మండలాలను తుఫాను ప్రభావిత మండలాలుగా ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడే గుర్తించడం జరిగింది. అయితే, ఇందులో ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయని మనం గమనించాలి. అలాగే, ఉమ్మడి రాష్ట్రంలో 119 మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తే, అందులో 6 మాత్రమే తెలంగాణాలో ఉన్నాయి. మిగతా 113 మండలాలు కూడా మన ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. అందులో సుమారు 108 మండలాల వరకు రాయలసీమలో ఉన్నాయి. వీటివలన అక్కడి రైతులకు తుఫానుల వల్ల పంట నష్టం జరగడం వలన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ క్రింద సుమారు 2,173.61కోట్లను మంజూరు చేయవలసిన ఆవశ్యకత ఉంటే, రైతులు సంవత్సరంన్నర కాలంగా అంటే, సుమారు 2013వ సంవత్సరం నుంచి రావలసిన ఇన్‌పుట్ సబ్సిడీని ఇవ్వమని వారు ప్రభుత్వాన్ని ప్రాధేయపడుతుంటే, సింపుల్‌గా శ్రీ యనమల రామకృష్ణుడు గారు బడ్జెట్‌లో 2013లో ఉన్నటువంటి ఇన్‌పుట్ సబ్సిడీలో పైసా రాదని, దానిమీద ఆశలు పెట్టుకోవద్దని అన్నారు. 2014లో మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తాము తప్ప, 2013కి ఎటు

వంటి సంబంధం లేదని చెప్పడం చాలా దయనీయమైనది. రైతుల యొక్క ఆత్మస్థైర్యం కూడా దెబ్బ తింటోంది. అంటే, ఇంతకన్నా ఉదాహరణ ఏం ఉంటుంది అధ్యక్షా? 2014లో ఇన్‌పుట్ సబ్సిడీ విష యానికి వస్తే, కరువు, హుద్‌హుద్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు మాత్రమే పెట్టుబడి రాయితీ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది రాష్ట్రంలో సుమారు 84.33 శాతం మండలా లలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క జిల్లాలో కూడా కనీసం సాధారణ వర్షం కురవలేదు. రాష్ట్రం మొత్తం మీద సగటు కనీస సాధారణ వర్షపాతం కంటే, 36 శాతం మాత్రమే కురిసింది. అంటే, అతి తక్కువ వర్షపాతం కురిసింది. ఫలితంగా, 560 మండలాలలో కరువు వలన అక్కడ విపరీతమైన పరిస్థితులు ఉంటే, మీరు 228 మండలాలను కరువు మండలాలుగా ప్రక టించడంలో అర్థం ఏం ఉంది అధ్యక్షా?

మ. **12.10**

అంటే, రాష్ట్రంలో 560 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించవలసిన పరిస్థితి ఉంటే, మీరు కేవలం 226 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారు. దానివల్ల, మీరు 560 మండలాల్లో పెట్టుబడి రాయితీని ఇవ్వవలసిన పరిస్థితి వస్తుందని చెబుతున్నాను. ఋణ మాఫీ విషయంలో మీరు కండీషన్లు పెట్టుకుంటూ వచ్చి, చివరకు రైతులకు ఏవిధంగా అన్యాయం చేశారో, ఆ విధంగానే ఇక్కడ కరువు మండలాలను ప్రకటించడంలో కూడా ఆ సంఖ్యని బాగా తగ్గించి, ఇన్‌పుట్ సబ్సిడీని కూడా తగ్గించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఆ విధంగా చేయడం వల్ల రైతులు ఆత్మస్థైర్యాన్ని పోగొట్టుకున్నారు. ఒకవైపు 2013 కు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీని పైసా కూడా ఇవ్వమని ఖరాఖండిగా చెప్పారు. పోనీ, 2014లో అన్నా సక్రమంగా ఇస్తారనుకుంటే అదీ లేదు. 2014 లో 560 మండలాలకు గాను, అందులో సగం మండలాలను మాత్రమే మీరు కరువు మండలాలుగా ప్రకటించడమనేది చూస్తే, ఆ రైతులు ఏం పాపం చేశారని ఈ విధంగా వాళ్లని ఇబ్బందులు పెడుతున్నారన్నదే మా ప్రశ్న. అయితే, ఒక్క ఇన్‌పుట్ సబ్సిడీలే కాకుండా, రైతుల విషయంలోకి వచ్చేసరికి రైతులు సక్రమంగా ఉండి, వర్షాలు బాగా కురిసి, సక్రమంగా పంటలు పండి ఉంటే ఈ కరువు పరిస్థితులు ఉండేవి కావు. ఒకవైపు రైతులు పంటలు పోయి, వర్షాలు లేక చాలా ఇబ్బందులు పడే పరిస్థితులుంటే, మరోవైపు ఋణ మాఫీ విషయంలో మన రామచంద్రయ్య గారు నిన్న మాట్లాడినప్పుడు, మన గౌరవ హోంమినిస్టర్ గారు రైతులు చాలా ఆనందంగా, సంతోషంగా ఉన్నారని చెప్పారు.

ఇది సందర్భమో, అసందర్భమో నాకు తెలియదు గానీ, నేను చెప్పేదేమంటే – మొట్టమొదట, తెలుగుదేశం మ్యానిఫెస్టోలో రైతులకు ఏ విధంగా మాటిచ్చారు? రైతులకు వ్యవసాయ ఋణాలిస్తామన్నారు. నిజానికి పంట రుణం వేరు, వ్యవసాయ ఋణం వేరు. మొదట వ్యవసాయ ఋణాలన్నారు, ఆ తరువాత పంట ఋణాలన్నారు. ఇంటికొక పంట ఋణమన్నారు. ముందు రూ.50,000/- అన్నారు, తరువాత రూ.1,00,000/- అన్నారు, ఆ తరువాత రూ.1,50,000/- అన్నారు. కనీసం యాభై వేల రూపాయల లోపు ఋణమైనా సరే, మేము చాలా బాగా ఇచ్చాము, రైతులు కూడా చాలా హ్యాపీగా ఉన్నారని చెప్పడమన్న దానికి నేను మీకు రెండు, మూడు ఉదాహరణలిస్తాను. దాన్ని బట్టి, రైతులు ఎంత ఆనందంగా ఉన్నారు, ఆత్మహత్యలు చేసుకోవాల్సిన ఆవశ్యకత వాళ్లకు ఎందుకు వచ్చిందనేది ఒక్కసారి ఆలోచన చేయాల్సిందిగా హోంమంత్రి గారిని కోరుతున్నాను. అధ్యక్షా, యాభైవేల రూపాయల లోపు ఋణాన్ని ఒకేసారి పూర్తిగా మాఫీ చేస్తామని వాళ్లు చెబుతున్నారు. ఎస్ఎల్‌బిసిలో బ్యాంకర్లు చెప్పిన లెక్కల ప్రకారం, రాష్ట్రంలో యాభై వేల రూపాయల లోపు తీసుకున్న వ్యవసాయ ఋణాలు మొత్తం రూ.13,280

కోట్లు ఉంది. కానీ, బడ్జెట్‌లో 2014-2015 లో కేటాయించిన అమౌంట్ ఎంతంటే - రూ.5,000 కోట్లు మాత్రమే. అంటే ఎస్ఎల్‌బిసిలో బ్యాంకర్లందరూ చెప్పిన వివరాలు కూడా రూ.13,280 కోట్లు. అది కూడా యాభై వేల రూపాయల లోపు రుణాలు మాత్రమేనని ఖచ్చితంగా బ్యాంకులన్నీ చెప్పినా, రూ.5,000 కోట్ల లోపు మాత్రమే అనౌన్స్ చేసి, రూ.5,000 కోట్లు పోగా, మిగతా రూ.8,000 కోట్లని ఏ విధంగా మీరు రైతులకు అందజేశారన్నది మాకు వివరణనివ్వాలి. దీనికి ఉదాహరణేమంటే, అనంతపురం జిల్లా హగిరి మండలం, ఇనగలూరుకు చెందిన రామన్న అనే రైతు, రెండు ఎకరాల్లో వేరుశెనగ సాగు చేసుకునేందుకు రూ.15,000/- అప్పు తీసుకున్నారు. అది కూడా యాభై వేల లోపే. ఆ మొత్తానికి వడ్డీతో కలిపి రూ.15,788/- అయ్యింది. మీరిచ్చిన మాట ప్రకారం, యాభై వేల లోపంటే మాత్రం ఖచ్చితంగా రూ.15,788/- కి మీరు ఋణ మాఫీ చెయ్యాలి. కానీ, ఋణ మాఫీ క్రింద ప్రభుత్వమిచ్చింది ఎంతంటే రూ.3,157/- మాత్రమే. అంటే, ఆ రైతు రూ.15,000 లో లోపే ఋణం తీసుకున్నాడు. కానీ, ఏ విధంగా ఆ రూ.15,000/- లోపు ఋణం మాఫీ అయ్యిందనేదే మా యొక్క ప్రశ్న అధ్యక్షా?

శ్రీ జి. తిప్పేస్వామి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఆ విషయం మా జిల్లాకు సంబంధించినది. సభ్యులు వాస్తవ విరుద్ధమైన మాటలు మాట్లాడుతున్నారు. మొదట కంప్యూటర్లో తప్పు వచ్చిన మాట వాస్తవం. తరువాత మళ్లా రెక్టిఫై చేయడం జరిగింది.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు: రెక్టిఫై అయితే సంతోషమే. కానీ, అలాంటివి నాలుగైదు ఇష్యూస్ ఉన్నాయి.

శ్రీ జి. తిప్పేస్వామి: దయచేసి సభ్యులకు మనవి చేసేదేమంటే - కంప్యూటర్ ఫాల్ట్‌ని తీసుకువచ్చి, ప్రభుత్వం ఏమీ చేయలేదనే విధంగా మాట్లాడటం తప్పు. కొన్ని లక్షల మందికి సంబంధించిన వ్యవహారం కాబట్టి, కంప్యూటర్ ఫాల్ట్ జరిగింది. అది మానవ తప్పిదం.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు: మేము కావాలని ప్రభుత్వాన్ని తప్పుపట్టడం లేదు సార్. కంప్యూటర్ ఫాల్ట్ అయితే మీరు సరి చేసుకోండి. అది సరి చేసిన తరువాత, మీరు పత్రికలకు వివరణనివ్వండి.

శ్రీ జి. తిప్పేస్వామి: అప్పారావు గారూ...... అక్కడ జరిగిన చిన్న కంప్యూటర్ ఫాల్ట్ తీసుకువచ్చి, మీకు చేతకాదనంటే ఎలా? దయచేసి ఆ మాటలు మీరు మానుకోవాలి. మీరు చెబుతున్నది తప్పు.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు: వివరణేదీ ఇవ్వకుండా, మాకే తెలుసు, మా మనస్సులో ఉందనుకుంటే అదెవ్వరూ సహించరు. ఈ విషయం రైతులందరి దృష్టిలోకి వెళ్లింది కాబట్టే నేను చెబుతున్నాను. రెండవదేమంటే, మైలవరం నియోజకవర్గం..

శ్రీ జి. తిప్పేస్వామి: అధ్యక్షా, అనంతపురం జిల్లాలో, 75 శాతం మందికి రూ.50,000/- లోపు ఋణ మాఫీ జరిగింది. రైతులు చాలా సంతోషంగానూ, ఆనందగానూ ఉన్నారు. సంతోషం లేనివాళ్లెవరంటే, ఆ పార్టీ (వైఎస్సార్ కాంగ్రెస్) వాళ్లకు మాత్రమే.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు: రైతులు సంతోషంగా ఉన్నారని మీరు భావిస్తున్నారు. మా హృదయాల్లో ఉన్నటువంటి భావనలను కప్పిపుచ్చి, మభ్యపెట్టి మీరు చేయాలనుకుంటున్నారు. ఎందుకంటే, మీరు గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పండి. మొట్టమొదట మీరు రూ.50,000/- వరకే మాఫీ చేస్తామని తెలుగుదేశం ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిందా? దానికి

మీరు ముందు సమాధానం ఇవ్వండి. మొత్తం వ్యవసాయ ఋణాల్ని మాఫీ చేస్తామని మీ మ్యానిఫెస్టోలో చెప్పారు. ఇప్పుడేమో, రూ.50,000/- లోపు అని చెబుతున్నారు. ఇప్పుడు, మీరిస్తామన్న రూ.50,000/- విషయంలో కూడా ఆ విధంగా మాట్లాడితే ఎలా?..

శ్రీ జి. తిప్పేస్వామిః మీరు చేయలేరని అన్నారు.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావుః అవును. మేము అసాధ్యమని చెప్పాము. చేతులెత్తలేదు. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తామని మీరే చెప్పారు. పోనీ అలా చేశారా?

శ్రీ జి.తిప్పేస్వామిః మేం చేశాం.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావుః ఏం చేశారు మీరు? రైతులకు మాయ మాటలు చెప్పారు. రైతులందరూ మిమ్మల్ని అబ్జర్వ్ చేస్తున్నారు. రైతులేమీ అంత అమాయకులు కారు. మేము చేయలేమని చేతులెత్తలేదు, ఇది సాధ్యం కాదని మాత్రమే ఆనాడు చెప్పాము. ఇవాళ కూడా మీరు అసాధ్యాన్ని, సుసాధ్యం చేస్తామని చెబుతున్నారు. చెప్పిన మేరకు పూర్తిగా రుణ మాఫీ చేయగలిగారా? అన్నీ అబద్ధాలే. మళ్లీ ఇంకెందుకు మాట్లాడతారు?

శ్రీ అంగర రామమోహన్ ః అప్పారావు గారూ! మీకు మాట్లాడే రైట్ లేదండీ.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావుః నేను మాట్లాడటం కాదు. మీకు మాట్లాడటానికే రైట్ లేదు. మీ మ్యానిఫెస్టోలో చెప్పిన మేరకు మాట నిలబెట్టుకుని అప్పుడు మీరు మాట్లాడండి. అంతేతప్ప, మీ ఇష్టమొచ్చినట్లు ఏదో ఒకటి మాట్లాడేద్దామంటే, ప్రజలు హర్షించరు, రైతులు హర్షించరు. వాళ్లకేదో ఇచ్చేసి సరిపెట్టేసుకుందామని అనుకుంటున్నారేమో! చాలా విషయాల్లో రైతులను పర్సనల్‌గా అడిగితే, దానికి వాళ్లు ఏమన్నారంటే - ప్రభుత్వం ఇది కూడా ఇవ్వదేమోనండి బాబూ! అనంటున్నారు. ఆ విషయాన్ని కూడా మీరు గమనించండి.

(ఈ సందర్భంలో డెప్యూటీ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

అధ్యక్షా, మైలవరం నియోజకవర్గానికి చెందిన సామ్రాజ్యమ్మ అనే మహిళ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పట్టాదారు పాసు పుస్తకాలతోబాటు, బంగారు నగలు తాకట్టుపెట్టి రుణం తీసుకున్నారు. దానికి రుణ మాఫీ వర్తించదని చెప్పారు. అలాగే, రైతుల ఆత్మహత్యల విషయానికి వచ్చేటప్పటికి, అనంతపురం జిల్లా కూడేరు మండలం, ఇప్పేరుకు చెందినటువంటి వన్నూరప్ప అనే ఆయన అప్పు తీసుకుంటే, దాని మీద రూ.14,310/- వడ్డీ అయితే, రుణమాఫీ క్రింద వాళ్లకిచ్చినది ఎంతంటే రూ. 8,736/- మాత్రమే. మరి ఇది కూడా కంప్యూటర్ తప్పంటే మేమేమీ చెప్పలేము. రూ.8,736 ఇస్తే, వడ్డీ క్రింద ఇంకా రూ.5,574/- తక్కువగా ఉంది. ఇది యథార్థం కాదా? ఆ వన్నూరప్ప ఈ అప్పుల బాధ పడలేక ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. అది కూడా మరి కంప్యూటర్ తప్పేమో, లేదా అతను ఏదైనా యాక్సిడెంట్‌లో పోయాడనో మీరు చెబితే అది మేం వినాలంతే! ఇలా చాలా విషయాలున్నాయి.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ (శాసనసభ నియోజకవర్గం)ః అప్పారావు గారూ.. మీరు కొన్ని సంఘటనలు చెబుతున్నారు కదా. దీనికి సంబంధించి, అలాంటిదే ఒక సంఘటన కడపలో నా దృష్టికి వచ్చింది. ఏమంటే, ఒకతను ఫోన్ చేసి, అన్నా, నాకు రెండు బ్యాంకుల్లో లోనుంది. ఒక బ్యాంకులో రూ.1,50,000/-, రెండో బ్యాంకులో రూ.3,00,000/- వరకు లోనుంది. గోల్డ్ కూడా పెట్టి అగ్రికల్చర్ లోన్ తీసుకున్నాను, నాకు ఋణ మాఫీ డబ్బులు రాలేదెట్లా అని అన్నాడు. నేను

అతన్ని పిలిపించాను. పాస్ బుక్ తీసుకుని నా దగ్గరకు రమ్మన్నాను. అతను పాస్‌బుక్ తీసుకుని నా దగ్గరకు వచ్చాక చూస్తే, రూ.1,50,000/- తీసుకున్న రుణానికి 15 సెంట్ల భూమిని, ష్యూరిటీగా గోల్డ్ పెట్టాడు. ఆ తరువాత రూ.3,00,000/- ఋణం తీసుకున్న దానికి, 35, 45 సెంట్ల భూమిని తనఖా పెట్టి రుణం తీసుకున్నాడు. అంటే వూరికే ష్యూరిటీ క్రింద చూపించేందుకు పెట్టాడు. అతని వాదనేమంటే - నా రూ.4,50,000/-మొత్తంలో, కనీసం మీరు చెప్పినట్టు రూ.1,50,000/- ఋణమాఫీ కావాలి కదా అన్నాడు. పాస్‌బుక్‌లో చూస్తే, ఒకదాంట్లో 30 సెంట్లుంది, ఒక పాస్ బుక్‌లో 15 సెంట్లుంది. ఇటువంటి ఇన్‌స్టన్సెస్ కూడా కొన్ని ఉన్నాయి.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావుః అధ్యక్షా, అలాక్కాదు. మీ ఏరియాలో సంఘటనల్ని మీరు చెబుతున్నారు. మా ఏరియాలో కూడా యాభై వేల లోపు రుణం తీసుకున్న వాళ్లకి ..

శ్రీ సి.రామచంద్రయ్యః 45 సెంట్లకు అంత డబ్బు ఎట్లాగిచ్చారు?

శ్రీ ఆదిరెడ్డి అప్పారావుః గోల్డ్ ష్యూరిటీ ఉంది కాబట్టి ఇచ్చుంటారు. ఆ వేళ మ్యానిఫెస్టోలో మీరు గోల్డ్ తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుని కూడా తిరిగి కట్టి, బంగారాన్ని మీ ఇంటికి తీసుకువచ్చి మీ మెడల్లో వేస్తామని చెప్పిన విషయం దయచేసి మర్చిపోవద్దు. అయితే, రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ చూడని కరువు ఇవాళ తాండవిస్తోంది. అనావృష్టితో అన్నదాతల గగ్గోలు-నీరు లేక నారు తడవక తరుముతున్న కరువు, చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోనే చాలా దారుణం- ఉపాధి లేక ఊసురుమంటున్న పల్లెలు, పొట్ట చేతపట్టుకుని వలసపోతున్న వ్యవసాయ కార్మికులు- అక్కరకు రాని కేంద్ర ఉపాధి హామీ పథకం ఇలాంటి పరిస్థితులున్నాయి.

ఇక్కడ ఒక విషయం అడుగుతున్నాను అధ్యక్షా. కేంద్ర ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా మనం అమలు జరిపినట్లయితే, ఈ రైతు కూలీలంతా పొట్టచేత పట్టుకుని, పట్టణాలకు వలస వెళ్లవలసిన ఆవశ్యకత లేదు. ఈవేళ కేంద్ర ఉపాధి హామీ పథకం సరైన పద్ధతుల్లో వెళ్లనప్పుడు, మీరు ఖచ్చితంగా ఆ పథకాన్ని అమలు చేయడానికి కృషి చేయాలి, వలసల్ని ఆపాలి. అలా మీరు వలసల్ని ఆపలేనప్పుడు, అది ప్రభుత్వ వైఫల్యాన్ని చాటుతుంది. కాబట్టి, ఆ విషయంలో ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. రాష్ట్రంలో కరువుంది, మేం చర్యలు తీసుకోబోతున్నాం, తీసుకుంటామని చెప్పడం కన్నా, కరువు నివారణకు ఏం చేస్తున్నాము, ఫలానాది చేశామని చెప్పి చూపించండి.

ఉ. **12.20**

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి ః ఈ సభలో మళ్లీ ఒక్కరే మినిస్టర్ ఉన్నారు సార్. ప్రతిసారి ఇదే విషయాన్ని చెప్పాల్సి వస్తోంది.

శ్రీ సి. రామచంద్రయ్య ః మంత్రి ఒక్కరే ఉన్నా బాధపడవలసిన పని లేదు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం తరఫున రిప్లై ఇస్తారు కాబట్టి, మినిస్టర్లు లేకపోయినా ఫరవాలేదు. ఇక్కడ సభలో స్టెనోగ్రాఫర్లు ఉన్నారు. వాళ్లు రికార్డ్ చేస్తారు, అది చూస్తే చాలు, ఇంకా మినిస్టర్లు ఎందుకు?

శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి ః ఈ విధానం ఏమీ బాగాలేదు. ప్రతిసారి ఇలాగే అయితే ఎలా?

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు ః అధ్యక్షా, పట్టిసీమ ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం కాదు. రాయలసీమకు నీళ్లిస్తామంటే మేము వద్దని అనము. రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాలకు సక్రమంగా సాగునీరు, త్రాగునీటిని ఇచ్చి రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటే అంతకన్నా మాకు కావలసిందేముంది.

మేము కోరుకునేదేముంది. అయితే, పట్టిసీమ ప్రాజెక్టు విషయంలో మాకు కొన్ని సందేహాలున్నాయి. మన హోం మంత్రిగారు కూడా కోనసీమ బిడ్డే. ఆయనకి తెలియనిది కాదు. ఖచ్చితంగా technical feasibility ఉందా లేదా అని అడుగుతున్నాను. రూ.1300 కోట్లు ఖర్చు పెట్టి పోలవరం ప్రాజెక్టు కంటే ముందు దీనిని కడుతున్నారు. పోలవరం నిర్మాణం పూర్తయితే దీనిని లేపేస్తామని అంటున్నారు. మనకు గ్రావిటీ కరక్ట్‌గా ఉందా లేదా అనేది చూడాలి. ధవళేశ్వరం దగ్గర ఎంత లెవల్ ఉంటే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు నీళ్లివ్వగలుగుతామనేది హోం మంత్రిగారికి కూడా తెలుసు. ధవళేశ్వరం బ్యారేజీ దగ్గర నీటి మట్టం 13.88 మీటర్లు ఎత్తు ఉంటేనే ఉభయ గోదావరి జిల్లాలలో రెండు పంటలకు నీళ్లివ్వగలుగుతాము. ధవళేశ్వరం నుండి పోలవరం దాకా 40 కి.మీ. దూరం ఉంది. గ్రావిటీ విషయానికి వస్తే, సాంకేతికంగా కొద్దిపాటి పరిజ్ఞానం ఉన్నవాళ్లు ఎవరైనా చెబుతారు. సాంకేతిక నిపుణులతో కమిటీ వేశాము, వాళ్లు ఒప్పుకున్నారు దాని ప్రకారంగానే మేము కడుతున్నామని ప్రభుత్వం చెబుతున్నది. మరి అక్కడ ఉండే రైతులకు వాళ్ల బాధలు వాళ్లకు ఉన్నాయి. వాళ్ల ఆలోచనలు వాళ్లకి ఉన్నాయి. పేపర్లమీద పెట్టే ఎక్స్‌పర్ట్స్ కన్నా ప్రాక్టికల్‌గా అనుభవించే రైతుల భావాలను మనం గ్రహించాలి. వాళ్లనేదేమంటే, 40 కి.మీ. పోలవరం వెళ్లడానికి గ్రావిటీ ఖచ్చితంగా 15 మీటర్లు దాటి ఉంటే తప్ప ధవళేశ్వరం వచ్చేటప్పటికి 13.88 మీటర్లు నిలబడదు. అయితే, ఈ 40 కి.మీ. దూరం తీసుకున్నప్పుడు 20 కి.మీ.లకు ఒక మీటరు చొప్పున ఒక లెవెల్ ఉంటుంది. అయితే, ఈ పట్టిసీమ ప్రాజెక్టుకు సంబంధించిన పైప్‌లైన్లు 12 ½ మీటర్ల ఎత్తులో బిగిస్తున్నారు. ఇంత ఎత్తులో నీటిని బిగిస్తూ, పైనుండి వచ్చే నీటిని తోడేస్తుంటే కింద ధవళేశ్వరం దగ్గరకు వచ్చేసరికి 13.88 మీటర్ల లెవల్ ఎలా మెయింటెయిన్ అవుతుందనేదే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్న రైతుల ఆందోళన. జి.వో.లో కూడా వరదలు వచ్చినప్పుడు మాత్రమే నీటిని తోడతామనే మాట ఎక్కడా మెన్షన్ చేయలేదు. జి.వో.లో మెన్షన్ చేయనప్పుడు వరదలు రానప్పుడు కూడా నీటిని తోడేస్తే, ఉభయ గోదావరి జిల్లాలు ఏమైపోతాయనేది అక్కడున్న రైతుల ఆందోళన. ప్రభుత్వం అనుకున్న మేరకు రోజుకు 8,500 క్యూసెక్కుల నీరు వెళ్లడానికి 109 రోజులు పడుతుంది. కానీ, వరదలు సంవత్సరానికి మూడు నెలలు మించి రావు. అంటే 90 రోజులు. మరి ఈ విధంగా 109 రోజులు ఆ నీరు చేరడానికి సమయం పడితే, మిగతా రోజులు వరదలు రాకపోయినా నీటిని తోడేస్తారా? 12 ½ మీటర్ల ఎత్తులో పెట్టినప్పుడు అక్కడ ఉన్న నీటిని బయటకు తీసేస్తే, ధవళేశ్వరానికి 13.88 ఎలా మెయింటెయిన్ అవుతుందనే ఆవేదనతో అక్కడ రైతులు మాట్లాడుతున్నారు. ఈ విధంగా మాట్లాడుతున్నానని డెప్యూటీ ఛైర్మన్‌గారు ఏమీ అనుకోవద్దు. మీరు నిన్న మాట్లాడుతూ పట్టిసీమ నుండి నీరు వస్తున్నదంటే పులివెందులలో తండోపతండాలుగా జనం వచ్చారని అన్నారు. సంతోషమే. వాళ్లకు ఎవరైనా పెడతారంటే సంతోషంగానే వస్తారు. మీకు ఈ సహాయం చేస్తామంటే ప్రతి ఒక్కళ్లు సమావేశాలకు వస్తారు. మీ భావనను మేము తప్పు అనడం లేదు. ఈ ప్రాజెక్టుకు మేము వ్యతిరేకం కూడా కాదు. అదే భావనతో ఈ ఉభయగోదావరి జిల్లాల రైతులకు మీకు అన్యాయం జరుగుతుంది, వాటర్ లెవల్ ఈ విధంగా ఉన్నది మీటింగ్‌కు రండి అంటే మీరు ఊహించినదానికన్నా రెండు రెట్లు, మూడు రెట్లు జనాలు వచ్చే అవకాశం ఉంది. రెండు పంటలు పండుతూ సుభిక్షంగా ఉన్నాం, ఈ ప్రాజెక్టువల్ల ఒక పంట పోతే పరిస్థితేమిటనే ఆలోచనతో ఆ మీటింగులకు పిలిస్తే రైతులు ఎక్కువమందే వచ్చే అవకాశం ఉంది. అంతేగానీ, మేమేదో బల ప్రదర్శన అనడం లేదు. సమావేశాలకు వచ్చే జనాభాను ప్రాతిపదికగా తీసుకోకూడదు.

శ్రీ సి. రామచంద్రయ్య : ఏదీ కూడా ప్రభుత్వం ఒక అంశాన్ని destabilize చేసేటప్పుడు it is for the other areas, ప్రజలను కాన్ఫిడెన్స్‌లోకి తీసుకుని చర్చించి ఆ పనిచేస్తే ఇంత

వివాదాస్పదం కాదు. సార్, ఉదాహరణగా ఒక సంఘటన చెబుతాను. కె.సి. కెనాల్‌కు తుంగభద్ర నదిపైన 10 టిఎమ్.సి.ల హక్కు ఉంది. కొలతలు వేసి తీసుకోవచ్చు. అనంతపురం ఎమ్ఎల్ఏలు అప్పుడున్న ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావుగారి దగ్గరకు వచ్చి మాకు నీళ్లు వచ్చే అవకాశం వేరే చోట లేదు, తుంగభద్ర నుండే తీసుకోవాలి whereas కె.సి. కెనాల్‌కు కావాలంటే శ్రీశైలం నుండి నీటిని తీసుకోవచ్చు కాబట్టి ఈ విధంగా మాకు జి.వో. ఇష్యూ చేయమని అడిగారు. కడప, కర్నూలు జిల్లాల ఎమ్ఎల్ఏలతో మూడు రోజులు ఆ అంశంపై చర్చించారు. ప్రజల దగ్గర మా ఇబ్బందులు, మా అభ్యంతరాలు అన్నీ చెప్పాము. అప్పుడు అక్కడ నీటి గురించి చాలా రచ్చలు, రావిడులు జరిగాయి. ప్రజలు పారలు, గడ్డపారలు తీసుకుని రోడ్డు మీదకు వచ్చారు. ఇవన్నీ మీకు తెలియనివి కాదు. అప్పుడొక పరిష్కారానికి వచ్చాము. నేనే interfere అయ్యాను. అన్నగారూ! నీళ్లివ్వండి, జి.వో. మాత్రం ఇష్యూ చేయకండి, జి.వో. ఇష్యూ చేస్తే మాకు అక్కడ ఇబ్బంది వస్తుంది అన్నాను. అదే విధంగా తుంగభద్ర నుండి అనంతపూర్‌కు నీళ్లిచ్చారు. ఇదేమీ చిన్న నిర్ణయం కాదు. చాలా controversial issue. We have been enjoying and we have been developed right over the project. తర తరాలుగా మాకు హక్కు ఉంది. అటువంటి హక్కును మార్చేటప్పుడు ప్రజా ప్రతినిధులను కాన్ఫిడెన్స్‌లోకి తీసుకుని వాళ్లతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. అటువంటిదేమైనా మీరు చేశారా? ఎందుకు ఈ ప్రభుత్వం వారు isolated గా నిర్ణయాలు తీసుకుంటున్నారు? గత సంవత్సరం, ఈ సంవత్సరం గవర్నర్ ప్రసంగంలో మాత్రం inclusive Government అని చెప్పారు. ఎందుకు unilateral గా నిర్ణయాలు తీసుకుంటున్నారు? మాకు అధికారం ఉంది మేము ఈ నిర్ణయం తీసుకుంటే ప్రజలు ఒప్పుకుంటారు, మా ఆలోచనలను ప్రజలు ఏకీభవిస్తారు అనే అభిప్రాయంతో ఉంటే అది అలజడులకు దారి తీస్తుంది. రాబోయే నాలుగున్నర సంవత్సరాలలో కూడా ఇటువంటి భయంకరమైన వాతావరణం వస్తుంది కాబట్టి ప్రభుత్వం అన్ని పార్టీలతో కలిసి పోవాల్సిన అవసరం ఉంది. ఇందులో మూసిపెట్టడానికి ఏముంది? మాకు వేరే అజెండా ఏమీ లేదని అంటున్నారు. ఓ.కె. అటువంటప్పుడు ఇరు ప్రాంతాల ఎమ్ఎల్ఏలను కూర్చోబెట్టి కన్విన్స్ చేయండి. నేను honest గా చెబుతున్నాను. గవర్నమెంట్ ఇంజనీర్లు ఏదైతే చెబుతున్నారో they are very skeptical about this project. ఈ ప్రాజెక్టుకు వాళ్లే skeptical గా ఉన్నారు. అయితే, వాళ్లు ఉద్యోగంలో ఉన్నారు కాబట్టి, పేర్లు చెప్పలేము. ఈ ఒక్క విషయమే కాదు. రాజధాని విషయంలోనైనా, మరేవిషయమైనా అందరినీ కలుపుకుని నిర్ణయం తీసుకుని ఉంటే ఇంత controversy కాదు. నా అనుమానమేమిటంటే, ప్రజలను డైవర్ట్ చేయడానికి ప్రభుత్వమే కాంట్రవర్సీ రావాలని కోరుకుంటోందా? అలా చేస్తే, మనమేమీ కాదనలేము.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప : అధ్యక్షా, ఈ ప్రాజెక్టును పూర్తిచేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నది. అందులో అనుమానమక్కర్లేదు. గౌరవ సభ్యులు ఎవరినైతే కాన్ఫిడెన్స్‌లోకి తీసుకోమంటున్నారో, మత్స్యకారులకు వ్యతిరేకంగా చేస్తారని చెప్పి ఎప్పుడూ సహకరించరు. ఆ ప్రాజెక్టు ఎప్పుడూ అవదు. లాండ్ పూలింగ్ గానీ, రాజధాని విషయంలో గానీ ఎవరైనా సపోర్టు చేస్తున్నారా? ఎవరూ సపోర్టు చేయలేదు. మమ్మల్ని అడగలేదని అంటున్నారు గానీ .....

శ్రీ సి. రామచంద్రయ్య : ఇది ఒక మంత్రి దగ్గర నుండి వచ్చే రిప్లై ఇదేనా? ఏం అనుకుంటున్నారు మీరు?

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప : లేకపోతే ఈ విషయాన్ని ఎన్నిసార్లు మాట్లాడతారండీ?

శ్రీ సి. రామచంద్రయ్య ః ప్రతిపక్షాన్ని పక్కకు పెట్టి నిర్ణయాలు చేస్తారా?

(అంతరాయం)

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప ః అధికారులను కూడా శంకిస్తారా మీరు?

శ్రీ సి. రామచంద్రయ్య ః మీ ఇష్టం వచ్చిన నిర్ణయాలను మీరు తీసుకుని ఈ విధంగా చేస్తున్నారు. ఖర్చు పెట్టేటప్పుడు ఎవరి నాయన సొత్తు అనుకున్నారు? మా కాంట్రిబ్యూషన్ కూడా ఉన్నది.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు ః ప్రతిపక్షాలపైన ఈ విధమైన ఆరోపణలు చేయడం మంచిది కాదు.

శ్రీ సి. రామచంద్రయ్య ః ఇటువంటి attitude మంచిది కాదు. మీకు ప్రజాస్వామ్యం మీద గౌరవం ఉంటే ఇక్కడ మాట్లాడండి. లేకుంటే, వీధుల్లో కలుసుకుంటాము.

మ. 12.30

అధ్యక్షా, మేము సలహాలిచ్చాము. వారు ఫాలో అయితే ఫాలో అవ్వమనండి, లేకుంటే వదలివేయమనండి.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప: అధ్యక్షా, వారు ఇచ్చింది మంచి సలహా అయితే మేము తీసుకుంటాము.

శ్రీ సి.రామచంద్రయ్య: అధ్యక్షా, బాధ్యతాయుతమైన ప్రభుత్వం అయితే అన్ని ప్రతిపక్ష పార్టీలతో కలిసి పనిచేస్తూ, వివాదాల్లోకి పోకుండా ఉంటే బాగుంటుందనే సలహాను మేమిస్తే వారు ఏమి మాట్లాడుతున్నారు?

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప: అధ్యక్షా, నిర్మాణాత్మకమైన సలహాలను ప్రతిపక్షం ఇస్తే తప్పకుండా మేము తీసుకుంటాము. కానీ, ఆ విధంగా లేదు.

శ్రీ సి.రామచంద్రయ్య: అధ్యక్షా, ఎందుకు లేదు? వారికి అనుకూలంగా ఉంటేనే నిర్మాణాత్మకమా?

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు: అధ్యక్షా, నిర్మాణాత్మకంగా లేదని మేమేదో ప్రతీ విషయంలో అడ్డుపడతాము, అభివృద్ధి నిరోధక శక్తిగా మామీద ముద్ర వేసి మమ్మల్ని నక్సలైట్లుగా చూడాలనుకుంటే చాలా కష్టం. ఏ ప్రభుత్వమైనా ప్రతిపక్షపార్టీలను కలుపుకుని ముందుకు వెళ్లాలి.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప: అధ్యక్షా, వారు దేనికి సహకరిస్తున్నారో చెప్పమనండి?

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు: అధ్యక్షా, సక్రమంగా వారుంటే మేము ఎందుకు వాళ్లకు సహకరించము? రైతులకు 2013వ సంవత్సరానికి చెందిన ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని అంటే మేము అడ్డుకుంటామా? 18 నెలలనుంచి ఆ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వారు అది ఎందుకు ఇవ్వకూడదు? 2013వ సంవత్సరానికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీని ఇవ్వకుండా 2014వ సంవత్సరానికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీని ఇస్తామని అంటున్నారు. 2014వ సంవత్సరంలో సుమారు 560 మండలాలకు, 268 మండలాలకు మాత్రమే ప్రకటించారు.

2013వ సంవత్సరంలో ఎవరు అధికారంలో ఉన్నా, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం బాధ్యత వహించాలి.

అధ్యక్షా, మేము ఏ ప్రాజెక్టుకీ వ్యతిరేకం కాదని చెబుతున్నాము. రాయలసీమకు నీరిస్తే, అందరూ కావాలనే కోరుకుంటున్నాము. కానీ, అది సాధ్యం అవుతుందా? నీటి లెవెల్స్ కరెక్టుగా ఉన్నాయా, లేవా? మా సందేహాలను మేము వ్యక్తపరుస్తున్నాము. ఉన్నాయంటే ఉన్నాయని చెప్పమనండి. అప్పుడు రైతులే నిర్ణయించుకుంటారు. భవిష్యత్తులో తేడా వచ్చినపుడు ప్రతిపక్ష పార్టీగా మా బాధ్యతను మేము నెరవేరుస్తాము.

అధ్యక్షా, దేశానికి వెన్నెముక రైతు. అందరికీ పట్టెడన్నం పెట్టేటటువంటి మహానుభావుడు రైతు. రైతుల విషయంలో మనం చాలా ఉదారంగా ముందుకు వెళ్లవలసిన అవసరముంది. రైతులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా మనం ప్రవర్తించవలసిన అవసరముంది. నేడు రుణమాఫీ పథకం సరిగా అమలు కావడం లేదు, ఇన్‌పుట్ సబ్సిడీ పథకం సరిగా అమలు కావడం లేదు. మేము ఏదో చేస్తున్నాము, కేంద్రప్రభుత్వాన్ని అడిగి తీసుకువస్తాము, కరవు మండలాలను దృష్టిలో పెట్టుకుని అంటే కరవు మండలాలుగా సగానికి సగం మాత్రమే వారు తీసుకుంటున్నారు. కాబట్టి న్యాయంగా ఎన్ని మండలాలు కరవు మండలాలుగా గుర్తించడం జరిగింది? వారు కేంద్రప్రభుత్వంతోనే కలిసి ప్రయాణం చేస్తున్నారు కాబట్టి వాస్తవాలను తెలియపరిచి ఎక్కువ నిధులను తీసుకురావడానికి త్వరగా ప్రయత్నం చేయాలి. ఎందుకంటే, ఏప్రిల్ మరియు మే నెలలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండి నీటి లెవల్స్ పడిపోతాయి. బోర్లు పనిచేయక ఇంకా కరవు ఎక్కువయ్యే పరిస్థితి ఉంటుంది కాబట్టి రైతులను సకాలంలో ఆదుకుని వలసలను ఆపాలని, రైతుల ఆత్మహత్యలను ఆపి ఈ రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చేయాలని నేను తమరిద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి: అధ్యక్షా, కరవు అంశంపై మాట్లాడడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు ముందుగా తమరికి నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కరవు అనగానే అందరికీ ఆలోచనలోగానీ, కనుచూపులోగానీ మొట్టమొదటి కనిపించేది అనంతపురం జిల్లా. అనంతపురం జిల్లా వాస్తవ్యులు గట్టిగా మాట్లాడతారని గౌరవసభ్యులు శ్రీ బసవపున్నయ్య గారు అంటూ ఉంటారు. ఎందుకంటే, ఆ కరవు కేకలు తరతరాలుగా వస్తూ ఉన్నాయి కాబట్టి మాగొంతు కూడా ఆ విధంగానే ఉంది. కరవును ఏడు తరాలుగా మేము అనుభవిస్తూనే ఉన్నాము. డొక్కల కరవు అని, గెంజి కరవు లాంటివన్నీ మేము అనుభవించామని చాలామంది పెద్దలు చెప్పేవారు. అప్పట్లో అనంతపురం జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులుగా శ్రీ అనంత వెంకటరెడ్డిగారు ఉండేవారు. ఆయన జీవిత కాలమంతా కూడా "నీళ్లకోసం పోరాడండి, నీళ్లకోసం పోరాడండి, నీళ్లకోసం పోరాడండి" అని చెప్పేవారు. శ్రీ దివాకర్‌రెడ్డిగారు అప్పుడు శాసనసభ్యులుగా ఉండేవారు. "మా వరకూ కాదు, భావితరాలకు ఈ నీళ్లు చాలా ఉపయోగం, ఇన్ని కరవులు అనుభవించిన మనం ఈరోజు ఈ స్థితిలో ఉండి భవిష్యత్తు గురించి మనం ఆలోచన చేయకపోతే ప్రజలు మనల్ని దుమ్మెత్తిపోస్తారు" అని ఆయన అనేవారు. నిజమే, ఇప్పుడు చూస్తూ ఉంటే, అది వాస్తవమని అనిపిస్తూ ఉంది. కరవుతో బాధపడే అనంతపురం జిల్లా రైతులుగానీ, ప్రజలు గానీ, ముఖ్యంగా ఈ నాలుగైదు నెలల్లో ఎవరూ ఇళ్లలో ఉండరు. మేము గ్రామాలకు వెళ్లినపుడు వారి ఇళ్లకు తాళాలు కనపడతాయిగానీ, మనుష్యులు కనపడరు. ఎందుకంటే, బెంగుళూరుకు లేదా కర్నాటక రాష్ట్ర సరిహద్దు జిల్లాలకు వలస పోయారని మాకు తెలియజేయడం జరుగుతోంది. మనం ఇన్ని ప్రయత్నాలు చేసినా, వలసలు ఆపే ఆలోచన ఎవరికీ మొన్నటి వరకూ లేకపోయింది.

అధ్యక్షా, మనం గమనిస్తే, ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల ప్రకారం అనంతపురం జిల్లాలో ఉన్న 63 మండలాలనూ కూడా కరవు మండలాలుగా ప్రకటించడం జరిగింది. దానిని బట్టి చూస్తే అనంతపురం జిల్లాలో కరవు అనేది ఎంత తీవ్రంగా ఉన్నదో మనకు తెలుస్తోంది. ఒక్కొక్కసారి గ్రామాలలోకి వెళితే, కరవు అంటే అదేదో ఇనుప గజ్జెలతో తాండవిస్తున్నట్లు, ఆ కరవు బారిన పడి ఎన్ని కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకుంటున్నాయనేది మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఈనాడు ఇక్కడ కూర్చుని అది చేశామని వారనడం గానీ, ఇది చేశామని మేమనడం గానీ, వాస్తవం కాదు. అక్కడున్న పల్లెల్లోకి వెళ్లి చూస్తే, ఎవరు ఎంతవరకూ ప్రజల గురించి ఆలోచన చేశారు, ప్రజలకున్న నీటిసమస్యను ఎంతవరకూ తీర్చారు, వ్యవసాయాన్ని అభివృద్ధిపరచడానికి ఏఏ ప్రాజెక్టులు పూర్తిచేశారంటే ఎక్కడా చేయలేదు. గౌరవనీయులు శ్రీ రామచంద్రయ్యగారంటే మాకు చాలా గౌరవం. ఆయన మాట్లాడుతూ, గతంలో శ్రీ ఎన్.చంద్రబాబునాయుడు గారు కేవలం రూ. 13 కోట్లు మాత్రమే మంజూరుచేయడం జరిగింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన మేము రూ. 3 వేల కోట్లు ఫలానా ప్రాజెక్టుకు మంజూరుచేశామని, రెండవసారి, రూ. 14 కోట్లు మాత్రమే వారు మంజూరు చేస్తే, మేము ఆ ప్రాజెక్టుకు రూ. 4 వేలకోట్లు మంజూరు చేశామని చెబుతున్నారు. నిజమే, మేము కూడా ఒప్పుకుంటున్నాము. మరి, ఆ పది సంవత్సరాలలో రూ. 4 వేల కోట్ల నుంచి రూ. 6 వేల కోట్లు మంజూరుచేసినపుడు ఒక్క ప్రాజెక్టు అయినా వారు పూర్తిచేసి వుంటే నేడు మేము తలవంచుకుని ఉండేవాళ్లము. "మీరు నీళ్లు తీసుకురండి, మేము చేతులెత్తి మొక్కుతామని" వారంటున్నారు. వారు నీరు తీసుకువచ్చి ఉంటే మేము కూడా వారిని మొక్కిఉండేవాళ్లం, రైతులు మరియు ప్రజలంతా కూడా వారిని మొక్కిఉండేవాళ్లు. నీళ్లు తెస్తే ఎవరు మొక్కరు? వారు పూర్తిచేసిన ఒక్క ప్రాజెక్టు అయినా ఉన్నదా నేను తమరిద్వారా వారిని అడుగుతున్నాను.

మ.**12.40**

మరి రైతుల ఆత్మహత్యలు అంటున్నారు. ఈ రోజే కాదు గతంలో కూడా చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలతో చందాలు వసూలు చేసినప్పుడు ఎందుకోసం వసూలు చేస్తున్నారని అడిగితే సోనియాగాంధీగారిని పిలిపిస్తున్నామన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు నష్టపరిహారం ఇప్పించడానికి సోనియాగాంధీగారిని ఢిల్లీనుండి పిలుచుకుని వచ్చినారు. తీరా చూస్తే ఏదో అంటారు కదా ఆ విధంగా కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నారు. అది చాలా పెద్ద కార్యక్రమం. చాలామందిని పిలిపించారు. తీరా చూస్తే రూ.25,000చొప్పున 17మంది రైతులకు ఇవ్వడానికి సోనియాగాంధిగారిని అనంతపురానికి తీసుకువచ్చినారు. మీకు నిజంగా వ్యవసాయంమీద శ్రద్ధ ఉండి, పేద రైతులు, బీద ప్రజలు అభివృద్ధిచెందడానికి మరింత చర్యలు తీసుకుని ఉంటే ఈరోజు లక్షలాదిమంది రైతులు ఋణమాఫీకి ఉండేవారే కాదు. నేను తగుదునమ్మా, నేను చాలా బాగున్నాను. నువ్వే నల్లగున్నావు అంటే ఎట్లా అధ్యక్షా. ఒకవేలు ఎదుటివాడికి చూపితే మిగిలిన మూడువేళ్ళు మనల్నే చూపిస్తాయి. ప్రజలకు సంబంధించిన ఆర్థిక వనరులు, నీటివనరుల విషయంలో అప్పటి ప్రభుత్వం ఏదైనా చేసి ఉంటే ఈరోజు ఈ స్థితికి వచ్చేదేకాదు. ఏమన్నా అంటే మీ నాయకుడు ఇన్ని హామీలు ఇచ్చినారంటారు. రాష్ట్రం కలిసి ఉన్నప్పుడు అందరూ ఇస్తారు. ఎవరైనా ఇస్తారు. ఈ రాష్ట్రం విడిపోతుందని ఎవ్వరూ కూడా కలగనలేదు.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావుః రాష్ట్రం విడిపోతుందని మీకు తెలుసు. రెండుకళ్ళ సిద్ధాంతంతో లెటర్లు ఇచ్చారు మర్చిపోవద్దు. రాష్ట్రం విడిపోతుందని తెలిసే మీరు హామీలిచ్చారు.

శ్రీమతి పమిడి శమంతకమణిః రాష్ట్రం విడిపోతుందని ఆరునెలలముందే మీకు తెలిసే సోనియాగాంధి దగ్గర సంతకాలు పెట్టించినారు. రామచంద్రయ్యగారికి బాగా తెలుసు. చీకటి ఒప్పందాలు ఎన్ని ఉన్నాయో అందరికీ తెలుసు మహానుభావా. ఏం చెప్తారయ్యా.

శ్రీ సి.రామచంద్రయ్యః అవన్నీ పట్టిసీమలో ఉన్నాయి తల్లీ.

శ్రీమతి పమిడి శమంతకమణిః అధ్యక్షా, పట్టిసీమ గురించి ఎవరెవరో చెప్తున్నారు. పట్టిసీమ ఎవరిదీ కాదు. పోలవరం చాలా నిదానంగా పూర్తవుతుంది. అంతవరకూ నీటిసమస్యను కొంతైనా మెరుగుపరచడానికి, రైతులు ఎంతోకొంత సాగుచేసుకోవడానికి, వారు వేసుకున్న చీనీ చెట్లకు నీళ్ళు రావడంకోసం సముద్రంలో నిరుపయోగంగా కలిసేనీటిని వెనక్కుతీసుకువచ్చి దానిని కృష్ణా నదికి అనుసంధానంచేసి అక్కడ్నుంచి శ్రీశైలం, అక్కడ్నుంచి హంద్రీనీవాకు తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. హంద్రీనీవా పేరు పెట్టేటప్పుడు రామచంద్రయ్యగారు మా దగ్గరే ఉన్నారు. ఆరోజు వారు ఎన్.టి.రామారావుగారితో మంచిపేర్లు పెట్టించినారు. మరి అటువంటిదానిని ఏ విధంగా పూర్తిచేశారో గుండెలమీద చెయ్యివేసి చెప్పమనండి. మొన్నటివరకూ వాళ్ళున్నారు కదా. మరి హంద్రీనీవా కాలువను పూర్తి చేశారా? హంద్రీనీవా కాలువను చూస్తే కండ్లలో నీళ్ళు తిరుగుతాయి. అన్ని వేల కోట్ల రూపాయలు ఆ కాంట్రాక్టర్‌కు ఇచ్చినాక, ఆ కాలువ పూర్తిచేసే పనికి ఎవరైనా పర్యవేక్షణలో ఉన్నారా? ఏ ఇంజనీర్లను, అధికార్లను మీరు పర్యవేక్షణలో పెట్టారు. ఎక్కడాకూడా లేదు. ఒక్కటి మాత్రం జరిగింది. అదేమంటే శ్రీరామరెడ్డి మంచినీటి పథకమని చెప్పి P.A.P.I డ్యామ్ నుండి టన్నెల్స్‌ద్వారా హిందూపూర్‌కు నీళ్ళు తీసుకుపోవడం జరిగింది. అవికూడా పూర్తిగా చేయలేదు. అదికూడా నిర్మాణాత్మకంగా జరగలేదు. ఒక్కొక్క టన్నెల్‌కు మధ్యలో సరైనవిధంగా నిర్మాణం జరగకపోవడంవల్ల పంపుకొడితే పైవరకూ నీటిఫాల్స్ ఉండే విధంగా

ఉంది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆరునెలల్లోనే జీడిపల్లి వరకూ నీటిని తీసుకురావడమే గాక నీటిపారుదల శాఖ మంత్రి ఉమామహేశ్వరరావుగారి స్వయంకృషితో కావలసిన నీటిని పంపు అవుట్ చేయడం జరిగింది. అందువల్ల ఈ మార్చి నెలలోనే అనంతపురం, కర్నూలు జిల్లాలలో నీరు వచ్చిందని నిన్ననే మీరు చెప్పారు. అక్కడి కాలువలమీదనే మేమంతా తిరిగినాం.

నేను పులివెందులలో సమావేశం నిర్వహిస్తే అక్కడికి వేలాదిమంది హాజరైనారంటే నాకెంతో గర్వకారణంగా ఉంది. మేం చేసి చూపిస్తున్నాం. మా ప్రభుత్వం వచ్చి ఆరునెలలే అయ్యింది. ఆరునెలల్లో ఏం ఉంటుంది? పదేళ్ళలో మీరు కొనసాగించలేనిది ఈ ఆరునెలల్లోనే ఎలా అవుతుంది? ఈ లోటు బడ్జెట్‌ద్వారా ఏ విధంగా చేయాలనేది మీరు చెప్పండి. మొన్ననే నేను చెప్పాను. కొత్త కాపురం. సత్తుగిన్నెలు కొనుక్కున్నాం. ఒక సంవత్సరం ఎదురుచూడండి. స్టీలుగిన్నెలు కొనుక్కుందాం. అంతేకానీ సత్తుగిన్నెలనిండా రంధ్రాలున్నాయేమోనని చూస్తే ఎట్లా? సత్తుగిన్నెల్లోనే ఉండం. రేపు సంవత్సరానికి స్టీలుగిన్నెలు కొనుక్కుంటాం. స్టీలు తట్టల్లో అన్నం తిందాం. ఈ ప్రభుత్వం ఇంకా నాలుగేళ్ళు ఉంటుంది. కాబట్టి మంచి సలహాలనివ్వమనండి.

అధ్యక్షా, ఈ సందర్భంగా ఒక కథ నాకు గుర్తొస్తోంది. "గతంలో ఒక ఆయన టక్ చేసుకుని ఒక ముసలామె దగ్గరికి వచ్చి అవ్వా, ఆకాశం పైన చూడమన్నాడు. ఏం నాయనా అని ఆమె అడిగితే, పైన ఒక విమానం పోయింది కదా నువ్వు చూసినావా అన్నాడు. నాయనా నేను చూడలేదు నాకు కండ్లు సరిగా కనబడవంది. అయ్యో, ఇప్పుడు ఒక హెలికాప్టర్ పోయింది నీకు చెముడుకదా వినబడి ఉండదులే అన్నాడు. మళ్ళీ కొంచెం సేపు అయినాక వర్షం పడింది. వర్షం పడినాక అవ్వా నీమీద పచ్చగా చినుకులు పడినాయి కదా అన్నాడు. అప్పుడు ఆమె పచ్చటి చినుకులు ఎక్కడ పడ్డాయి? చినుకులు మామూలుగా తెల్లగానే ఉంటాయి కదా అంది. అయ్యో లేదులే అవ్వా మేఘమథనం జరిగింది అందుకే పచ్చటి నీళ్ళు పడినాయి అన్నాడు". కాబట్టి అట్లాంటి అవినీతి కార్యక్రమాలకు పోవడంకానీ, ఆ మసి పూసుకోవడానికి కానీ మా ప్రభుత్వం ఇష్టపడడంలేదు. మా నాయకుడు అటువంటి మసి పూసుకోడు. గతంలో మేఘ మథనమనే పేరుతో కొన్ని కోట్ల రూపాయల అవినీతి కార్యక్రమాలు మొదలయ్యాయి. మరి అవి గుర్తుకు రావా మీకు. ఊరికే పట్టిసీమలో ఏదో చేసినారనడం, ఏం అంతదానికి పట్టి పట్టి చెప్పాల్సిన అవసరమేముంది. తినేవాడు కొండలు తిన్నాడు. పోయినవాడు కోట్ల రూపాయలు తినిపోయినాడు. మరి అవన్నీ గుర్తుకు రాకుండా ఏదో చారెడు బియ్యం, గజం స్థలం ఉన్నదానికోసం చంద్రబాబునాయుడుగారి దగ్గరకు వచ్చి నీ చారెడు బియ్యంతో మాకు పలావు, బిర్యానీ చేసి పెట్టలేదే అని అంటే ఏం చేసి పెడతాము. దానిని గంజి కాసి పోసినా ఇంతమందికి ఒక గ్లాసుడు గంజి కూడా రాని స్థితిలో మనమున్నాము. దానిని మనం గుర్తించుకోవాల్సి ఉంది.

ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐదు గ్రిడ్లు, ఏడు మిషన్లు, ప్రచార మాధ్యమాలను ఈ ప్రభుత్వం మొదలుపెట్టింది. అలాగే మంచినీటి వసతికోసం మా జిల్లాలో 2000పైచిలుకు మోటార్లు ఈరోజు ఉపయోగిస్తున్నారు. రెండవసాగుకు కూడా అక్కడ ప్రయత్నాలు చేస్తున్నాం. మంచి అధికారులను పెట్టుకుందామని మనం ప్రభుత్వానికి తెలియచేద్దాం. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలనున విజయవంతంగా అమలుచేసే అధికారులను పెట్టుకుని, వాళ్ళచేత పని చేయించుకునే విధానంలో మనముండాలి.

నేను ఎం.ఎల్.సి అయిన మొదటి సంవత్సరం అప్పటికి ఆ ప్రభుత్వం ఉండింది. మా జిల్లా మంత్రిగారు ఉన్నారు. మా జిల్లాలో జరుగుతున్న ఒక కార్యక్రమానికి ఎం.ఎల్.సిని కాబట్టి నన్ను

కూడా ప్రోటోకాల్ ప్రకారం తీసుకెళ్ళారు. ఏమిటయ్యా ఆ కార్యక్రమం అంటే 'జలప్రభ' అన్నారు. కానీ అనంతపురంలో జలమే లేదే ప్రభ ఎక్కడి నుంచి తెస్తారని నేను అనుకున్నాను. గౌరవంగా మమ్మల్ని పిలిచారని పోయినాము. పోయిన తరువాత ఎన్ని యూనిట్లు దీంట్లో గుర్తించినారన్నారు. ఏమిటి ఈ యూనిట్ అని అడిగాను.

మ.**12.50**

రెండు ఎకరాలు ఉన్న ఎస్సీ రైతులను 5మందిని కలిపి ఒక యూనిట్ గా చేయడం అవుతుంది. అంటే 10 ఎకరాలు ఒక యూనిట్. దానికి మామిడి చెట్లు 440 యూనిట్లు మేము గుర్తించామని సంబంధిత అధికారి చెప్పారు. ఆయన చెప్పగానే మరి ఎన్ని మామిడి చెట్లు పెట్టారని అడిగితే 400 మామిడి చెట్లు పెట్టామని చెప్పారు. మరి ఆ మామిడి చెట్లు ఎలా ఉన్నాయని అడిగితే మొత్తం చెట్లు చనిపోయాయని చెప్పారు. అదేంటీ? 400 మామిడి చెట్లు నాటితే ఒక్క మామిడి చెట్టుకూడా బ్రతకలేదా, ఒక్కో బిందె నీళ్లకు రూ.36 చొప్పున నేను నిధులు కేటాయిస్తే మీరు నీళ్లుపోసి వాటిని ఎందుకు బ్రతికించలేదని సంబంధిత అధికారిని మేము అడిగాము. జనం మధ్యలో నుండి ఒక వ్యక్తి లేచి, నీటిని సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను నేనే, నాకు గత మూడు నెలల నుండి ట్రాక్టర్‌తో నీళ్లు సరఫరా చేసినందుకు డబ్బులు ఇవ్వలేదని, అందుకే నేను నీళ్లు సరఫరా చేయడం లేదని చెప్పాడు. ఒక చిన్న మండలంలో నీటిరవాణాకు బిల్లులు ఇవ్వలేదే, సమైక్య రాష్ట్రంలో ఉండి, ఆర్థిక సామర్థ్యం ఉండి, అన్ని హంగులు ఉన్న మీరే 400 మామిడి చెట్లను బ్రతికించలేక పోయారు. కానీ, ఈనాడు ప్రభుత్వం ఏమీ చేయడం లేదు, రాజధానిని ఎలా నిర్మిస్తారు? పోలవరం ప్రాజెక్టును ఎలా పూర్తిచేస్తారు? దాని తూర్పు,పడమర,దక్షిణం ఏవంటే ఏమైనా న్యాయంగా ఉందా? కాబట్టి ఏదైనా మనం నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రారంభదశలో ఉన్నాము. మనకు కావాల్సిన వనరులను, మనకున్న వనరులను, మన ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, ఆర్థిక స్వావలంబనతో కార్యక్రమాలను చేపట్టడానికి మంచి సలహాలు ఇవ్వాలి. ఇక్కడున్న పెద్దలందరూ అనుభవం కలవారు. మొట్టమొదటనే చెప్పాను, గౌరవసభ్యులందరూ రాజకీయంగానే కాదు, కుటుంబ పరంగా కూడా ఎంతో అనుభవజ్ఞులు, మంచి సలహాలు ఇవ్వండి. ఈనాడు నడి సముద్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను గట్టుపైకి తీసుకురావడానికి మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఎంతో శ్రమిస్తున్నారు. ఆయనకు చేయూతనివ్వడానికి అందరూ ముందుకు రావాలని నేను ప్రతిఒక్కరినీ ఆహ్వానిస్తున్నాను. ఈ కరువును రూపుమాపడానికి గతంలో లాగ కాకుండా నవ్యాంధ్రప్రదేశ్‌లో అయినా అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేసి, ఏ రైతు కూడా ఆత్మహత్య చేసుకోకుండా, వలసపోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. ఒక్క రైతులే కాకుండా ఎంతోమంది పూలు అమ్మిన చోట కట్టెలు అమ్మలేక కదిరి రైతులు చూస్తే మదనపల్లి టమోటో మార్కెట్‌లో రోజువారీ కూలీలుగా ఉన్నారు. కదిరిలో ఉన్న బీడీకార్మికుల పిల్లలు దుబాయ్‌లో పనులకోసమని వెళ్లి దళారుల చేతిలో పడి నానా ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి వ్యవస్థను భవిష్యత్తులో ప్రజల ముందుకు తీసుకురాకుండా సమర్థవంతమైన పరిపాలన కొనసాగించడానికి ముందుకువెళ్లాలని, దానికి మంచి సలహాలు మీరంతా ఇవ్వాలని కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు తమరికి ధన్యవాదాలు తెలియజేస్తూ, నేను సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యండపల్లి శ్రీనివాసులురెడ్డిః అధ్యక్షా, ఈ కరువు మీద చర్చ జరుగుతున్న ప్రతీ సారి సంబంధిత మంత్రులు తక్కువగా గైర్హాజరు కావడం జరుగుతోంది. కరువు మీద పరిష్కారాల కోసం తీసుకునే పరిష్కార మార్గాలు ఏ విధంగా ఉంటాయనే విషయం చాలా బాధాకరంగా ఉంటోంది. నేను కరువును అనుభవించే చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతానికి చెందిన వ్యక్తిని. రాయలసీమ లోని

నాలుగు జిల్లాలు అత్యంత కరువు జిల్లాలుగా పేర్కొనవచ్చు. అందులో కర్నూలుకు కొంత మినహాయింపు ఉంటే అనంతపురం జిల్లా తరువాత కరువు మండలాలు అత్యధికంగా ఉన్నది ప్రకాశం జిల్లాలోనే. ఈ రోజు గౌరవసభ్యులు అనంతపురం స్థితిగతులు గురించి వివరించి చెప్పారు. అనంతపురంలో మెజారిటీ ప్రజానీకం వ్యవసాయం మీద ఆధారపడి బ్రతుకుతారు. వాళ్ల ఆత్మహత్యల రూపంలో కొందరు బలహీనులుగా ఉండేవారు. ఒకప్పుడు పెద్దమనుష్యులుగా బ్రతికి ఆ పల్లెకు ఆయనే ఒక పెద్దగా ఉన్న వాళ్లు సైతం పేర్లు చెబితే బాగుండదు, కనిపించకుండా వెళ్లిపోయినవారు ఉన్నారు. ఆ మిద్దెలు ఖాళీలుగా ఉంటూ అమ్మమ్మలు, నాయనమ్మలు మాత్రమే దిక్కుగా ఉండే ఇళ్లు అనేకం ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో కూడా పశ్చిమ మండలాలు దాదాపుగా పాలమూరు, అనంతపురం జిల్లాల తరువాత అంత దుర్భిక్షాన్ని గత 15 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన పరిస్థితి. చిత్తూరు జిల్లాలో ఇప్పటికి దాదాపుగా 3,852 గ్రామాలలో మంచినీటి ఎద్దడి తీవ్ర రూపంలో ఉంది. దాదాపుగా జనవరి వరకు నీరు సరఫరా చేసే ట్యాంకర్లు గ్రామాలలో1800, పట్టణాలలో 1800 గా ఉంటున్నాయి. ఇది జనవరి వరకు మాత్రమే. శీతాకాల పరిస్థితులు ఉత్పన్నమయ్యే నాటికే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసే పరిస్థితికి చిత్తూరు జిల్లా వచ్చింది. దానికోసం నెలకు రూ.4కోట్లు ఖర్చవుతున్నాయి. SWO , RWO అధికారుల నివేదికల ప్రకారం జూన్ వరకూ కూడా ట్యాంకర్ల ద్వారా నీరు అందించడానికి రూ.20కోట్లు అవసరమని చెబుతున్నారు. కానీ ఈ నివేదిక వారు చెప్పిన దాని ప్రకారం 1,642 గ్రామాలకే వర్తిస్తుంది. ఈరోజు 3,852 గ్రామాలలో ట్యాంకర్లతో నీళ్లు సరఫరా చేస్తున్న పరిస్థితి ఉంది. ఇదే పరిస్థితి పూర్తి స్థాయిలో ప్రకాశం జిల్లాలో కూడా ఉంది. మొత్తం ప్రకాశం జిల్లా ఏర్పడిన నైసర్గిక స్వరూపం మీకు తెలుసు. కర్నూలు జిల్లాలోని మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు ప్రాంతాలు దాదాపుగా పూర్తిగా దుర్భిక్షమైన మరియు ఫ్లోరిన్‌తో తీవ్రంగా సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలు. మంచినీటి, సాగునీటి ఎద్దడి విపరీతంగా ఉన్నది. ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి, అనేకమంది అనేక నివేదికలలో చెప్పారు, పరస్పరం అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేసుకుంటూనే ఉన్న ప్రత్యేకమైన పరిస్థితులు చూస్తూనే ఉన్నాము. కానీ ఈనాడు పూర్తిగా ఈ కరువు పరిస్థితికి పరిష్కార మార్గాలుగా ఉన్న ఆయా జిల్లాలలో ఉండే పెండింగ్ ప్రాజెక్టులు , రాయలసీమలో ఉండే పెండింగ్ ప్రాజెక్టులు హంద్రీనీవా ప్రాజెక్టును త్రికరణ శుద్ధిగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కృషిచేయాలి. నిన్న నీటిపారుదల శాఖా మంత్రిగారు చాలా చక్కగా చెప్పారు. చిరంజీవి నటించిన సినిమాలో లాగ నీటిని తీసుకుపోయి, మంచి పాట వస్తే మనం కూడా మంచి ఆనందంతో తాండవం చేసి, ఆనందభాష్పాలు రావడాన్ని ఇంద్ర సినిమాలో చూసినట్లుగా చెప్పారు, చాలా సంతోషం. అదే నిజంగా జరిగితే మాకన్నా సంతోషించేవారు ఎవ్వరూ ఉండరు. ఆత్మహత్యలు కొంతమంది చేసుకుంటే, ఊరు వెళ్లి వస్తానని చెప్పి, కంటికి కనిపించకుండా ఎటో వెళ్లిపోయిన వ్యక్తులు మా పల్లెలోనే దాదాపు 10 మంది ఉంటున్నారు. ఉగాది, సంక్రాంతి లాంటి పండుగలకు పల్లెకు, బంధువుల ఇళ్లకు పోవాలంటే గుండె దడదడలాడుతోంది. వ్యవసాయం చేసుకుంటున్నవాళ్లను చూసి, ఆ పల్లెలకు పోయి, కనీసం 5 రోజులు ఆ పరిస్థితులను చూసి తట్టుకోలేక కళ్లు మూసుకుని వెళ్లి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొరగా ఎవరైనా వ్యవసాయం చేసుకుని, చెరుకు గానుగలు ఆడుతూ ఉంటే ఆ చెరుకు క్రషర్‌లో చేయి పడి నాలుగువేళ్లు పోగొట్టుకున్న సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో చెరుకు పంటను ఆధారంగా చేసుకుని, ఆ పంటను తక్కువ నీటితో పండించుకుని, బెల్లం అమ్ముకుంటే ఒకరకమైన గిట్టుబాటు ధర వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ దాదాపుగా స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఉంది. దానికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. అది మంచి లాభాలతో ఉండడం వల్ల ఆ చక్కెర ఫ్యాక్టరీ

ప్రక్కనే మంచి కళ్యాణ మండపం కూడా నిర్మించారు. కానీ ఈ రోజున ఆ చక్కెర ఫ్యాక్టరీని తెరవలేక పోతున్నారు. పొలాలలోనే చెరుకు పంట ఎండిపోతోంది.

మ.**1.00**

గతంలో పుంగనూరు ఫ్యాక్టరీని రెండేళ్లుగా లాకౌట్ చేశారు. రేణిగుంట ఫ్యాక్టరీని ఏదో అరకొరగా తెరుస్తున్నారు. రాష్ట్రప్రభుత్వాల అవసరాల కోసం ఈ సహకార షుగర్ ఫ్యాక్టరీల నుంచి నిల్వ ఉన్న చక్కెరను తీసుకోవడానికి టెండరుని తీసుకోరు. ఎందుకు ప్రైవేటు ఫ్యాక్టరీల దగ్గర నుంచి టెండర్లు తీసుకుంటారు? ఆ చరిత్ర లోపలికి వెళితే అది మా జిల్లాలోనే అని నాకు తెలుసు. కానీ ఈ రోజు అటువంటి చక్కెర ఫ్యాక్టరీలు, మూసివేతకు దగ్గరగా ఉండే పరిస్థితులు ఉన్నాయి. మనం గత ఇరవై ఏళ్లనుండి కేంద్రప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నప్పటికీ, పంట ఉత్పత్తిలో నష్టదాయకమైన గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నారు. హంద్రీ–నీవా ప్రాజెక్టు దాదాపు రాయలసీమ నాలుగు జిల్లాలకు సంబంధించిన ప్రాజెక్టు. ఇది 2006 వ సంవత్సరంలో ప్రారంభమైనట్లుగా సమాచారం ఉంది. దాదాపు ఈ ప్రాజెక్టును త్రికరణ శుద్ధిగా పూర్తిచేస్తే, 6.6 లక్షల ఎకరాలకు నీరు, దాదాపు మూడు లక్షల మంది గొంతెండిపోతున్న వారికి గొంతు తడపవచ్చు. చిత్తూరు జిల్లాలో లక్షా యాభైవేల ఎకరాలకు నీరందించే పథకం, నాలుగు లక్షల మందికి నీరందించే పథకం, ఈ పరిస్థితులలో త్రికరణ శుద్ధిగా చేస్తే పూర్తవుతుంది. ఇంతకు ముందు మంత్రిగారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు అని అన్నారు. అసలు ఎవరు ఆ కాంట్రాక్టర్లు? ఎవరు ఆ తప్పు చేశారు? సకాలంలో పూర్తి చేయకుండా ఉంటే, వాళ్ల మీద చర్యలు కూడా తీసుకోమనండి, కాంట్రాక్టర్ల పేర్లు కూడా బయటకు తీసుకురండి. మా గుండె మండి మాట్లాడే మాటలు మీరు అర్థం చేసుకోండి. హంద్రీ–నీవా దాదాపు 60 శాతం పూర్తయింది. దానిని పూర్తి చేస్తే చిత్తూరు జిల్లాలో కూడా దాదాపుగా చంద్రగిరి, పలమనేరు, పూతలపట్టు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి వంటి మొత్తం తొమ్మిది నియోజకవర్గాలకు సాగునీరు అందించవచ్చు. ఆ బోర్లు వేసి ఆ నీరన్నా త్రాగవచ్చు. బోర్లు గురించి నేనెందుకు చెబుతున్నానంటే, బోర్లు వేస్తే 100 అడుగులకు రూ. 70 లు. 500 ల అడుగులకు రూ.100 లు, 1000 కి రూ.120లు, 1500 లకు రూ.150లు. ఆ రైతు రూ. 1.50 లక్షలు ఆబోరుకు కట్టవలసిన పరిస్థితిని నా సన్నిహితులు, బంధువులు దగ్గర నుంచి నేను చూస్తున్నాను. ఎంతోమంది బోర్ వేసి పారిపోయిన వారు కూడా ఉన్నారు. ఎంతో మంది దిక్కు లేక "మాటతప్పిన వాడా" అని అనిపించుకుంటూ తిరిగే పరిస్థితులు ఉన్నాయి. ఈ ప్రత్యేకమైన పరిస్థితుల వల్ల ఒకరిమీద ఒకరు నిందారోపణలు చేసుకుంటున్నారు. ఒక పెద్ద ప్రాజెక్టు అయిన హంద్రీ-నీవాని పూర్తి చేయండి. పట్టిసీమ ప్రాజెక్టును మేము ఆహ్వానిస్తున్నాము. No doubt about that. పోలవరం ప్రాజెక్టు వస్తే అంతకంటే మహదానందపడేవాళ్లు ఎవరుండరు? ఈరోజు రాయలసీమకు దిక్కుమొక్కుగా ఉంటున్న హంద్రీ-నీవా పూర్తవుతుందా? అది పూర్తవడానికి కూడా సమస్యలు అనేకం ఉన్నాయి. మేము ఏ వర్గానికి చెందిన వారము కాదు. జనం బాగుంటే బాగుందామని చెప్పి, రైతు బాగుంటే రైతుతో బాటు అరుగుమీద కూర్చొని ఆనందం పంచుకుందామని అనుకునేవాళ్లం. ఈ రోజు హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తిచేయడానికి ఉన్న మిగతా 40 శాతం అడ్డంకులు, అందులో స్వయాన నా అల్లుడు ఉన్న 10 ఎకరాల మాగాణిలో ఒక్క సెంటు భూమికూడా ఉంచుకోకుండా హంద్రీ-నీవా ప్రాజెక్టు కాలువకు ఇచ్చారు. అలా ఇచ్చిన రోజు ఎవ్వరూ కూడా బాధపడలేదు. నీళ్లు వస్తే అందరూ బాగుంటారు, అందరూ బాగుంటే మనము బాగుంటాము. అతనికి కేవలం అరెకరం పొలం మాత్రమే మిగిలింది. అయినా ఎవరూ

బాధ పడని పరిస్థితి ఆ కుటుంబములో ఉంది. సొంత విషయం కాబట్టి, నేను ఆ కుటుంబం గురించి మాట్లాడవలసిన అవసరం లేదు. ఆ హంద్రీ–నీవాను ప్రభుత్వం అనుకుంటే ఇప్పుడు నిర్మించే రాజధాని నగరం మనకు అవసరమే, కానీ రాజధాని నగరం మీద ప్రభుత్వం తీసుకునే శ్రద్ధ, హంద్రీనీవా మీద తీసుకుంటే దానిని ఖచ్చితంగా 6 నెలల్లో పూర్తి చేయవచ్చు. ఎందుకు నేనీ మాట అంటున్నానంటే గత సంవత్సరం మన శ్రీశైలం, నాగార్జున సాగర్ గేట్లు రెండు పర్యాయాలు ఎత్తడం జరిగింది. రెండు పర్యాయాలు నీరు వృథాగా పోయాయి. ఈరోజు అన్నింటికి ఆధారమైన ఆ పోతిరెడ్డిపాడు కాలువ పనులను యుద్ధప్రాతిపదికన తీసుకోండి. పల్లెలో ఉండే జనాభా ఇప్పుడు లేరు. వారు ఎన్నికలప్పుడు వస్తున్నారు, తప్పితే సుమారు యాభై, అరవై మంది కంటే ఎక్కువ లేరు. ఉపాధిహామీ పథకం కూడా లేక అందరూ వలసవెళ్లిన నేపథ్యం అక్కడ ఉంది. ఇదే పరిస్థితులు మొత్తం ప్రకాశం జిల్లాలో కనిపిస్తున్నాయి. ఎందుకంటే, నా నియోజక వర్గంలో మూడు జిల్లాలు ఉన్నాయి, కాబట్టి నేనక్కడికి వెళ్లినప్పుడు చాలా బాధగా ఉంటుంది. అక్కడ కూడా దాదాపుగా 26 మండలాలలో మంచి నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాము. ఫ్లోరిన్‌తో బాధపడుతున్నారు. ఉపాధిహామీ పథకాలు ఎక్కడా లేక జనం నివ్వెర పోతునారు. ప్రధాన పంటలైన ప్రత్తికి గిట్టుబాటు ధర లేదు. ఆనాడు శనగపంటలు వేసుకోమని చెప్పి రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. ఆ శనగపంటకు కూడా గిట్టుబాటుధర లేదు. వ్యవసాయం చేసి, అప్పులు చేసి రకరకాల బ్యాంకులలో రూ.5లు రూ.2లు వడ్డీకి తెచ్చి, కనపడిన వ్యక్తులందరికీ సలామ్‌లు కొడుతూ అప్పులు చేసి పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పించలేము. మనం వరికి కూడా గిట్టుబాటు ధర తీసుకురాలేము. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయం చేయడం చాలా ఆందోళనకరంగా ఉంది. నా భావన ఒకటే మీకు చెబుతున్నాను. ప్రధానంగా, ఈ పెండింగ్ ప్రాజెక్టుల్లో హంద్రీ-నీవా ప్రాజెక్టు 60 శాతం పూర్తయింది, గాలేరు నగరికి సంబంధించి కరకంబాడు, రేణిగుంటలో శంకుస్థాపన చేశారు, 70శాతం పనులు పూర్తయ్యాయి. మా మంత్రిగారు కూడా ఇక్కడ ఉన్నారు, వారి నియోజకవర్గానికి కూడా ఈ నీళ్ళు వెళతాయి. దాదాపుగా పుత్తూరు, నగరి పట్టణ ప్రాంతాల్లో ఒక లక్షా ఇరవై వేల మందికి త్రాగునీరు, ఒక లక్షా యాభైవేల ఎకరాల పంటకు నీరందించే మంచి పథకం. అదేవిధంగా, సోమశిల, స్వర్ణముఖి ప్రాజెక్టులు నిధుల కొరతతో ఆగిపోయాయి. సదాశివకోన ప్రాజెక్టు 1979వ సంవత్సరంలో అరకొర బడ్జెటుతో ప్రారంభమైంది. దానికి కూడా నిధులు ఇవ్వలేని పరిస్థితి ఉంది. అరెనియార్ అని పిచ్చాటూరులో ఒక ప్రాజెక్టు, ఉమ్మడి సంయుక్త రాష్ట్రంలో తమిళనాడు ప్రభుత్వం కట్టింది. కానీ, ఇక్కడ ఒక్క టి.ఎం.సి కూడా నిలవకుండా అన్నీ తమిళనాడుకే వెళ్లేటట్లు కట్టారు. అప్పుడు నిర్మించిన గేట్లు త్రుప్పు పట్టిన పరిస్థితిని చూసి బాధగా ఉంది. 1984 లో ఒకసారి నిండింది. గేట్లు బాగాలేకపోవడం వల్ల నీరు వృథా అయ్యాయి. 1993వ సంవత్సరంలో నిండింది కానీ, గేట్లు సరిగా లేవని వృథా అయ్యాయి. 2005వ సంవత్సరంలో కూడా ఆ ప్రాజెక్టు నిండింది. కానీ ఒక్క చుక్క నీటిని కూడా వాడుకోలేకపోయాము. 2010వ సంవత్సరంలో కూడా నీరు నిండింది. ఒక్క చుక్క కూడా తీసుకోలేని ప్రత్యేకమైన పరిస్థితి. ఆ గేట్లను మొన్న నిర్మించామంటున్నారు, వాటికి దాదాపు రూ. 15కోట్లు ఖర్చయ్యాయి. చిన్నేరు ప్రాజెక్టు, పెద్ద మండలంలో ఆకుమానుకుంట్ల ప్రాజెక్టు పూర్తయింది. కానీ దానిలో ఉండే చిన్న విషయం పరిష్కరించలేక, మూడు పర్యాయాలు ఆ ప్రాజెక్టు నిండినా ఒక్కబొట్టు కూడా నీరు వాడుకోలేని పరిస్థితి అక్కడ ఉంది.అదేవిధంగా, జరికోనా ప్రాజెక్టు ఇది పోలార్ ప్రాజెక్టు. ప్రధానంగాప్రకాశం జిల్లా గురించి చెప్పాలంటే దానికి దిక్కుమొక్కైన వెలిగొండ ప్రాజెక్టు 60 శాతం పూర్తయింది. ఇందాక మేడమ్ చెప్పినట్లు ఇద్దరు కాంట్రాక్టర్లు ఆ సారంగ కాలువలు కాంట్రాక్టుకు తీసుకుంటే దానిలో గిట్టుబాటుధర లేక వాళ్లు నిలిపివేశారు. గిట్టుబాటు

లేకపోతే ఊరుకుందామా, దాదాపు రూ.3,600 కోట్లు పైచిలుకు ఖర్చుపెట్టాము. హెడ్ రెగ్యులేటర్ అనే దానిని ఆవిష్కరిస్తే నీటిని వాడుకోవచ్చు. ఈ 30 మండలాలకు తాగునీటిని అందించే పరిస్థితి. 15 మండలాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు అది. నాలుగు లక్షల నలభై ఏడు హెక్టార్లకు నీళ్లు అందించేది. ఇంకో ప్రాజెక్టు గుండ్లకమ్మ. దానికి బడ్జెటు రూ.592 కోట్లు అయినా, రూ.695 కోట్లు ఖర్చుపెట్టి పూర్తి చేశారు. కానీ అక్కడ నుంచి వచ్చే సప్లై ఛానల్స్ చిన్నచిన్న కాలువలు. 25 కి.మీ. ఫీల్డ్ ఛానల్స్ ఇవ్వలేక, ఆ గుండ్లకమ్మలోని నీళ్లు దాదాపుగాప్రకాశం జిల్లా రైతులు అందుకోలేని పరిస్థితి ఉంది. అక్కడ ఉన్న సమస్యలు చిన్నచిన్నవి. జాతీయ రహదారి యొక్క పర్మిషన్ కొంచెము, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ మధ్య సమన్వయం లేకపోవడం చేత పూర్తయిన ప్రాజెక్టు, చిన్న ప్రాజెక్టు, పెద్ద ఫలితము ఇచ్చే ప్రాజెక్టు ఈ గుండ్లకమ్మ ప్రాజెక్టు దాదాపుగా లక్ష ఎకరాలకు నీరందించే ప్రాజెక్టు. నాలుగు దుర్భిక్ష మండలాలకు నీళ్లిచ్చే ప్రాజెక్టు. నేనెందుకు ఇంత స్పెసిఫిక్‌గా చెబుతున్నానంటే ప్రకాశం జిల్లాకు స్పెషల్ ప్యాకేజి లేదు, కానీ రాయలసీమకు ఉంది, ఉత్తరాంధ్రకు ఉంది. ఈ బాధ్యత గౌరవసభ్యులు శ్రీ తిప్పేస్వామి గారిపై ఉంది. ప్రకాశం జిల్లాకి కూడా ప్రత్యేక ప్యాకేజిని ఇవ్వడం కోసం దృష్టి కేంద్రీకరించాలని నేను తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదేవిధంగా, సంగమేశ్వర పోలేరు ప్రాజెక్టు, బవనాశి రిజర్వాయరు, పాలేటుపల్లి ప్రాజెక్టులను కూడా పూర్తి చేయాలి. చివరకు, నెల్లూరు జిల్లాకు వస్తే, నెల్లూరు జిల్లాకు ఎక్కడికి వెళ్లినా నీళ్లు ఉంటాయి, ఎక్కడికి వెళ్లినా మంచి బువ్వ ఉంటుంది, ఎక్కడికి వెళ్లినా మంచి వసతులు ఉంటాయనుకుంటాము. కానీ, నాన్ డెల్టా ఏరియాలలో సర్వే ప్రకారం నేను చెబుతున్నాను,నేనెప్పుడూ నిరంతరం తిరుగుతుంటాను. 26 మండలాలలో మంచి నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ప్రత్యేకమైన పరిస్థితి అక్కడ ఉంది.

మ.**1.10**

అక్కడ కూడా పెద్ద పెద్ద జమిందారులు ఉండే ఊరు అది. సంగం పిటఫ్ బ్యారేజ్, నెల్లూరు మీద పిటఫ్ బ్యారేజీ కానివ్వండి ఈ రెండు నిర్మాణాలు కూడా ఇంతవరకు పరిష్కరించలేదు. ఇవి క్షణాలలో పూర్తి చేసే బ్యారేజీలు. వీటిని కూడా తీసుకురాలేని పరిస్థితి ఇప్పుడున్న ఈ నేపథ్యంలో కొనసాగుతుంది. కరువు మీద ఇంకా చాలా విషయాలు చెప్పాలి. ఎందుకంటే కరువు ఎక్కువగా ఉన్నప్పటికి కూడా ప్రజలు డబ్బును ఎక్కడ నుంచి తీసుకువస్తున్నారో కానీ వాళ్ల బిడ్డలను చదివించుకుంటున్నారు. ఉద్యోగాలు లేవు. నిరుద్యోగం విళయతాండవం అడుతున్నది. ఏ జరుగుబాటు లేదు. బంధువు దగ్గరకు ఈ జరుగుబాటులేని కుటుంబీకుల బిడ్డలు వెళితే తలతిప్పుకునే ప్రత్యేకమైన పరిస్థితి ఉన్నది. ఈ ప్రత్యేకమైన పరిస్థితిని గమనంలోకి తీసుకొని ఈ రాష్ట్రంలో ఖాళీలుగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో కొరత ఉన్నది. విద్యాలయాలలో వాచ్‌మెన్ కూడా లేని పరిస్థితి ఉన్నది. వైద్యాలయాలలో మూడింతలు కావలసిన ఉద్యోగాలలో ఒక శాతం కూడా లేని పరిస్థితి ఉన్నది. చదువుకున్న పిల్లలు దొంగలు అవుతున్నారు. కొంతమంది ఒక పూట తిని బ్రతుకుతున్నారు. మరి కొంతమంది ఎలాంటి విధానం ఉన్నదో మాటలో చెప్పలేని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితిలో రాష్ట్రం ఇబ్బందులలో ఉన్నది. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం జరగాలి. చాలా త్రికరణశుద్ధిగా చెబుతున్నారు. దానికి మేము కూడా స్వాగతం పలుకుతున్నాము. రాజధానికి అమరావతి అని పేరు పెడతారు. చాలా అనందంగా తృప్తిగా ఎంత మధురానుభూతిగా ఉందంటే మాటలు చెప్పలేని పరిస్థితిగా ఉన్నది. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మనము శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులతోపాటు అనేకమైన బహుళార్థసాధక ప్రాజెక్టులను ఈ దేశానికి తెచ్చిన ఘనత మనకు ఉన్నది. ఈ రోజు నవ్యాంధ్రప్రదేశ్

నిర్మాణంతోపాటు ఈ ఉద్యోగాల సంఖ్యను మూడింతలు పెంచవలసిన అవసరం ఉన్నది. 4 లక్షల ప్రభుత్వ కార్యాలయాలలో కొరతను తీర్చవలసినటువంటి అవసరం ఎంతైనా ఉన్నది. దుర్భిక్ష ప్రాంతాలలో ఉద్యోగం లేక బాధపడుతున్న నిరుద్యోగ సమస్యను కూడా పరిష్కరించాలని చెపుతూ, చిట్టచివరగా నేను ప్రత్యేకంగా కోస్తా జిల్లా పెద్దలందరినీ కూడా కోరుతున్నాను. ప్రథమ ప్రయారిటీ రాయలసీమ జిల్లా, ప్రకాశం జిల్లా పెండిగ్ ప్రాజెక్టులకు ఇవ్వండి. దాదాపుగా అన్నీ 30శాతం కొరతతో అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టులే ఎక్కువగా ఉన్నాయి. మీరు కాంట్రాక్టర్ల మీద ఆరోపణలు చేస్తే చేసుకోండి. ఏ కాంట్రాక్టరు ఇచ్చిన పనిని సరిగా చేయలేదో ఒక పర్యవేక్షణ, దర్యాప్తును కూడా జరుపుకోండి. ఎవరికీ ఏమి అభ్యంతరం లేదు. కానీ ప్రథమ ప్రయారిటీగా కేంద్రప్రభుత్వాన్ని రిక్వెస్ట్ చేస్తాము. ఈ దుర్భిక్షం ఉన్న ప్రత్యేకమైన పరిస్థితులలో రేపు త్రాగునీటి కోసం మనము ముందస్తుగానే కేంద్రం ద్వారా నిధులు తీసుకురావాలి. ఇంతవరకు కూడా మీ ప్రతిపాదనలన్నీ శీతాకాలంలో దాహార్తిని ఎదుర్కోడానికి వచ్చిన నివేదికలు తప్పితే రేపు ఏప్రిల్ నుంచి ఎదుర్కోబోతున్న దుర్భిక్షమైన ఈ యొక్క వేసవికాల తాకిడిని, వేసవిలో గొంతు ఎండుకుపోయే పరిస్థితిని మనము ఇంతవరకు అంచనా వేయలేము. మరి ఈ పరిస్థితిని అర్థం చేసుకొని దాదాపుగా ఈ నాలుగు జిల్లాల ప్రయారిటీ బేసిస్‌గా ఉన్న ప్రాజెక్టులు అనంతపురము మెట్టమొదటి ప్రయారిటీగా ఈ ప్రాజెక్టులను పూర్తి చేయండి. చిత్తూరు జిల్లా కుప్పం వైపు, శ్రీకాళహ స్తి వైపు పచ్చగా కనిపించే పంటలు తప్పితే మా దగ్గర ఏమీ లేవు. మా దగ్గర ఏడుపులు, వ్యసనాలు, నిరంతరం ఒకరిని చూసి ఒకరు ఈర్ష్య పడుతూ ఉంటున్నారు. ఇటువంటి నేపథ్యంలో అనంతపురమునకు అతి చేరువలో అత్యంతమైన దుర్మార్గమైన దుర్భిక్షమైన 1500 అడుగులు వేస్తూ అక్కడ కూడా ఫ్లోరైడ్ వాటర్‌ను చూస్తూ, కార్బేడ్ వాటర్‌ను చూస్తూ క్యాన్సర్ వ్యాధులకు గురవుతున్నారు. చిట్టచివరగా నేను ఒక మాట చెప్పి సెలవు తీసుకుంటాను.

ప్రకాశం జిల్లాలో 519 గ్రామాలలో ఫ్లోరైడ్ చాలా ఎక్కువగా ఉన్నది. తక్షణం మన కళ్లముందర చాలా సమస్యలు ఉన్నాయి. Authorized గా కండలేరు ప్రాజెక్టుల నుంచి డెడ్ స్టోరైజ్ నుంచి ఒక 2 టిఎమ్‌సిలు వాడుకొనండి. రూ.6500 కోట్లు మంజూరైన పైపులైన్లతో పట్టణ ప్రాంతాలకు గ్రామీణ ప్రాంతాలకు, చిత్తురూ జిల్లాలకు మంజూరైన ప్రాజెక్టు ఇది. Finance concurance తో ఏర్పడిన ప్రాజెక్టు. గత సమావేశాలలో కూడా నేను నీటిపారుదల శాఖ మంత్రిగారిని అడిగాను. గుత్తేదారుల మధ్య ఒప్పందం కుదిరిన సంవత్సరంలోపల ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. గుత్తేదారుల మధ్య ఒప్పందం కుదరకపోతే ఆ ప్రాజెక్టులను కొల్లగొడదామా? లేకపోతే అప్పుడున్న ప్రభుత్వం కండలేరు ఇచ్చింది కాబట్టి మాకు వద్దు అని చెప్పి నిర్ణయించుకుందామా? తేల్చండి? మా గొంతు ఎండిపోతున్నది. చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంత వాసులు శవాలుగా మారేటటువంటి పరిస్థితి అక్కడున్నది. అ పరిస్థితిని మీ గమనంలోకి తీసుకోండి. మంజూరైన ప్రాజెక్టును, నిధులు సమకూర్చిన ప్రాజెక్టును, కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే ప్రాజెక్టును ఎందుకు నిలిపేస్తారు. కండలేరుకు న్యాయం చేయండి. మా కన్నీళ్లను తుడవండి అని చెప్పి నేను ఈ రాష్ట్ర ప్రభుత్వానికి తమ ద్వారా విన్నవిస్తున్నాను. రాష్ట్రప్రభుత్వం కూడా నవ్యాంధ్ర నిర్మాణంలో ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే తప్ప, శాశ్వత పరిష్కారంగా మనము ఈ కరువును ఎదుర్కోలేమని మన ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు గారు చెప్పారు. ఈ కరువును శాశ్వతంగా తుడిచివేద్దాము, శాశ్వతంగా తుడిచివేయడానికి ఇచ్చిన గైడ్‌లైన్స్ ఇవి. ఏమైనా నిర్మాణాత్మకమైన సూచనలు ఉంటే తీసుకోండి. విమర్శలను సద్విమర్శలుగానే తీసుకోండి అని నేను తెలియజేస్తూ ఈ రాయలసీమలో దుర్భిక్షమైన వాతావరణాన్ని అతి త్వరలో పోగొట్టడానికి ప్రయత్నం చేద్దామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

డా. బచల పుల్లయ్యః అధ్యక్షా, ముందుగా కరువు పరిస్థితి మీద మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కరువు పరిస్థితి గురించి నేను ఒక పుస్తకాన్ని సమర్పించడమైనది. అందులో ఉన్నటువంటి పట్టికలో నేను ప్రాతినిధ్యం వహించినటువంటి మూడు జిల్లాలు ఉన్నాయి. అవి కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు. ఈ మూడు జిల్లాలను అందులో పొందుపరచడం జరిగింది. ఒక విధంగా నేను ప్రాతినిధ్యం వహించినటువంటి మూడు జిల్లాలు కూడా ఉన్నాయిలే అని సంతోషపడాలా? లేకపోతే నేను ప్రాతినిధ్యం వహించిన జిల్లాలలో ఇంత కరువు ఉందా అని బాధపడాలా? అనేటువంటి ఒక పరిస్థితి గోచరిస్తున్నది. ఏ రాష్ట్రంలో అయినా కూడా లేదా ఏ దేశంలో అయినా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే అనేక రంగాలతోబాటు వ్యవసాయ రంగం కూడా పూర్తిగా అభివృద్ధి చెందినట్లయితే ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. మరి ఆర్థిక వ్యవస్థ లేదా వ్యవసాయ రంగాన్ని గమనించినట్లయితే మన రాష్ట్రములో ఉన్నటువంటి అనేక గ్రామాలలో ఉన్నటువంటి రైతాంగమంతా, ప్రజలంతా కూడా దాదాపుగా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు అని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. మరి ఇటువంటి పరిస్థితులలో ఈ రోజు మనం ఒకసారి గమనించినట్లయితే వ్యవసాయం అనేటువంటిది ఒక జూదం లాగా తయారైనది. పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదో చెప్పలేము. పెట్టిన పెట్టుబడి అసలు వస్తుందా, వడ్డీ వస్తుందా అని వ్యవసాయదారుడు చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం మీరు గమనించినట్లయితే నీటి సమస్య పెద్దమొత్తంలో ఉన్నది. ఎక్కడైనా నీళ్లు బాగా ఉన్నట్లయితే వ్యవసాయం బాగుంటుంది. రైతులు బాగుంటారు. రైతులు బాగుంటే మనకు కడుపునిండా అన్నం దొరుకుతుంది అన్నది సత్యం. ఈ మధ్య కాలంలో దాదాపుగా ఒక 10, 15 రోజుల పాటు కృష్ణా, గుంటూరు అదే విధంగా తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఎన్నికల ప్రచార నిమిత్తం మేము అక్కడకు వెళ్లడం జరిగింది. మేము ఆ దారిన పోతూ ఉంటే మాకు చాలా సంతోషం, ఆనందం వేసింది. కనుచూపుమేరలో పచ్చనిపొలాలు, కొబ్బరి చెట్లు ఉన్నాయి. రోడ్ల పక్కన పంట కాలువలు పోతూ ఉన్నాయి. కాలువలో కూడా నీళ్లు చాలా బాగా ఉన్నాయి. మరి ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో గమనించినట్లయితే కడప, కర్నూలు, అనంతపురం గానీ ఇంకా కరువు మండలాలను ఎక్కడైతే ప్రకటించారో ఆ ప్రాంతాలను గమనించినట్లయితే మనకు కనిపించేటువంటివి రాళ్లు, రప్పలు, దయనీయ పరిస్థితి మనకు కనపడుతుంది. నిన్న కాక మొన్న శనివారము, ఆదివారము నేను అనంతపురం జిల్లాలో ధర్మవరం, బత్తలపల్లి ప్రాంతాలలో పర్యటించినప్పుడు అక్కడ ఉన్నటువంటి పరిస్థితి గమనించినట్లయితే ఈ ప్రాంతంలో ఏమి పండుతుంది. ఏమి పండటానికి అవకాశం ఉంది ఇక్కడ. వాటర్ సోర్స్ ఎంత ఉంది మొదలైనవన్నీ విచారించినట్లయితే అక్కడ ప్రజలు చెప్పినటువంటి విధానం కానీ, లేదా ప్రజలు పడుతున్న బాధలను మనము గమనించినట్లయితే చాలా వర్ణనాతీతంగా ఉన్నాయి.

మ. **1.20**

వీటన్నింటికి గల ముఖ్య కారణాలను మనం గమనించినట్లయితే, సాగునీరు, త్రాగునీరు అవసరాలు ప్రధానంగా ఉన్నాయి. ఈ మధ్యకాలంలో పట్టిసీమ ప్రాజెక్టు విషయమై పెద్దలు హోం మినిస్టర్ గారు, ముఖ్యమంత్రిగారి ప్రసంగాలలో కనిపించింది. పట్టిసీమకు సంబంధించి దాదాపుగా రూ.1300కోట్లు ఖర్చు అవుతాయని, దీనివల్ల మొట్టమొదట లాభపడేది ఎక్కువగా రాయలసీమ ప్రాంత వాసులే అని అక్కడ చెప్పడం జరిగింది. దీనికి మేము స్వాగతిస్తూ, ఆనందపడుతున్నాం. రాయలసీమలో ఈనాడు హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫ్యాక్షన్ అభివృద్ధి చెందుతోంది

అంటే, ముఖ్యకారణం అక్కడ త్రాగునీరు, సాగునీరు లేకపోవడం మరియు వ్యవసాయదారులకు పనులు లేకపోవడం కూడా మరొక కారణం అని ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను.

ఇటువంటి పరిస్థితులలో రాజకీయాలను ప్రక్కకు పెట్టి, పట్టిసీమ ప్రాజెక్టు సిద్ధమైనట్లయితే, ఈ ప్రాంతంలో ఉన్నవారు ఇబ్బందులు పడతారనే అభిప్రాయాన్ని కొంతమంది గౌరవ సభ్యులు వెలిబుచ్చారు. ఒకవేళ అటువంటి సమస్యలు ఉన్నట్లయితే, అక్కడ ఉన్న రైతాంగంతో గాని, ప్రజలతో కలిసి మాట్లాడి, వారికున్న సమస్యలు పరిష్కరించాలి. తప్పనిసరిగా పట్టిసీమ ప్రాజెక్టును సంవత్సరం లోపల పూర్తిచేస్తామని పెద్దలు చెప్పడం జరిగింది. అది త్వరగా పూర్తి కావాలని మేము కోరుకుంటున్నాము.

కడప జిల్లా ప్రొద్దుటూరులో మేము ఉంటాము కాబట్టి, గతంలో అక్కడ ఒక స్కీమును మంజూరు చేసి ఉన్నారు. దానివలన కుందూ, పెన్నాలో వరద కాలువలకు సంబంధించి గతంలో సుమారు రూ.78కోట్లు మంజూరు చేయడం జరిగింది. గతంలో ఇదే సభలో మేము ప్రశ్న వేయడం జరిగింది. గతంలో మంజూరు చేసిన కుందూ, పెన్నా వరద కాలువకు సంబంధించి అంత పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసినా, అందులో సుమారు రూ.27కోట్లు ఖర్చుపెట్టడం జరిగింది. అయితే, కొన్ని రాజకీయ కారణాల వలన ఆ ప్రాజెక్టు ప్రక్కన పడిపోయింది. మొన్ననే మా ప్రాంతంలో ఇరిగేషన్ మంత్రిగారు, కడప, ప్రొద్దుటూరు, ప్రక్కన ఉన్న కాలువ దగ్గరకు కూడా వస్తే, మేము కూడా ఆయనతో వెళ్ళాము. ఆయన అక్కడ ప్రవర్తించిన తీరు చాలా ముచ్చటేసింది. అసలు సమస్యలు ఎక్కడ ఉన్నాయని ఆయన రైతుల ఇళ్ళదగ్గరకు కూడా వెళ్ళి సమస్యలను కనుక్కోవడం జరిగింది. వారికి ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలు వచ్చే దిశగా ఆయన ప్రవర్తించిన తీరుకు మాకు చాలా సంతోషం కలిగింది. అక్కడ ప్రాజెక్టు వచ్చినట్లయితే, అక్కడున్న మూడు ప్రాంతాలకు త్రాగునీరు, సాగునీరు దొరుకుతుంది. సుమారు 30,000 ఎకరాలకు నీరు దొరుకుతుందనే అంశాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

ఈనాడు నీటికొరత మొదలైన సమస్యలను తెలుసుకోవడంలో ప్రభుత్వ యొక్క పాత్ర చాలా కీలకమైనదని తమ ద్వారా గౌరవ సభ్యుల దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ విధంగా ప్రభుత్వం రైతులతో మమేకమై, వారి సమస్యలన్నింటిని క్షేత్రస్థాయిలో పరిష్కరించే ప్రయత్నం చేయాలని కోరుతున్నాను. ప్రభుత్వానికి రాయలసీమ ప్రాంతంపైన కొంత నిరాదరణ ఎక్కువగా ఉందనేది ప్రజల యొక్క అభిప్రాయమని తమ ద్వారా సభ దృష్టికి తీసుకువస్తున్నాను. ఒకవేళ ఇది ప్రస్తుత అంశానికి సంబంధించిన అంశం కాకపోయినా, అన్ని ప్రాంతాలలోని సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వ ఆర్డరు ఉన్నా, జీవోలు ఉన్నా, ఒక్క కర్నూలు జిల్లాలో మాత్రం ఏవీ అమలుకావడం లేదనే అంశాన్ని తమ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. ఎందుకంటే, ఆ ప్రాంతం ఎక్కువగా నిరాదరణకు గురవుతున్నది. అధ్యక్షా, నేను చెప్పే అంశం కరువుకు సంబంధించి కాకపోవచ్చు కానీ, ఆ ప్రాంతం నిరాదరణకు గురవుతోందని మరొకసారి తమ ద్వారా తెలియజేస్తున్నాను. కర్నూలు జిల్లాలోని ఒక జూనియర్ కళాశాలలో పనిచేసే లెక్చరర్లకు ఒక జీవో ఇష్యూ చేశారు. ఎవరైతే ఉపాధ్యాయులుగా ఉండి, ప్రమోషన్ వచ్చి జెఎల్‌సిగా వచ్చారో, వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం అన్ని జిల్లాలో అమలుజరిగినా, కర్నూలులో మాత్రం అమలు కాలేదు. ఒక అధికారి దగ్గర దాదాపు 5, 6 నెలలపాటు ఆ ఫైలు అక్కడే ఉంది కానీ, అమలుకాలేదు. కాబట్టి, మీ ద్వారా కోరేది ఏమిటంటే, అన్ని ప్రాంతాలను సమానంగా చూస్తున్నారు కానీ, ఈ ప్రాంతంలో కూడా అవన్నీ అమలయ్యేలా చూడాలని కోరుతున్నాను.

కరవు పరిస్థితుల గురించి చాలామంది సభ్యులు మాట్లాడడం జరిగింది. ముఖ్యంగా మనం త్రాగునీటికి, సాగునీటికి అధిక ప్రాధాన్యాన్ని ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందులో భాగంగానే పట్టిసీమ ప్రాజెక్టును కూడా త్వరలో పూర్తిచేసి, రాయలసీమ ప్రజల యొక్క ఆశలను నెరవేర్చాలని తమద్వారా కోరుకుంటూ, నాకు ఇచ్చిన ఈ అవకాశానికి మీకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, రాష్ట్రంలో కరువు పరిస్థితులపై లఘు చర్చలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేయడమే కాక, కరాళనృత్యం చేస్తోంది. అంటే, అక్కడి పరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నాయో నా ముందు మాట్లాడిన సభ్యులు చెప్పారు. చర్విత చర్వణంగా కాకుండా, వీలైనంత సంక్షిప్తంగా చెప్పడానికి నేను ప్రయత్నం చేస్తాను.

అధ్యక్షా, వీటన్నింటికి కారణాలు వర్షాభావ పరిస్థితులే. 2014-15 సంవత్సరానికి సంబంధించి ఈ రాష్ట్రంలో వర్షపాతం ఏవిధంగా ఉందో చూసినట్లయితే, జూన్ – సెప్టెంబరు మాసాలవరకు గల నైఋతి ఋతుపవనాల ద్వారా వచ్చే వర్షం చాలా తక్కువగా ఉందనేది మనందరికీ తెలుసు. ఆ సమయంలో సుమారు 554 మి.మీ. వర్షపాతం పడవలసి ఉంటే, సుమారు 375.6 మి.మీ. మాత్రమే పడింది. అంటే, సుమారు 32 శాతం మాత్రమే వర్షపాతం నమోదయింది. అంతకు ముందు సంవత్సరంలో సుమారు 514మి.మీ. వర్షపాతం నమోదైంది. అది -7శాతంగా నమోదైంది. అంటే, ఈ వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రం కరువుకాటకాలతో రైతాంగానికి తీరని వేదనను, ఆవేదనను కలిగించడానికి దోహదం చేసిందని ఈ సందర్భంగా చెప్పకతప్పదు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటు రాయలసీమ గానీ, కోస్తా ప్రాంతాలు గానీ చూసినట్లయితే, రెండు విభిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. రాయలసీమలో ఖచ్చితంగా ప్రతి నాలుగు, ఐదు సంవత్సరములకు ఈ కరువుకాటకాల వలన ఆ ప్రాంతవాసులు వలసలకు, ఆత్మహత్యలకు దారితీసే పరిణామక్రమం చూసినట్లయితే, మనసు విచలితమవుతోంది. అనేక సందర్భాలలో హృదయ విదారకమైన సంఘటనలు చూశాము.

కోస్తా ప్రాంతాలలో సుమారుగా ప్రతిసంవత్సరం వరదలు, తుఫానుల వల్ల ఆ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈరోజు కరువు గురించి మాట్లాడుకోవలసి వచ్చినప్పుడు మన రాష్ట్రంలోనే కరువు ప్రాంతాలు ఉన్నాయి. ఆనాడు రాయలసీమను రతనాల సీమ అని వేనోళ్ళ పొగిడిన మనం ఈనాడు రాయలసీమ రాళ్ళసీమ అనేటటువంటి పరిస్థితులలో అక్కడ కరువు తాండవిస్తోందనేది మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ రాష్ట్రప్రభుత్వం సుమారుగా 238 మండలాలను కరువు మండలాలుగా గుర్తించింది. అందులో 7 జిల్లాలలో కరువు ఎక్కువగా ఉందని, అందులో 4 జిల్లాలు రాయలసీమలో ఉన్నాయి. అవి అనంతపురంలో మొత్తం 65 మండలాలు ఉంటే 63 మండలాలు కరువుతో ఉన్నాయి. కడప జిల్లాలో కూడా సుమారు 50 మండలాలు ఉంటే, అందులో 48 మండలాలు కరువుకాటకాలతో ఉన్నాయి.

కోస్తాలో ఉన్న ప్రకాశం జిల్లాలో కూడా సుమారు 54 మండలాలు కరువుకాటకాలతో ఉన్నాయి. చిత్తూరులో కూడా సుమారు 42 మండలాలలో కరువు ఉంది. ఈ విధంగా ఆ ప్రాంతాలన్నీ కరువు వల్ల అతలాకుతలమయ్యాయి. తినడానికి తిండిలేక, చేసుకోవడానికి పనులు లేక రైతాంగం విలవిలలాడుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో రైతాంగం పైన ప్రభుత్వం ఖచ్చితంగా దృష్టిమాపుతుందనే విశ్వాసంతో ఉన్నాము. ఎప్పుడైతే కరువు మండలాలను గుర్తించి,

జిల్లాల నుంచి కలెక్టర్ల ద్వారా వచ్చిన సమాచారాన్ని సేకరించి, దానిని కేంద్రప్రభుత్వానికి పంపించింది. ఈ కరువు నిమిత్తం సుమారు రూ.1532కోట్లు ఆర్థిక సహాయం చేయాలని ఈ ప్రభుత్వం కేంద్రప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చింది. కేంద్రం ద్వారా వచ్చే నిధులకోసం వేచి చూసే ఆవశ్యకత లేకుండా, రాష్ట్రప్రభుత్వం అనేకమైన తాత్కాలిక చర్యలను చేపట్టడం జరిగింది. ఈ విషయంలో మనందరం ఈ రాష్ట్రప్రభుత్వాన్ని అభినందించాలని ఈసందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను.

కరువు వచ్చినప్పుడు ఆహారధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదకతల మీద అధిక ప్రభావం చూపిస్తుందని మనందరికీ తెలుసు. 2014-15వ సంవత్సరంలో మన రాష్ట్రప్రభుత్వ అంచనాలు తారుమారయ్యాయి. సుమారు ఒక కోటి, 11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను ఉత్పత్తిచేస్తామన్న మనం అందులో సుమారు 4.7శాతం తగ్గుదలను కూడా మనం చూశాము. అంటే, ఈ కరువుకాటకాల వల్ల ఈ ఉత్పాదకత పడిపోయిందనే దృష్టాంతాన్ని నేను తమ దృష్టికి తీసుకు వస్తున్నాను. ఈ ప్రభావం ఆ ప్రాంతాలలో ఉన్న రైతు కూలీల మీద అపారంగా ఉంటుంది. ముఖ్యంగా రాయలసీమ వాసిగా మీఅందరికీ తెలుసు. నేను కూడా ఆ ప్రాంత స్నేహితులతోను, శ్రేయోభిలాషులతో మాట్లాడినప్పుడు వారు వ్యక్తం చేసిన అంశాలు, వారు పడుతున్న ఆవేదన చూసినప్పుడు అక్కడి రైతు కూలీల పరిస్థితి చూస్తే, మరింత హృదయవిదారకంగా ఉంది.

మ.**01.30**

మనకి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉంది. ఆ పథకం క్రింద 100 రోజుల పనిదినాలు వారికి కల్పించే సౌలభ్యం ఉంది. కానీ, అది వారికి సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆ 100 రోజుల పనిదినాలను 150 రోజులకు పెంచేందుకు గాను, ముఖ్యంగా ఈ వేసవిలో దాన్ని మరింతగా పెంచడానికి కూడా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందనే విషయం మనకందరికీ తెలుసు. ఇటువంటి పరిస్థితుల్లో వారికి ఉపాధి కల్పించవలసినటువంటి ఆవశ్యకత ఉన్న తరుణంలో, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కూడా అభ్యర్థించడం జరిగింది. కనీసం రూ.552 కోట్లు ఇచ్చినట్లయితే, సుమారుగా 3,50,000 మంది రైతు కూలీలకు ముఖ్యంగా రాయలసీమలో కరువు తాండవిచ్చే చోట్ల వారందరికీ కూడా ఊరట కలుగుతుందని కోరడం జరిగింది. లేకపోతే, వారందరూ కూడా పక్క రాష్ట్రాల్లోని బెంగుళూరు, చెన్నైలకు గానీ, లేదా మరో ప్రాంతానికి గానీ వలస వెళ్లే దుస్థితి వస్తుంది.

ఇక ముఖ్యంగా చూసినట్లయితే, గ్రామీణ ప్రాంతంలో ఉన్నటువంటి వారికి, ఈ కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, అక్కడ కూడా నీటి సరఫరా విషయంలో అన్ని చర్యలూ తీసుకోవడం జరుగుతుంది. ఈ మధ్య మేము ముఖ్యమంత్రి గారిని కలిసినప్పుడు కూడా ఆయన ఖచ్చితంగా చెప్పారు. ఈ ప్రాంతాల్లో ఎక్కడైతే నీటి సరఫరాకు ఇబ్బంది ఉందో, ఖచ్చితంగా సంబంధిత అధికారుల ద్వారా మీరు గానీ, సంబంధిత ప్రజా ప్రతినిధుల ద్వారా ఆ జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువచ్చినట్లయితే, ఎక్కడా త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తాము. దానికి ఖచ్చితమైన ప్రణాళికలు కూడా మేం సిద్ధం చేశాము, దాహార్తితో ఎవ్వరూ కూడా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దానికి ప్రాధాన్యతనిస్తామని చెప్పి, చేయడం కూడా జరిగింది. ఓకె. ఇది తాత్కాలికంగా మనం చేసినప్పటికీ కూడా బోర్‌వెల్స్‌ని చార్జ్ చేయడానికి, ప్రైవేటు బోర్‌వెల్స్‌ని కూడా అద్దెకు తీసుకుని, ఈ సమయంలో నీటి సరఫరా చేయాలనే ఆలోచనతో గానీ, హ్యాండ్‌పంప్స్ విషయంలో

గానీ, బోర్‌వెల్స్ వేసే విషయంలో గానీ, ఈ విధంగా ఇటు గ్రామీణ ప్రాంతానికి సుమారుగా రూ.125 కోట్లు కేటాయించడం, అదే విధంగా పట్టణ ప్రాంతాలకు కూడా రూ.110 కోట్లు కేటాయించడమనేది చూస్తే, ఈ కరువు పరిస్థితి వల్ల ఇబ్బందిపడుతున్నటు వంటి ప్రజానీకానికి ఊరట కలిగించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగమని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

మరీ ముఖ్యంగా చూసినట్లయితే, ఈ కరువు కాటకాలు మానవులకే కాదు, పశువులకు కూడా చాలా ఇబ్బందికరమైన పరిస్థితిని కల్పిస్తున్నవి. మనిషికే త్రాగడానికి నీరు లేదని మనం బాధపడుతుంటే, పశువుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చూడండి. ఈనాడు ఎక్కడైతే కరువుందో, ఆ ప్రాంతాల్లో ఉన్నటువంటి పశుసంవర్ధక శాఖ ఆ పశువులకు సంబంధించి ఒక సెంట్రలైజ్డ్ ప్లేస్‌లో, వాటికి కావాల్సినటువంటి దాణా ఇవ్వడంలోను, త్రాగు నీటి సౌకర్యం కల్పించడంలోను ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టినట్లుగా మాకిచ్చిన లిస్టులో ఉంది. లేకపోతే, ఇప్పటికే దాహార్తితో ఉన్నటువంటి ఆ ప్రాంతంలోని పశుగణమంతా కూడా కబేళాలకు తరలివెళ్లాల్సిన దుస్థితి ఉందని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలని మనవి చేస్తున్నాను. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం దీనికి దీర్ఘకాలికమైన ప్రణాళికలు చేపట్టాలి. దాని కోసమే, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయిన రోజున రాయలసీమే కాదు, పక్కనున్నటువంటి ప్రాంతాలైన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతోబాటుగా, ఇటు కృష్ణా జిల్లా నుండి అటు విశాఖపట్నం జిల్లా వరకు కూడా ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండాలంటే, పోలవరం ప్రాజెక్టు నిర్మాణమొక్కటే దానికి పరిష్కారం అనేది నా అభిప్రాయం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే చట్టంలో అవకాశం కల్పించింది. ఖచ్చితంగా దాన్ని 2018 నాటికి పూర్తి చేస్తామని వాగ్దానం కూడా చేసింది. కానీ, దానికి కొంత సమయం పడుతుందన్న ఉద్దేశంతోనే, ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం నీటి పారుదల రంగానికి అధిక ప్రాముఖ్యతనిస్తూ, ప్రాధాన్య క్రమంలో ఏ ప్రాజెక్టులు ముందు చేపట్టాలన్న విషయంలో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఒక ప్రాధన్య క్రమాన్ని కూడా పెట్టారు. పట్టిసీమ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ, తోటపల్లి ఇలా ఏదైనా కావొచ్చు. ఇది వరలో అనేకమైన ప్రాజెక్టులు చేపట్టాలని సుమారుగా 86 ప్రాజెక్టులు, రూ.1,80,000 కోట్లతో చేపట్టాలని అన్ని ప్రాజెక్టులూ ఒకేసారి ప్రారంభించడంతో ఎక్కడికక్కడ ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలిపోయిన పరిస్థితులను మనం చూశాము. ఇటువంటి పరిస్థితుల్లో ప్రాధాన్య క్రమంలో ఈ రోజు పట్టిసీమని తక్షణ కర్తవ్యంగా ఒక సంవత్సరంలోనే పూర్తి చేయడం ద్వారా రాయలసీమ వాసులందరికీ కూడా దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి గారు ఈ చర్య చేపట్టారు. కానీ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్నటువంటి రైతాంగానికి గానీ, నాయకులకు గానీ కొన్ని అపోహలు కూడా ఈ మధ్య ఉన్నట్టుగా చూశాము. కానీ, అవి అపోహలు మాత్రమే. అతి ముఖ్యంగా జూన్, సెప్టెంబరు నెలలో వచ్చే వరద నీటిని లిఫ్ట్ చేసి తీసుకోవడం ద్వారా, 80 టిఎంసిల నీటిని గోదావరి నుండి కృష్ణాకు తీసుకువెళ్లడం ముఖ్య ఉద్దేశం. శ్రీశైలం నుండి అటు గాలేరు-నగరికి గానీ, హంద్రీనీవా గానీ అసంపూర్తిగా ఉన్న ఆ ప్రాజెక్టుల్ని కూడా ఈ మధ్య కాలంలోనే పూర్తి చేసి, అక్కడ నుండి శ్రీశైలం నుండి అటు చిత్తూరు, అనంతపురం, కడప వంటి కరువు కాటకాలతో ఉన్నటువంటి ఈ జిల్లాలకు దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో ఒక మంచి లక్ష్యంతో చేసిన ప్రయత్నానికి మీరందరూ మద్దతు పలకాలని మనవి చేస్తున్నాను. అధ్యక్షా, నాకు తెలిసి గాలేరు-నగరి, హంద్రీనీవా అనే ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతవాసులకు ఆయువుపట్టు. ఈ మధ్యకాలంలో మీరు కూడా ఒక సందర్భంలో చెప్పడం జరిగింది.

అదేవిధంగా అనంతపురం జిల్లాకు సంబంధించి కూడా 16.7 టిఎంసిల నీటిని ఆ ప్రాంత వాసులకు ఇవ్వడం ద్వారా 23,000 బోర్లు చార్జ్ అయినట్లుగా గణాంకాలు చూపిస్తున్నాయి. అదేవిధంగా, పులివెందుల ప్రాంతానికి ఈ మధ్యనే 2 టిఎంసిల నీటిని ఇవ్వడం ద్వారా మీ ప్రాంతంలో ఉన్నటువంటి హార్టీకల్చర్ క్రింద ఉన్న చీనీ చెట్లు, అరటి, నిమ్మ వంటి చెట్లన్నీ మరలా జీవం పుంజుకునే పరిస్థితి వచ్చిందని తెలిసింది. This Government is not leaving any stone unturned. It is taking all the steps to mitigate these problems and issues. అధ్యక్షా, నాకు ఒక ప్రగాఢమైన విశ్వాసం ఉంది. ఈ పట్టిసీమ ప్రాజెక్టుని ఖచ్చితంగా సంవత్సరంలోపు పూర్తి చేసి, ఆ ప్రాంత వాసులందరి మోములో ఆనందం చూడాలన్న లక్ష్యంతో ఈనాడు రాష్ట్ర ప్రభుత్వ అధినేతైనటువంటి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కంకణం కట్టుకున్నారని, ఖచ్చితంగా దాన్ని పూర్తి చేస్తారనే ప్రగాఢ విశ్వాసం నాకుంది. భవిష్యత్తులో ఈ కరువు కాటకాలు లేకుండా, యావత్ 13 జిల్లాల్ని కూడా సస్యశ్యామలం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుంటుందని, దానికి అన్ని చర్యలు చేపడుతున్నారని, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలియజేస్తున్నాను. ఖచ్చితంగా, ఒక ఆశావహ దృక్పథంతో, I am hoping in the coming future, ఈ ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి చేయడం ద్వారా, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతుందని విశ్వసిస్తూ నేను శెలవు తీసుకుంటున్నాను.

MR.DEPUTY CHAIRMAN: Now, the Minister will reply. దానికంటే ముందు, మంత్రి గారికి నేను ఒక్క విషయం చెప్పదల్చుకున్నాను. ఇటీవల కాలంలో నేను కూడా చాలా పర్యటనలు చేస్తూ, చాలా గ్రామాలు తిరిగాను. అక్కడ 1000, 1500 అడుగులు లోతుకు బోర్లు వేసినా నీళ్లు పడే అవకాశం ఉండటం లేదు. తరువాత, కొత్త బోర్లు వేసుకోవడానికి బ్యాన్ కూడా ఉన్నట్లుంది. చాలా సీపీడబ్ల్యూఎస్ స్కీములు, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీములు సిబ్బంది నిర్లక్ష్యం వల్ల సరిగ్గా పని చేయడం లేదు. వాటి ఫంక్షనింగ్‌కు సంబంధించి, చిన్న చిన్న రిపేర్లన్నీ చేస్తే, వీలైనంత వరకు త్రాగునీరు గ్రామాలకు చేరేందుకు అవకాశం ఉంది. ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న ఏ చర్యల ప్రకారమైనా, స్థానిక చెరువుల్లో త్రాగేందుకు సరిపడినంత నీరు లభ్యంగా ఉండాలి. కానీ, ఆర్‌డబ్ల్యూఎస్‌లో shortage of staff as well as negligence is there. దాన్ని కొంచెం అరికట్టేందుకు ప్రయత్నం చేస్తే, చాలా వరకు సీపీడబ్ల్యూఎస్ స్కీములు, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీముల ద్వారా త్రాగునీటి సమస్యలకు చాలా వరకు పరిష్కారం లభించేందుకు అవకాశముంది. దాని మీద కూడా కొంచెం చర్యలు తీసుకోవాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాను.

శ్రీ ఎన్.చినరాజప్ప: అధ్యక్షా, ఈ రోజు కరువు మీద చర్చ జరిగింది. ఈ చర్చలో గౌరవ ప్రతిపక్ష నాయకులు శ్రీ సి.రామచంద్రయ్య గారు, శ్రీ ఆదిరెడ్డి అప్పారావు గారు, శ్రీమతి పి.శమంతకమణి గారు, శ్రీ వై. శ్రీనివాసులు రెడ్డి గారు, డా. బచల పుల్లయ్య గారు, శ్రీ రుద్రరాజు పద్మరాజు గార్లు పాల్గొని ప్రభుత్వానికి మంచి సూచనలివ్వడం జరిగింది. ఈ రోజు కరువు పరిస్థితి మనకందరికీ తెలుసు. ప్రతి సంవత్సరం ఈ కరువు రావడం జరుగుతోంది. దాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగింది. అలాగే, 2014 లో కూడా –32 శాతం లోటు వర్షపాతంతో రెండు పంటల దిగుబడిలో తీవ్ర తగ్గుదల ఉండటం దృష్టిలో ఉంచుకుని, ఈ రోజు ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా రిపోర్టు తెప్పించుకుని, 7 జిల్లాల్లో 238 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగింది. వివిధ శాఖల నుండి నివేదిక తెప్పించుకుని, రూ.1532 కోట్లు ఆర్థిక సాయం అందించవలసిందిగా మెమోరాండం తయారు చేసి భారత ప్రభుత్వానికి పంపడం జరిగింది. అదేవిధంగా, వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి సారధ్యంలో అంతర్గత

మంత్రులతో కూడినటువంటి టీముని భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ టీము అతి త్వరలో ఈ ప్రాంతంలో సందర్శించి, నష్టాన్ని అంచనా వేసి భారత ప్రభుత్వం అందించు ఆర్థిక సహాయాన్ని నిర్ణయించడం జరుగుతుంది.

మ.1.40

రాష్ట్ర ప్రభుత్వం కరువును సమర్థవంతంగా ఎదుర్కొవడానికి కేంద్ర సహాయం కొరకు ఎదురుచూడకుండా, కరువును నివారించటానికి ఇప్పటికే అనేక చర్యలను ప్రారంభించింది. గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం కోసం 2014-15 వ సంవత్సరంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ క్రింద రూ.123.54 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.123.54కోట్లతో 2015 తాత్కాలిక ప్రణాళికను తయారు చేసింది. తాత్కాలిక చర్యల క్రింద నీటి రవాణా , ప్రభుత్వేతర వనరులను అద్దెకు తీసుకోవడం, బోర్ బావులు/బహిరంగ బావుల శుభ్రం చేయడం/లోతు చేయడం, వేసవి నిల్వ చెరువులను నింపడం కొరకు ఈ నిధులను ఉపయోగించవచ్చును. అలాగే, 10,196 సమస్యాత్మక జనవాసాలను కూడా గుర్తించడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో రోజువారీ ప్రాతిపదికపైల నీటి కొరత ఉన్న ప్రాంతాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించడమవుతుంది. ఈ రోజుకు 2278 జనవాసాలలో చిత్తూరు, అనంతపురం, కడప, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, కృష్ణా జిల్లాలలో ఇప్పటికి త్రాగు నీరు అందించడం జరుగుతోంది. చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలలో మొత్తం 415 ప్రైవేటు బోరు బావులను త్రాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం అద్దెకు తీసుకోవడం జరిగింది. అలాగే, సాగునీటి శాఖతో తగురీతిగా సమన్వయం చేసుకొని, సాగునీటి కాలువలను మూసివేయకముందే పూర్తి సామర్థ్యంతో వేసవి నిల్వ చెరువులను భర్తీ చేసి సరిపడ నీరు ఉండే విధంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులందరికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

త్రాగునీటి సమస్య ఫిర్యాదులను స్వీకరించుటకు, తక్షణమే పరిష్కరించుటకు జిల్లా స్థాయిలో పర్యవేక్షణ విభాగాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుత వేసవి నెలలలో త్రాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా కొనసాగుతున్న పథకాలను పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ చూపడమవుతుంది.

అలాగే, పట్టణాలకు సంబంధించి పట్టణ నీటి సరఫరా కోసం 2014-15 వ సంవత్సరంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ క్రింద రూ.57.34 కోట్లను విడుదల చేయడం జరిగింది. అన్ని పట్టణ స్థానిక సంస్థలలో త్రాగునీటి సమస్య ఉపశమనం కోసం 2015 వ సంవత్సరానికి రూ.110 కోట్లతో వేసవి కార్యాచరణ ప్రణాళికను తయారు చేయడమైంది. క్షామ పీడిత ప్రాంతాలైన 5 జిల్లాలో కరువుకు గురైనా 36 పట్టణ స్థానిక సంస్థల కోసం నిర్దిష్టంగా కరువు తాత్కాలిక ప్రణాళికను రూ.32.71కోట్లతో తయారు చేయడమైంది. ప్రస్తుతం వివిధ పట్టణ స్థానిక సంస్థలలో రోజుకు రెండుసార్లు నుండి 4 రోజులకు ఒకసారి చొప్పున వివిధ విరామాలలో నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగింది.

త్రాగునీటి రవాణా, ప్రైవేటు వనరులను అద్దెకు తీసుకోవడం / నీటి వనరులను శుభ్రపరచడం / లోతును పెంచడం, చేతి పంపు విద్యుత్తు బోర్ల కోసం విడి భాగాలు కొనుగోలు చేయడం / పైప్ లైన్లకు / బోర్ బావులకు / పంపు సెట్లకు మరమ్మతులు, బోరు బావులను / ఫిల్టర్ పాయింట్లను త్రవ్వడం వంటి అన్ని అత్యవసర తాత్కాలిక ఏర్పాట్లను చేపట్టడం జరుగుతున్నది.

572 సమస్యాత్మక ప్రాంతాలలో రోజుకి 3367 ట్రిప్పులతో త్రాగునీటి సరఫరా కోసం 458 నీటి ట్యాంకర్లను అద్దెకు తీసుకోవడం జరిగింది.

పశు సంవర్ధక శాఖ విషయానికి వస్తే... రాష్ట్ర ప్రభుత్వం పశు గ్రాసం, పశు దాణా కోసం రూ.20కోట్లను పశు సంవర్ధక శాఖకు విడుదల చేసింది. పశువుల శిబిరాలు / పశువుల దాణా మరియు పశువులకు వైద్య రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నుండి రూ.413.76 కోట్ల మొత్తాన్ని సహాయం చేయవలసిందిగా కరువు మెమోరాండమ్‌లో కోరడమయింది. అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో పశుగ్రాసం కొరత ఎక్కువగా ఉంది. 141.86 లక్షల పశుగణ యూనిట్లకు 2015, జూన్ వరకు 127.68 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అవసరం ఉంటుంది. సాగునీటి వనరుల క్రింద వీలైనంత మేరకు వ్యక్తిగత రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తన సరఫరా ద్వారా పశుగ్రాస అభివృద్ధిని చేపట్టడమయింది. అలాగే, అనంతపురం జిల్లాలో 11 ఎండిపోయిన చెరువులను 1582 ఎకరాలను సాగుచేయడం ద్వారా 3164.00 మెట్రిక్ టన్నుల పశుగ్రాస దిగుబడి రాగలదని ఆశిస్తున్నాము. పశు శిబిరాల నిర్వహణ కోసం అన్ని వసతులు కలిగిన ప్రదేశాలను గుర్తించడం జరిగింది. ప్రజలకు మరియు పశువులకు త్రాగునీటిని సరఫరా చేయుట కొరకు గ్రామీణ నీటి సరఫరా శాఖ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నది. దీని కొరకు రూ.19కోట్లు అంచనా వ్యయంగా రూపొందించడం జరిగింది. అలాగే, ఇప్పటి వరకు మెట్రిక్ టన్ను ఒక్కొక్కింటికి రూ.5800ల చొప్పున వ్యయంతో 270.00 మెట్రిక్ టన్నుల ఎండిన పశుగ్రాసాన్ని పంపిణీ చేయడమయింది. ఎండిన పశుగ్రాసం కిలో ఒక్కింటికి రూ.3 ల చొప్పున అనంతపురం, చిత్తూరు జిల్లాలో 60 మెట్రిక్ టన్నుల ఎండిన పశుగ్రాసాన్ని పంపిణీ చేయడం జరిగింది. క్షీర సాగర్ పథకం క్రింద చిత్తూరు జిల్లాలో 10,000 పశువులకు 900 మెట్రిక్ టన్నుల సాంద్రీకరించు దాణాను సరఫరా చేయడమయింది. 'సునంధని ' పథకం క్రింద చిత్తూరు జిల్లాలో 1080 మెట్రిక్ టన్నుల దూడ దాణాను సరఫరా చేయడమయింది. 75 శాతం సబ్సిడీ చొప్పున ఎండిన పశుగ్రాసం పశుదాణాను సరఫరా చేయడానికి విధానపరమైన నిర్ణయాన్ని కూడా తీసుకోవడం జరిగింది. కరువు ప్రభావిత జిల్లాలలో ఎండిన పశుగ్రాసం, పశుదాణాను తక్షణమే సరఫరా చేయడం కోసం ఆర్థిక శాఖ ద్వారా రూ.33 కోట్ల మొత్తాన్ని విడుదల చేయడం జరిగింది.

వ్యవసాయం మరియు ఉద్యానవన శాఖకు సంబంధించి.. చిన్న, సన్నకారు రైతులకు సహాయాన్ని అందించే నిమిత్తం వ్యవసాయానికి రూ.298 కోట్లు, ఉద్యాన వనానికి రూ.2కోట్లు మొత్తం సహాయం కోసం కరువు నివారణకు ప్రతిపాదించమైంది. అలాగే, మైక్రో ఇరిగేషన్ ద్వారా రూ. 473 కోట్లు ఖర్చుచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు భరోసా కల్పించడానికి ఇచ్చే మొత్తం గతంలో రూ. 1.50 లక్షలుంటే, ఆ మొత్తాన్ని రూ.5.00 లక్షలకు పెంచడం జరిగింది. అత్యంత త్వరలో కేంద్రసహాయం రాబట్టడానికి ప్రయత్నం జరుగుతోంది. 235 మండలాల్లో కరువు కారణంగా వ్యవసాయ కార్యక్రమాలు మందగించడం వల్ల వ్యవసాయ కూలీలకు కూలి లభించని కారణంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం ద్వారా గతంలో కంటే ఎక్కువ ఉపాధి కల్పించవలసిన అవసరముంది. జీవనోపాధి కల్పించడానికి కరవుపీడిత మండలాల్లో 3.5 లక్షల కుటుంబాలకు 150 పనిదినాల జీవనభృతికి కల్పించడానికి రూ.560 కోట్లు ఎస్టిమేట్‌ను ప్రతిపాదించడం జరిగింది. అలాగే, 100 నుంచి 150 పనిదినాలకు పెంచడం జరిగింది. కూలిరేటును కూడా 20 శాతం నుంచి 30 శాతానికి పెంచడం జరిగింది. నీరు-చెట్టు కార్యక్రమం క్రింద పెద్దఎత్తున చెరువుల పూడికను తీయడం, గట్లు బాగుచేయడం ద్వారా ఈ నీరు-చెట్టు కార్యక్రమాన్ని పెద్దఎత్తున ప్రభుత్వం చేపట్టడం జరిగింది.

అధ్యక్షా, కరువు సేద్యంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీని కూడా పంటలకు పెంచడం జరిగింది.

అలాగే, రాయలసీమ ప్రాంతానికి సంబంధించి కొన్ని ప్రాజెక్టులను పూర్తిచేయాలని పెద్దలు శ్రీ సి.రామచంద్రయ్యగారు కొన్ని సూచనలను కూడా చేయడం జరిగింది. దానిపై కూడా ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు గారు సంబంధిత అధికారులు మరియు కాంట్రాక్టులతో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి ఒక నిర్ణీత కాలవ్యవధిలో ఆ ప్రాజెక్టులను పూర్తిచేయాలని ఆదేశాలివ్వడం జరిగింది. అన్ని పనులు ప్రారంభించడానికి అందరూ ఒప్పుకోవడం జరిగిందని నేను తమరిద్వారా సభ్యులకు తెలియజేసుకుంటున్నాను.

ముఖ్యంగా, వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి ప్రకాశం జిల్లాలో నీరివ్వడం జరుగుతుంది. హంద్రీ-నీవా ఫేజ్ - 2 పనులను పూర్తిచేసి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీరివ్వడం జరుగుతుంది. గాలేరు - నగరి ప్రాజెక్టును పూర్తిచేసి గండికోట రిజర్వాయరు ద్వారా కడపకు నీరివ్వడం జరుగుతుంది. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ద్వారా రాయలసీమకు నీరివ్వడం జరుగుతుంది. ఇవన్నీ ప్రతిపాదనలని చెబుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు: అధ్యక్షా, ప్రకాశం జిల్లాలో అన్ని మండలాలను కరువుపీడిత మండలాలుగా ప్రకటించిన తర్వాత వెలిగొండ ప్రాజెక్టు పనులను పూర్తిచేస్తామని చెప్పారు. ఇది మంచి వార్త. దానికి కేటాయింపులు ఏమిటి? ఆ ప్రాజెక్టు పనులను ఎప్పటిలోగా పూర్తిచేస్తారో తెలియజేయవలసిందిగా తమరిద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప: అధ్యక్షా, ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి కొన్ని ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యాన్నిచ్చి పనులను వెంటనే చేపట్టాలని ఆదేశాలివ్వడం జరిగింది. అందులో వెలిగొండ ప్రాజెక్టు కూడా ఉంది. అలాగే, కండలేరు ప్రాజెక్టు కూడా ఆ లిస్టులో ఉంది. రాయలసీమ ప్రాంతానికి నీరివ్వడం కోసం రూ. 1300 కోట్లతో పట్టిసీమ ప్రాజెక్టు పనులను కూడా చేపట్టడం జరుగుతోంది. పోలవరం ప్రాజెక్టును కూడా ఐదు సంవత్సరాలలో ఎట్టిపరిస్థితుల్లో పూర్తిచేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఉత్తరాంధ్రలోని వంశధార ప్రాజెక్టు, తోటపల్లి ప్రాజెక్టులకు కూడా అధిక ప్రాధాన్యతనివ్వడం జరిగింది. ఈ ప్రయారిటీ ప్రాజెక్టులన్నీ కూడా తప్పనిసరిగా పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు: అధ్యక్షా, మంత్రిగారు రాష్ట్రం గురించి చెబుతున్నారు. కరవు మండలాల గురించి చెప్పమనండి.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప: అధ్యక్షా, సభ్యులు శ్రీ చంద్రశేఖరరావు గారు చెప్పినట్లు మొదటి ప్రాధాన్యం కరవు మండలాలు. అందుకే, వెలిగొండ లాంటి ప్రాజెక్టుల గురించి చెప్పాను. రెండవ ప్రాధాన్యం, వంశధార మరియు తోటపల్లి ప్రాజెక్టులు. తప్పనిసరిగా కరువు జిల్లాలు, కరువు మండలాలకు సంబంధించిన ప్రాజెక్టులన్నింటిని వెంటనే ప్రారంభించడం జరుగుతుందని తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

గౌరవ సభ్యులు సి. రామచంద్రయ్య గారు చెప్పిన కనీస మద్దతు ధర విషయానికి వస్తే.. ఈ సంవత్సరం కొన్ని సమస్యలు వచ్చినప్పటికీ, ప్రభుత్వం ద్వారా ధాన్యాన్ని కొనిపించడం జరిగింది. 16.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 1.37 లక్షలమంది రైతుల ద్వారా కొనుగోలుచేసి నగదును వారి బ్యాంకు ఖాతాలో వేయించడం జరిగింది. అలాగే, పెద్దలు రామచంద్రయ్యగారు, ఆదిరెడ్డి

అప్పారావు గారు బ్యాంకుల గురించి చెప్పారు. బ్యాంకులు నమోదు చేసిన ఖాతాలు 83.28 లక్షలు. తొలి విడత, రెండవ విడత ఋణమాఫీ కోసం నమోదు చేసిన ఖాతాలు 51.45 లక్షలు.

మ.1.50

తొలివిడత, రెండవ విడత ఉపయోగించుకున్న రైతుల సంఖ్య 33.19లక్షలు. రైతులు కూడా శాటిస్‌ఫై అయ్యారు. ఎక్కువమంది 50 సంవత్సరాల లోపు ఉన్నారు గనక అందరికీ ఇవ్వడం జరిగింది. రూ.1.50 లక్షలు ఉన్న రైతులకు కూడా ఒక విడత ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం తప్పకుండా పూర్తి చేస్తాము. ఎక్కడైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగినా మాకు తెలియచేయమని గౌరవ సభ్యులను కోరుతున్నాను. ఎందుకంటే ఇది continuous process. కాబట్టి వాటిని కూడా క్లియర్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియచేస్తున్నాను. పెద్దలు చంద్రశేఖర్ గారు అడిగినదానికి సమాధానంగా- కరువు గురించి కేంద్రం నుండి రూ.1552 కోట్లు కోరడం జరిగింది. ఈ మొత్తాన్ని త్రాగునీరు, వ్యవసాయం తదితరాలకు కేటాయించడం జరుగుతుంది. వ్యవసాయానికి రూ.298కోట్లు, ఉద్యానవనానికి రూ.2 కోట్లు గ్రామీణ నీటి సరఫరాకు రూ.101 కోట్లు పట్టణ నీటి సరఫరా కోసం రూ.46 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.413 కోట్లు, ఉపాధి హామీ కోసం రూ. 562 కోట్లు , అదనపు పోషకాలకోసం రూ.108 కోట్లు మొత్తం 1550 కోట్లు కేటాయించడమవుతుంది. ఇంతకుముందు చెప్పినట్లుగా ఏప్రియల్ 1,2,3 తేదీలలో కేంద్ర బృందం కరువు మండలాలలో పర్యటిస్తుంది. 1,2 తేదీలలో రాయలసీమ ప్రాంతాలలోని మండలాలను తిరిగివచ్చి, 3వ తేదీన ముఖ్యమంత్రిగారితో సమావేశమై ఎంత మొత్తం ఇవ్వాలనేదానిపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మనవిచేస్తున్నాను. సభ్యులు శ్రీ ఆదిరెడ్డి అప్పారావు గారు పశువుల మేత గురించి అడిగారు. కరువు ప్రాంతాలలో పశువుల మేతను సరఫరా చేయుటకు అర్హత పొందిన కంపెనీ నుండి నాణ్యతాపరమైన పరీక్షలు చేయిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకూ 6,780 మందికి పశుగ్రాసం అందించింది. కావల్సిన వారందరికీ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంది. రాయలసీమ వంటి కరువు ప్రాంతాలకు కావలసిన చర్యలు తీసుకోవడానికి ఖర్చు పెట్టడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. శ్రీనివాసులు రెడ్డి గారు చిత్తూరు జిల్లా గురించి చెప్పారు. ఇప్పటివరకూ చిత్తూరు జిల్లాలో 1882 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాము. నీటి రవాణా కొరకు రూ.32కోట్లు చెల్లింపులు జరిగాయి. పట్టణ ప్రాంతాలైన పుంగనూరు, మదనపల్లిలలో మాత్రమే నాలుగు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేయడమవుతున్నది. మిగతా ప్రాంతాలలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీటిని ఇచ్చే బదులు ఇప్పుడు రోజూ నీటిని సరఫరా చేసే విధంగా తీసుకురావడమైంది. అలాగే, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులను కూడా సాధ్యమైనంత త్వరలో పూర్తిచేయడం జరుగుతుందని సభ్యులకు తెలియచేస్తున్నాను. సభ్యులు డా. బచల పుల్లయ్య గారు కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ ప్రాంతాలకు సంబంధించి మరింత మెరుగైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నది. ఈ ప్రాంతాలలో ఎక్కడా సమస్యలు రాకుండా చేస్తామని తెలియచేస్తున్నాను. శ్రీ రుద్రరాజు పద్మరాజుగారు, శమంతకమణి గారు కూడా కొన్ని సూచనలు ఇచ్చారు. వాటిని తప్పకుండా పాటిస్తామని మనవి చేస్తున్నాను. రాయలసీమలోని ప్రాజెక్టులకు ప్రాధాన్యాన్నిచ్చి త్వరగా పూర్తి చేసి, రాయలసీమకు నీరిచ్చే దిశగా ప్రయత్నాలు చేయడం జరుగుతున్నది. కరువును తప్పనిసరిగా ఎదుర్కోవలసిన అవసరం ఉంది. కేంద్రం నుండి నిధులు తీసుకురావల్సి ఉంది. సభ్యుల సూచనలను పాటించి ఈ కరువును ధైర్యంగా ఎదుర్కొంటామనే నమ్మకం మాకుందని చెబుతూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు ః ఏప్రియల్ మాసం మొదటివారంలో కేంద్రం నుండి వచ్చిన అధికారులు పర్యటించి మనం క్లెయిమ్ చేస్తున్నదానిని ఎసెస్‌చేసి శాంక్షన్ చేసే ప్రక్రియను చేపడతారు. కరువు నివారణకు సంబంధించి మనం చేసే క్లెయిమ్స్‌కి కేంద్రప్రభుత్వం ఇచ్చే సహాయానికి మధ్యలో చాలా గ్యాప్ ఉంటుందని మనందరికీ తెలుసు. ఎందుకంటే, కరువు మనకు ఇది మొదటిసారి కాదు. గతంలో అనేకసార్లు వచ్చింది. అనేకసార్లు కేంద్రం సహకారాన్ని అందించింది. మనం వెయ్యి కోట్లు అడిగితే వాళ్లు వాళ్లకున్న స్టాండర్డ్స్ ప్రకారం రూ.200కోట్లు లేదా రూ.300 కోట్లు ఇస్తున్న నేపథ్యంలో మనం అంతా కలిపి అడిగే సహాయం అరకొరగా మిగిలిపోయే ప్రమాదమున్నది. దీనిని ఎలా ఎదుర్కొంటారని నేను మంత్రిగారిని అడుగుతున్నాను. ఇప్పటికే గత ప్రభుత్వం డబ్బులు మంజూరు చేసి రూట్స్ వేసి పైపుల ద్వారా పంపడానికి ముఖ్యంగా చిత్తూరు జిల్లా పశ్చిమ ప్రాంతానికి సంబంధించి కండలేరు ప్రాజెక్టును రూపొందించడం జరిగింది. దానికి సంబంధించి మా పార్టీ తరఫున ఈ నెలలో ఆయా గ్రామాలలో ఉన్న ప్రజా సంఘాలు అన్నీ కలిసి పాదయాత్ర నిర్వహించి త్రాగునీటి సమస్యను నివారించేందుకు ఒక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టునుండి నీటిని తీసుకువచ్చేందుకు ఖచ్చితమైన సమయం చెప్పగలరా అని మంత్రిగారిని అడుగుతున్నాను. నెల్లూరు నుండి వచ్చే నీటిని తీసుకురావడానికి డబ్బులు కూడా మంజూరైన తరువాత పైపులైన్లు వేసే ప్రోగ్రామ్ అంతా తయారైన తర్వాత ఆలస్యం చేయకుండా తక్షణమే ఆ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లయితే చాలామేరకు చిత్తూరు జిల్లాకు సంబంధించిన కరువును రూపుమాపేందుకు అవకాశం ఉంటుంది. అందుకు structured plan ఏమిటి? ప్రభుత్వం చేస్తామని అంటోంది సంతోషమే. Structured Plan ని ఎప్పుడు మొదలు పెడతారు, డబ్బులు ఎప్పుడు శాంక్షన్ చేస్తారు, ఎప్పుడు రిలీజ్ చేస్తారు, కాంట్రాక్టర్లను ఎప్పుడు పిలిచి ఎప్పుడు పైపులు వేస్తారు, ఎప్పటిలోపు పూర్తిచేస్తారని నేను అడుగుతున్నాను. ఈ రకమైన structured plan ని వెంటనే ప్రకటించాలి. ప్రకాశం జిల్లాకు సంబంధించి వెలిగొండ ప్రాజెక్టును ఆపేశారు. అక్కడ కాంట్రాక్టర్లు పనిని వదిలిపెట్టి వెళ్లిపోయారు. కొండలోనుండి తొలుచుకుని వెళ్లవలసిన అవసరమున్నది. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకపోతే ప్రకాశం జిల్లాకు వచ్చేది ఏమీ లేదు. ఎన్నో ఉద్యమాలు చేసి, ఎంతో కష్టపడి ఇంతవరకూ తీసుకువచ్చాము. మా పార్టీ తరఫున తరతరాలుగా ఉద్యమాలు చేశాము. అందుగురించే మా సుబ్బయ్యగారి పేరు పెట్టారు. ఆయనే మ్యాప్‌లు తయారు చేసి, ప్లాన్ తయారు చేసి, ఇంజనీర్లను కన్సల్ట్ చేసి, రామకృష్ణయ్య గారితో మాట్లాడి సాధించారు. బ్రహ్మానందరెడ్డిగారితో మొదలు పెడితే రాజశేఖర రెడ్డి గారి హయాం వరకూ దానిపై మాట్లాడి మాట్లాడి సాధించుకోవడం జరిగింది. సంతోషకరమైన విషయం. కానీ, మధ్యలో ఆగిపోయింది. దొనకొండ ప్రాంతమంతా దీనికి వర్తిస్తుంది. కాబట్టి, కండలేరు, వెలిగొండకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. ప్రకాశం జిల్లాలో 54 మండలాలు కరువు పీడిత మండలాలు ఉన్నాయంటే, దాని సీరియస్‌నెస్‌ను అర్థం చేసుకుని దానికి ప్రాధాన్యాన్నివ్వాలని కోరుతున్నాను. కరువును శాశ్వతంగా నివారించేందుకు వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయడం ఒక్కటే ఏకైక పరిష్కారమార్గమని తెలియచేస్తున్నాను.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప ః అధ్యక్షా, కేంద్ర బృందం ఏప్రియల్ 1, 2 తేదీలలో పర్యటించడం జరుగుతుంది. 3వ తేదీన ముఖ్యమంత్రిగారితో సమావేశమవుతుంది. వారు మన పరిస్థితిని అర్థం చేసుకుంటారనే నమ్మకం ఉంది. కేంద్రం నుండి మాగ్జిమమ్ సహాయం వచ్చేందుకు అవకాశం ఉంది. ఎక్కడైనా తక్కువ వస్తే, దానిని రాష్ట్ర ప్రభుత్వం భరాయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు వెనకడుగు వేయవద్దని

ఆదేశాలిచ్చింది. కరువుని ఎదుర్కోవడంలో ఎంత డబ్బు ఖర్చుపెట్టినా ఫరవాలేదని అధికారులకు ఇప్పటికే సూచనలివ్వడం జరిగింది. ప్రభుత్వ ప్రయార్టీ ప్రాజెక్టులలో కండలేరు, వెలిగొండ ప్రాజెక్టులను పెట్టడం జరిగింది. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి సొరంగం చాలా వరకూ పూర్తయింది, ఇంకా కొద్దిగా ఉంది. దానిని కూడా పూర్తి చేయమని అధికారులకు, కాంట్రాక్టర్లను పిలిచి సమావేశం ఏర్పాటు చేయడమైంది. త్వరలో పని ప్రారంభమవుతుంది. ఈ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం పర్స్యూ చేసి తప్పనిసరిగా ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలియచేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ : సభను రేపు ఉదయం గం. 10.00 లకు వాయిదా వేయడమైనది.

(Then, the House adjourned at 1-58 p.m. to meet again on Thursday, the 26th March, 2015 at 10-00 a.m)

* * *